ఆంధ్రపత్రిక

సచిత్ర వారపత్రిక



ANDHRA PATRIKA
ILLUSTRATED WEEKLY
4 అణాలు. 11-4-56



కుంభకోణం, రామస్వామి ఆలయంలో చామర గ్రాహిణి

—ఫొటో: ఎన్. రామకృష్ణ.

సంవత్సర చందా
రు. 12-0-0
విడిప్రతిక 4 అ.

ఆంధ్రపత్రిక

సచిత్రవారపత్రిక

Founder : K. NAGESWARA RAO

సంపుటము 49
సంచిక 32
11.4-56

మన్మథ ఫాల్గుణ బహుళ అమావాస్య బుధవారం




"మత్తద్విరేఫ
పరిచుంబిత
చారుపుష్పాః"
—(ఋతు
సంహారం)

విషయానుక్రమణిక

ముఖచిత్రం:

"అ లి క మం దు తి ల క ము"

చిత్రకారుడు: జె. శశిభూషణ్-మద్రాసు



న్యూఢిల్లీ లేఖ

శ్రీ కృష్ణ
(ఆంధ్రపత్రిక ప్రతినిధి)

ఇతర దేశాలు పడినంతకష్టం పడకుండానే భారతదేశం పారిశ్రామిక సంపదను సాధించగలదని నాయకులు తలపోస్తున్నారు. అనవసరమైన శ్రమ పడకుండా పరిశ్రమలను నిర్మించాలనేది మన నాయకులకు మూఢసిద్ధాంతమై పట్టుకుంది. ఇతరదేశాల్లో జరిగిన లోటుపాట్లేమీ జరక్కుండా పరిశ్రమాభివృద్ధిని సాధించాలని వీరి ఆశయం. ఇంగ్లండులో పిల్లలచేత పని చేయించడం, పెద్దవాళ్ళచేత ఎక్కువ గంటలు పనిచేయించడం, మొదలైన అమానుషాచారాలను మాన్పించడంకోసం గొప్ప ప్రజోద్యమం లేవదీయవలసి వచ్చింది. భారతదేశంలో బ్రిటిష్ పరిపాలన మూలంగాను, బ్రిటిష్‌పోటీమూలంగాను పెట్టుబడిదారీ దోపిడిపద్ధతికి సంబంధించిన అత్యాచారాల ఉధృతం చాలవరకు లేదనే చెప్పాలి.


కుల రహిత, వర్గరహిత సమాజ స్థాపనం అనే ఆశయాన్ని మన రాజ్యాంగం నిర్దేశిస్తోంది. అంటే మనిషిని మనిషి దోచుకోడమనే పద్ధతి ఉండరాదన్న మాట. వచ్చిన ప్రశ్నేమిటంటే భారతదేశం ఇతర దేశాల అనుభవాలనుండి, ముఖ్యంగా బ్రిటన్ అనుభవాలనుండిఏమన్నా పాఠం నేర్చుకుంటోందా అని. శ్రేయోరాజ్యసిద్ధాంతం బ్రిటన్‌లో బయలుదేరింది. ఈ సిద్ధాంతంవల్ల బ్రిటిష్ ప్రజలకు ఏమి లాభించింది? భారతదేశం ద్వితీయ పంచవర్ష ప్రణాళికను ఉపక్రమించబోయే ఈతరుణంలో ఈ అంశాలన్నీ ముఖ్యంగా పరిశీలించవలసి ఉంది. ఇటీవల లండన్ 'టైమ్సు' సారస్వతానుబంధంలో "చైతన్యవంతమైన సమాజం" అనే శీర్షిక క్రింద ఒక వ్యాసం ప్రచురితమైంది:

"ఈ శతాబ్దారంభంలో చైతన్యవంతంగా ఉన్న కొన్నిదేశాలు ఇప్పుడు మరింత ఉత్సాహంతోను, చైతన్యంతోను ముందుకు సాగిపోతున్నాయి. అమెరికా ఇందుకు మంచి ఉదాహరణ. ఇదివరకు చైతన్య రహితంగా ఉన్న దేశాలు ఇప్పుడు చైతన్య వంతమైనాయి. రష్యా, చైనా, ఇండియా దీనికి ఉదాహరణలు. ఇప్పటికీ చైతన్యవంతంగా ఉన్న కొన్ని గేశాలు ఇదివరకంత చైతన్యవంతంగా లేవు. ఉదాహరణకు బ్రిటన్‌ను పేర్కొనవచ్చును."

పై దాన్ని బట్టి చూస్తే, ఒకప్పుడు ప్రపంచానికి ఆదర్శప్రాయుడుగా భావించబడిన బ్రిటిషు కార్మికుడు, ఇప్పుడు శ్రమపడకుండా తప్పించుకోవడంలో ఎలా ప్రవీణుడైందీ వ్యక్తమవుతుంది. దీనికి కారణం బ్రిటిషు కార్మికునికి జీతం గ్యారంటీ ఉండడమే.

కాని పశ్చిమ జర్మనీ సంగతి చూడండి. దారిద్ర్యపు కోరలనుండి తప్పించుకోడానికి వారానికి ఏడురోజులైనా శ్రమించడానికి సిద్ధంగా ఉన్న లక్షలాది కార్మికులు కనిపిస్తారు. పశ్చిమ జర్మనీలో సోమరులెవరైనా ఉన్నా, వారిని అంతగా పరిగణించనవసరం లేదు. రెండవ ప్రపంచ యుద్ధపువినాశనం నుండి తప్పించుకుని అభ్యుదయం సాధిస్తున్న పశ్చిమ జర్మనీని ప్రశంసించకుండా ఉండలేము.

ఇప్పుడు మనదేశంలో పరిస్థితి చూద్దాం. న్యూఢిల్లీలో ప్రధానమంత్రికార్యాలయం నుండి పోస్టు చేసిన ఒక ఉత్తరము పాత ఢిల్లీలో సెసిల్ హోటల్‌కు సరిగ్గా



రష్యా ఉప ప్రధాని శ్రీ మికోయాన్, సోవియెట్ రాయబారి శ్రీ మెన్షికోవ్ మార్చి 28న లోక్‌సభను సందర్శించారు. పార్లమెంటు భవనంవద్ద శ్రీ నెహ్రూ, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి శ్రీ సత్యనారాయణ సిన్హా వారికి స్వాగతం చెప్పి తీసుకువెళ్లుతున్న దృశ్యం.

★ న్యూఢిల్లీ లేఖ ★

72 గంటలలో చేరింది. ఇక కాగితాల వ్యక్తుల ఉత్తరాలు అసలు చోటుకు తప్ప మిగతా అన్ని చోట్లా తిరిగి తిరిగి చివరకు గమ్యస్థానం చేరుకుంటాయి. ఇదివరకు బాగా పనిచేసే ఒక శాఖ ఇప్పుడు శ్రేయోరాజ్య ప్రభావంవల్ల ఇలా తయారైంది.

కుమారి మణిబెన్ పటేల్ ఈ విషయానికి సాక్ష్యంగా, గడచిన మార్చి 22 వ తేదీన లోక్ సభలో ఇలా అన్నది: "విమానయానాలు ప్రైవేటు కంపెనీల చేతుల్లో ఉన్నప్పుడే బాగుండేవి. వాటిని జాతీయం చేసిన తరవాత పాడైపోయాయి" టెలిఫోన్ ఆపరేటర్లు మర్యాదగా ప్రవర్తించడం లేదని, తపాలా బట్వాడా లోపభూయిష్ఠంగా ఉందనీ, కార్డులు, కవర మీద తపాలాముద్రలు కూడా సరిగ్గా పడడం లేదనీ ఆమె ఉదాహరణలు చూపింది.

బ్యాంకి ఉద్యోగులను గూర్చి శ్రీ కావర్జీ భాభా ఇటీవల మాట్లాడారు. ఇంగ్లండులో బ్యాంకి ఉద్యోగులకు జీతాలెంతెంత ఇస్తారని ఎవరో శ్రీ భాభాను అడిగినట్లు పత్రికలలో పడింది. దీనికి సరియైన సమాధానం కావాలంటే బ్రిటిష్ బ్యాంకిలో ఉద్యోగి ఎన్ని గంటలు పని చేస్తాడు, ఎంతపని చేస్తాడు అనేది కూడా పరిశీలించాలి. బ్రిటన్‌లో లేబర్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు కూడా బ్రిటిష్ బ్యాంకులలో పని చేసే కాలాన్ని తగ్గించలేదు. బ్రిటిష్ బ్యాంకులలో ఈనాడు కూడా సాయంత్రం 3–15 గం. కు చెక్కు ఇచ్చి డబ్బు తీసుకోవచ్చు.

మన దేశంలో రేవు కార్మికుల సంగతి బాగా తెలిసినదే. శ్రేయోరాజ్య రక్షకుడు శ్రీ ఖండూభాయ్ దేశాయ్‌లాంటి వ్యక్తి కూడా పనిని బట్టి జీతం ఇవ్వాలనే పద్ధతి ప్రవేశపెట్టాల్సివచ్చింది.

పని చెయ్యడం అంటే మానవస్వభావానికి గిట్టదు. ఉద్యోగం పోతుందనే భయం ఉంటేనో, యజమానిపట్ల కాక దేశంపట్ల విధేయతా విశ్వాసాలుంటేనో తప్ప పని చెయ్యడం గిట్టదు. మన శ్రేయోరాజ్యాధినేతలు కార్మికులలో కర్తవ్యదీక్షను పెంపొందించకుండానే ఉద్యోగభయం తొలగించారు. దీనివల్ల మందకొడిగా పని చెయ్యడం, ఎగవెయ్యడం, ఉత్పత్తి తగ్గిపోవడం సంభవించాయి.

కార్మికవర్గానికి బంధువులైన కమ్యూనిస్టుల పుణ్యక్షేత్రంలో ఉద్యోగం పోతుందనే భయంగాని, దొరకదనే భయంగాని లేదు. కాని ప్రభుత్వ భయం ఉంది.

అందుచేత ద్వితీయపంచవర్ష ప్రణాళిక జయప్రదంగా నెరవేరాలంటే మన కార్మిక విధానం మారాలి. కార్మికులకు న్యాయం

మిసెస్ ఛైర్మన్!

మార్చి 19 న లోక్ సభకు శ్రీమతి సుషమా సెన్ అధ్యక్షత వహించారు. ఒక సభ్యుడు మాట్లాడబోతూ, హడావుడిలో "మిసెస్ ఛైర్మన్!" అని ఆమెను సంబోధించారు. శ్రీమతి సెన్ త్రుళ్లిపడి "అదేమిటది?" అన్నారు. సభ్యులంతా గొల్లున నవ్వారు.

అంతలోనే, ఆ సభ్యుడు శ్రీ డి. పి. సిన్హా పొరపాటు సవరించుకొని, "మేడం ఛైర్మన్..." అంటూ ప్రసంగం సాగించారు.



భారత వాణిజ్య శాఖ—రష్యా బృందం—వాణిజ్య పారిశ్రామిక సాంకేతిక సహాయాలపై మార్చి 27 న చర్చించారు! రష్యా బృందంలో ఉప ప్రధాని శ్రీ మికోయాన్, రాయబారి శ్రీ మెన్షికోవ్, భారతబృందంలో శ్రీ టి. టి. కృష్ణమాచారి, సర్దార్ స్వరణ్‌సింగ్ ఉన్నారు.

జరగవలసిందే. కాని కార్మికులు పెట్టుబడి దారులు కాక, దేశానికి తాము చేయవలసిన సేవ చేయగలగాలి.

రవాణాశాఖమంత్రిగారు ఒక్క కలం గీటుతో భారత విమానమార్గాల కార్పొరేషన్‌లో జీతాలను 52 లక్షలు అధికం చేశారు. అయినా కాంగ్రెసు సభ్యురాలు కుమారి మణిబెన్ పటేల్ మన విమానయానశాఖ సరిగ్గా పనిచేయడం లేదని ఆరోపించడానికి అవకాశం కలిగింది. ఇలాగే రైల్వేలలోకూడా అవినీతి పెచ్చు పెరిగి పోయిందనే చెప్పాలి.

*　　*　　*

భారత స్వాతంత్ర్యసిద్ధి తరవాత, అభివృద్ధి కార్యాలకు అవసరమైన నిపుణుల కోసం కొన్ని ప్రయత్నాలు జరిగాయి. నిపుణులకు సంబంధించిన ఫోగట్టా సేకరించడానికి నియమింపబడిన సంఘాలు తమ నివేదికలు సమర్పించాయి. నిపుణుల తరిఫీదు సంస్థలు చాలా చురుకుగా పనిచేస్తున్నాయి. మరికొన్ని సంస్థల ఏర్పాటుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. అయితే కొన్ని చిత్రమైన విషయాలు జరుగుతున్నాయి. అమెరికాలో తర్ఫీదుపొందిన ఒక భారతీయుడు గత మాసం భారతదేశం వచ్చాడు. రెండువేల రూపాయల జీతానికి ఉద్యోగం చేయగలనని దరఖాస్తు పెట్టాడు. భారతప్రభుత్వం 800 రూ|| జీతం మాత్రమే ఇవ్వజూపినది. ఆ యువకుడు తిరిగి అమెరికా వెళ్ళిపోయాడు. అతడిప్పుడు నెలకు అయిదువేల రూ||ల మీద ఒక అమెరికన్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు.

మరొక యువకుడు ఇంగ్లండులో స్వంత ఖర్చుమీద చదివి ఉద్యోగార్థం స్వదేశం వచ్చాడు. ఒక ప్రైవేటు కంపెనీ అతనికి నెలకు 450 రూ|| జీతం ఇవ్వడానికి, పదేళ్ళకి 550 రూ|| జీతంమీద ఉద్యోగం ముగించడానికి అతికష్టంమీద అంగీకరించింది. ఇప్పుడతడు తిరిగి ఇంగ్లండు వెళ్ళిపోయి 'వారానికి 12 పౌనుల జీతం తెచ్చుకుంటున్నాడు.

భారతదేశంలో సిద్ధాంతరీత్యా, అందరికీ ఉద్యోగావకాశాలు ఉన్నాయి. అయితే ఇవి అందుబాటులోమాత్రం ఉండవు. ప్రభుత్వాధికారుల, నాయకుల చుట్టాలకు మాత్రం ఈ అవకాశాలు చేతికందుతూ ఉంటాయి. సిఫార్సు లేనివాడికి అవి దూరమవుతూ ఉంటాయి. అవునుమరి, నిపుణుల తర్ఫీదుసంస్థలు, కొత్తవి ఇంకా ఏర్పాటు చేస్తే బావుంటుంది.

*　　*　　*

వలస రాజ్యవిధానాన్ని ఖండిస్తూనే, కేంద్రప్రభుత్వ బడ్జెట్ విషయంలో ఆ విధానాన్ని మనవారు అవలంబిస్తున్నారు.

ప్రతిఏడూ ఫిబ్రవరి ఆఖరిరోజున బడ్జెట్ సమర్పించబడుతుంది. తరవాత దానిమీద



చర్చలు జరిగి, ఆమోదించడం జరుగుతుంది. ఈ పద్ధతి 1921 లో అమలులో వచ్చింది.


కీ|| శే|| పండిట్ మోతీలాల్ నెహ్రూ కేంద్ర శాసనసభసభ్యుడుగా ఉన్నప్పుడు ఆయన ఒకపద్ధతి ప్రవేశపెట్టారు. అనధికార పక్షాల సభ్యులు బడ్జెట్‌లో ఏవిషయం మీదనైనా ప్రసంగించేందుకుగాను కొన్నిరోజులు కేటాయించడం జరిగేది. కొన్నికొన్ని ప్రధాన విషయాలను ప్రభుత్వ దృష్టికి తేవడానికి, ప్రతిపక్షసభ్యులు తమకు కేటాయించినకాలాన్ని వినియోగించేవారు. స్వరాజ్ పార్టీ సభ్యులు రాజ్యాంగ విషయాలమీద వాదిస్తే, స్వతంత్రసభ్యులు సైన్యాన్ని భారతీయంచేయడం విషయమై వాదించేవారు. భారత స్వాతంత్ర్యంతో ఈ పద్ధతి ఎగిరిపోయింది. ప్రతి శాఖ పద్దు క్రిందా కోత ప్రతిపాదనలపై చర్చకు కొన్నిగంటలుమాత్రమే కేటాయిస్తున్నారు. మంత్రిగారికి తమ పార్టీబలం తెలుసుగనక, ఏదో సమాధానం చెబుతారు; తరవాత ఆ పద్దులు ఆమోదించబడతాయి.

ఉదాహరణకు, మొన్న రవాణాశాఖ మంత్రి శ్రీ జగ్జీవన్ రామ్ విమానయానశాఖ క్రింద ఇంత నష్టం రావడానికి కారణాలు క్లుప్తంగా చెప్పేసి, కుమారి మణిబెన్ పటేల్ విమర్శకు సమాధానం చెప్పకుండానే, తమపార్టీ సభ్యులచేత హర్షధ్వానాలు చేయించుకుని కూర్చున్నారు. ఆ తరవాత ఆయన శాఖకు పద్దులను ఆమోదించడం యథావిధిగా జరిగిపోయింది. పార్లమెంటరీ ప్రజాస్వామ్యంతో ఆటలాడుకోవడంఅంటే ఇదే. న్యాయంగా ఒకశాఖలో అసమర్థత పెరిగిపోతున్నప్పుడు, నష్టం ఎక్కువగా వస్తున్నప్పుడు ప్రధానమంత్రి ఆ విషయాన్ని గురించి సరిదిద్దాలి. ఆశాఖమంత్రి ఏ అనారోగ్యం పేరో చెప్పకుని రాజీనామా ఇవ్వాలి. 1985 సం|| పు భారతప్రభుత్వ శాసనాన్ని తిరస్కరించడానికి ఒక ముఖ్య కారణం ఏమిటంటే భారతనాయకులు తమకునచ్చినపద్ధతిలో రాజ్యాంగం తయారు చేసుకోదలచారు. అదే ఇప్పుడు అమలు జరుగుతోంది. ★



అర్జున పాశుపతాస్త్ర ప్రదానం

శివపార్వతీ కళ్యాణోత్సవం





"నిత్యనూతన తాండవ నృత్యకేళి"

ఫొటోలు : కమ్రుద్దీన్‌ఖాన్ — కటక్.

సమస్యాపూరణం

ప్రాచీన గాథాలహరి

పి. గణపతిశాస్త్రి

౧

మాళవ రాజధాని ధారానగరంలో అప్పుడే సూర్యాస్తమయం అయింది. అస్తమిస్తున్న అరుణారుణ చైత్ర సంధ్యాశోభలు ధారానగర ప్రాసాద గోపురాలపై ప్రతిష్ఠించిన స్వర్ణకలశాలతో దోబూచులాడుకొంటున్నాయి.

అదే సమయంలో మాళవాధిపతి భోజరాజు రాజప్రాసాదంపై అంతస్తుపై కొలువు దీర్చి కవితాగోష్ఠిలో వినోదిస్తున్నాడు. మహారాజు దృష్టి ఎర్రఎర్రని సంజకెలుగుల సొగసులలో లీనమైపోయింది. ఆనంద తరంగితమైన అతని క్రీగంటిచూపు పక్కనే సమాసీనులైన కవీశ్వరులవైపు తిరిగింది. వారు మహారాజు భావం గ్రహించుకొని ఒక్కరు ఒక్కొక్క పాదం చొప్పున సాంధ్య వర్ణన కవిత చెప్పడం ప్రారంభించారు. "పరి పతతి పయోనిధౌ పతంగః" అన్నాడు కృష్ణకవి. సూర్యుడు సముద్రంలో పడిపోతున్నాడని దాని భావం. అయితే అంత మాత్రంచేత ధారాధిపతికి తృప్తికలగలేదు. తిరిగీ అతనిదృష్టి కళింగకవిమీదికి తిరిగింది. వెంటనే అతడు "ఉపవన తరుకోటరే విహంగః" అన్నాడు. "ఉద్యానవనంలోని చెట్లు తొర్రలలో విహంగం ప్రవేశిస్తున్నది." అని దాని తాత్పర్యం. ఇంకా మహారాజు తృప్తి తీరలేదు. ఆపక్కనే కూర్చున్న మహేశ్వర కవివైపు దృష్టిమరలించాడు. ఆయన వెంటనే "సరసిరుహో ముదరేషు మత్తభృంగః" అన్నాడు. సాయంకాలం కాగానే ముడించిన తుమ్మెద తామరపూవులో పడిపోతున్నదని ఆపాదం తాత్పర్యం. భోజునికింకా సంతృప్తి కలగలేదు. కొంచెం దూరంలో కూర్చున్న కాళిదాసకవిపై దృష్టి ప్రసరింప జేశాడు.

అతడు కొంచెంసేపాలోచించి "యువతిజనేషు శనైశ్శనై రనంగః" అని ఆ శ్లోకం పూర్తిచేశాడు. దానితో సభాస్తారులంతా ఒక్కసారిగా శిరఃకంపంచేసి ఔనౌనని ప్రశంసించారు. అంటే సాయంకాలం కాగానే యువతీజనంలో నెమ్మదినెమ్మదిగా మన్మథుడు ప్రవేశిస్తున్నాడని తాత్పర్యం. వెంటనే కాళిదాసకవి ఆశ్లోకం అంతా ఎంతో శ్రావ్యంగా పఠించాడు.

'పరిపతతి పయోనిధౌ పతంగః
ఉపవన తరుకోటరే విహంగః
సరసిరుహో ముదరేషు మత్తభృంగః
యువతిజనేషు శనైశ్శనై రనంగః"

శ్లోకపఠనం పూర్తిచేసేసరికి తిరిగీ సదస్యులలో హర్షామోద నినాదాలు చెలరేగాయి. వెంటనే మహారాజు తన మెడలో ముత్యాల హారంతీసి కాళిదాసకవి కంఠంలో అలంకరించాడు. సదస్యులు మహారాజు ఔదార్యం అనేక విధాలుగా ప్రశంసించారు.

అలాగ ఒక నిమిషం గడిచిన తరవాత ఆ పరిసరోద్యానవనంలో అందెల సందడి చెలరేగింది. అందరు అటువైపు చూచారు. ధారానగర వార నారీమణులా ఉద్యానవనంలో కందుక క్రీడ లాడుకొంటున్నారు. వారిలో ఒక సుందరి కందుక క్రీడలో మునిగి తేలుతూంది. అంటే ఆమె మాటిమాటికీ పై కెగిరిపడే పూలచెండు పసరి పచ్చికపై పడేటట్టుగా చేతులతో గట్టిగా కొడుతూంది. ఆమె సువర్ణకర కంకణాలు ఘలుఘల్లున మారుమోగాయి. నలనల్లని తళుకు బెళుకు చూపులు తుమ్మెదల బారులా పూలచెండువెంట నంటి పరిగెత్తాయి. అంతలో ఆమె శ్రవణాలంకారంగా అలంకరించుకొన్న నల్ల కలవపూవు తటాలున జారి ఆమె పాదాలమీద పడింది.

మహారాజు మనోజ్ఞదృశ్యంచూచి సమ్మోహితుడైనాడు. అది వర్ణించవలసిందని తిరిగీ కవీశ్వరులను ప్రార్థించాడు.

అక్కడి కవులందరు అనేక విధాలుగా ఆ మనోహర సన్నివేశం వర్ణించారు. కాని భోజుని కవేవీ నచ్చలేదు. అప్రయత్నంగా అతని కటాక్షం చిరునవ్వుతో చిందులు ద్రొక్కుతూ కాళిదాస కవివైపు ప్రసరించింది. అతడొకక్షణంలో ఈ క్రింది శ్లోకం ఆశువుగా చెప్పాడు:

"పయోధర రాకార ధరోహికందుకః
కరేణ రోషా దభిహన్యతే ముహుః
ఇతీవ నేత్రాకృతి భీత ముత్పలం
స్త్రియః ప్రసాదాయ పపాత పాదయోః"

కందుకం పయోధరాల ఆకారంధరించి వాటితో సామ్యం పొందింది. అందువల్లనే సుందరి రోషంతో ఆకందుకాన్ని అలాగ చేతులతో కొడుతూ శిక్షిస్తున్నది. నేత్ర సామ్యంవలన మరి నన్నుకూడా శిక్షింపగలదేమో! అన్న భయంవల్ల నేకాబోలు ఆ నల్ల కలవ ఆమె అనుగ్రహంకోసం పాదాలపై పడింది!" అని ఆ శ్లోక తాత్పర్యం.

ఆ వర్ణన వినగానే అందరు ఓహో అంటే ఓహో అని ఆనందించారు. వెంటనే మహారాజు వేరే ఒక నవరత్నహారం కవి కంఠంలో అలంకరించిసత్కరించాడు. తిరిగీ సభ్యుల సాధు వాదాలు మిన్నందుకొన్నాయి.

అంతలో కళింగకవి సవినయంగా ఇలా అన్నాడు:

"మహారాజా! పూర్వకాలంలో విక్రమాదిత్య చక్రవర్తి ఆస్థానంలో వెలిసిన కాళిదాస మహాకవీశ్వరులే తిరిగీ మన కాళిదాస మహాకవి రూపంలో అవతరించారు! దీనిలో ఏమీ అనుమానం లేదు!"

అటుపిమ్మట కృష్ణకవి నెమ్మదిగా ఇలాగన్నాడు:

"మహారాజా! వీరు కాళిదాస కవీశ్వరుని అపరావతారం అనడం భావ్యంకాదేమో! ఆయనకంటె వీరే అత్యధికులని నా అభిప్రాయం! ఎందుచేతనంటే — ప్రాచీన మహాకవి కేవలం కాళిదాసుడే! కాని ఈ మహాకవి కాళీదాసులు! వీరి నామధేయంలోని సుదీర్ఘదీర్ఘం వీరి మహా ఘనతకొక ఘుట్టి తార్కాణ!" అని తన చమత్కృతికి తానేమురిసిపోతూ సన్నగా ఒక్క చిరునవ్వు నవ్వాడు. అతని చమత్కృతికి మహారాజంతగా ఆనందించలేదుగాని మిగిలిన కవివర్గంలో కొంతమంది ఔనన్నట్లు తల లూపారు.

కాళిదాసకవి ఈ ప్రశంసకేమీ హర్షించ



భారతదేశమందు పూర్వకాలంనుండియు పెళ్లి ఆచారాలు మారలేదు. పెళ్లి కార్యమును, ఉత్సాహంతో రాబోవు కొన్ని సంవత్సరముల వరకు జ్ఞాపకముండునట్లు చేయు నిమిత్తం, సంగీతము, పుష్పములు, చక్కని క్రొత్త దుస్తులు, ఇప్పటికిన్నీ ఉపయోగించబడుచున్నవి.

పెళ్లి విందు ఈ ఆనందమయ ఆచారంలో చాలా గొప్ప భాగమైయున్నది. అందుచేతనే ఈ రోజుల్లో తమ అతిధులకు అత్యుత్తమ ఆహార పదార్థములను వడ్డించగోరుచున్న పేరుగాంచిన కుటుంబాలు, చాలా రుచికరమైన వివిధ రకముల భోజన పదార్థములను తయారుచేయుటకు డాల్డా గుర్తుగల వనస్పతిని వాడు [illegible]. వారు దాని స్వాఛ్ఛతను, శుద్ధతను, నమ్మవచ్చునని [illegible], డాల్డా ఎంతో ఖర్చు తక్కువయగునట్టిది.

[illegible], పెళ్లి సమయమందు ఆనందంగా విందులు, వేడుకలు జరుపుటకు డాల్డా చాలాసైన సహకారియగుచున్నది,

డాల్డా గుర్తుగల వనస్పతి



HVM. 265-X52 TL

★ సమస్యాపూరణం ★

లేదు. పైగా దీనిలో సన్నసన్నని ఎత్తి పొడుపున్నదనీ, కృష్ణకవి అధిక్షేపించడానికే అలాగ చమత్కరించాడనీ అనుకొన్నాడు. ఆ భావనతో అతని కన్నులలో కొంచెం రక్తిమ పొడచూపింది. ఆ సంధ్యా రక్తిమలో ఆ రక్తిమ ఎవరు గమనించనేలేదు. అంతటితో నాటి కవితాగోష్ఠి ముగిసింది.

౨

ఆరాత్రే కృష్ణకవి గృహంలో రహస్య మంతనాలు ప్రారంభమైనాయి. వాటికి కృష్ణకవే స్వయంగా అధ్వర్యం వహించాడు. అతని మంతనాలకు కళింగమహేశ్వరకవు లిద్దరు తందానతానా అని వంతలు పాడారు.

"ఈ కాళీదాసకవిగాడెక్కడ దాపరించాడయ్యా! పులిమీద పుట్రలాగ!" అన్నాడు కళింగకవి. "ఈ పుట్ర అంతేమిటో నేను కనుక్కుంటానుగా! మీ రేమీ కంగారుపడకండి!" అన్నాడు కృష్ణకవి అతిహేలగా!

"నేను మొదటే చెప్పాను! ఇతగాణ్ణి ఒక కంట కనిపెట్టి చూడండయ్యా అని. నా మాట మీ రిద్దరు చెవిని పెట్టారా? చేతులు కాలాక ఆకులు పట్టుకుంటే ఏం లాభం!... ఇక మనకీ ఆ స్థానంలో పచ్చి మంచినీళ్లైనా పుట్టవు!" అన్నాడు మహేశ్వర కవి.

కృష్ణ కళింగ మహేశ్వరకవులు ముగ్గురు అంత ప్రతిభావంతులు కారు. వీరంతా చచ్చి జెడి చాయంగల విన్నపాలన్నట్టు ఎలాగో అలాగ ఒక శ్లోకం అల్లేసరికి పైనించి చుక్కలు దుల్లేవి! ఇక జీవితంలో మరి ఏపని చెయ్యడానికీ తగిన శక్తిసామర్థ్యాలులేక వీరు ముగ్గురు కవిబ్రువులై కాళ్ళకు బలపాలు కట్టుకుని ఆ స్థానాలమ్మట తిరిగి తిరిగి ఎల్లాగో అలాగ ధారానగరం చేరుకొని కొంచెం కాళ్లు నిలవదొక్కుకున్నారు. భోజమహారాజు లవలేశమైనా కవితాశక్తి కల కవులందరికీ అక్షర లక్ష లిచ్చే వదాన్యుడు. సరసుడు. వారి శక్తిసామర్థ్యా లాయనకు తెలియక పోలేదు. అయినా అపారమైన ఆ మహారాజు కవితాభిమానంలో గోరంతలైనవారి కవితా శక్తులు కొండంతలుగా స్ఫురించేవి. అలాగ కొంతకాలం గడిచేసరికి కాళీదాస కవి ధారానగరాస్థానం సందర్శించడం జరిగింది. అప్పటినించీ వారు ముగ్గురు దివిటీముందు దివ్వెలై ఊరుకున్నారు. కాని ఆ దివ్వెలలో అసూయాగ్నులు దివిటీలై ప్రజ్వలించాయి! ఇటీవల జరిగిన కవితాగోష్ఠి అనంతరం ఆ దివిటీలే దావాగ్నులై ప్రజ్వలించాయి. కాళీదాసకవి కెలాగైనా దేవిడీమన్నా చేయిస్తే తప్ప మరి గత్యంతరంలేదని వారొక దృఢ నిశ్చయానికివచ్చి వేశారు. దానికోసమై వారు ముగ్గురు పరిపరి విధాలుగా తలలు పగలగొట్టుకున్నారు. కాని ఎంత సేపటికీ ఏమీ మార్గం స్ఫురించలేదు. కాళీదాసకవి కిప్పుడు భోజుని సహాపంక్తిని కూర్చుని హేమపాత్రలో విందారగించేటంతటి మహాగౌరవం కూడా కలిగింది. ఆ మహాగౌరవం తలుచుకొన్నకొద్దీ వారి గుండెల్లో కార్చిచ్చులు చెలరేగాయి!

కళింగకవి కొంచెంసే పూరుకుని ఒక్క నిట్టూర్పు విడిచిపెట్టి నెమ్మదిగా ఇలాగన్నాడు:

"ఏదైనా కాళీదాసకవికి తగుమాత్రం ప్రతిభ లేకపోలేదు! లేకపోతే దేవరవారికి ఆయనమీద అంతటి గౌరవ ప్రపత్తు లెలాగ కుదురుతాయి?"

"ఆఁ ఏమిటా ప్రతిభ! నా శిష్యులిలాంటి సమస్యాపూరణ శ్లోకాలు రోజు రోజు వేలాదిగా రాసిపారేసూంటారు! మా యింటావిడ ఆ తాటాకులు వేణ్ణీళ్లు కాచుకోడానికికూడా పనికిరావని దూరంగా విసిరి పారేస్తుంది! తెలిసిందా? ఏమిటంట ఆ ప్రతిభ?" అన్నాడు కృష్ణకవి.

"ఇచ్చకాలయ్యా! ఇచ్చకాలు! వాటితో ఈ రోజుల్లో ఎంతటి ఘనకార్యమైనా ఇట్టే సాధించవచ్చును!" అన్నాడు మహేశ్వరకవి.

"అదుగదే! ఈ కాలంలో మన ఆస్థానాల్లో ప్రతిభా పాండిత్యా లెవడికి కావాలయ్యా!" అన్నాడు కృష్ణకవి.


"ఏదైనా మహారాజు ఆయనంటే పంచప్రాణాలు ఇచ్చేస్తున్నాడు! ఇహ మనమెంత గిలగిల్లాడి గింజుకున్నా ఇంతే!" అన్నాడు కళింగకవి.

"అంతేనంటావా! చూడు నాతడాఖా!" అని గర్జించాడు కృష్ణకవి.

కృష్ణకవి చాలా పొడగరి. అతని ప్రతిభకూడా అలాంటిదేఅని ఆయన శిష్యులంటారుగాని, కంచుకాగడా వేసినా అది అతని కవితలో ఎక్కడా స్ఫురించదు! కాని ప్రభువర్యులను బుట్టలో వేసుకోవడంలో అతగాడు గట్టిదిట్ట! కొంతకాలం నుంచీ అతడా శక్తితోనే కొట్టుకువస్తున్నాడు.

ఇక కళింగకవి చాలాపొట్టి. అతనివి తేనెరంగుకళ్లు. కనుగుడ్లు చిన్న చిన్న చింతగింజల్లా కనిపిస్తాయి గాని వాటి లోలోపలి భావాల లోతులు మొసళ్లకేగాని తెలియవని ధారానగరంలో చెప్పుకుంటారు.

ఇక మహేశ్వరకవి, ఇతడంతగా పొడుగూ కాదు, పొట్టీకాదు. లేనివన్నీ ఉన్నవని



"నేను మై కాఫీనే
ఎన్నుకొనుచున్నాను"
"15 సంవత్సరములనుంచి అన్నిటికంటె
మేలని మా సంసారము మెచ్చుకొన్నది"
¼. ½. 1 పౌ. ప్యాకెట్లలో లభించును. & పౌ. 20. పౌ. 7, పౌ. 3, పౌ. 1. డబ్బాలలో లభ్యమగుచున్నది.

ప్రాతినిధ్యంలేని కొన్ని ప్రదేశాలకు ఏజెంట్లు కావలెను.
కాంట్రాక్టర్లు:
మై కాఫీ కంపెని,
అమిన్‌జికరై, మద్రాసు-29.

ఊహించుకోవడంలో మహా ప్రతిభాశాలి. ఆ ప్రతిభ ఓంప్రథమంగా అతని కవిత్వం మీదే ప్రసరించింది. దానితో అతడు తానల్లేదంతా మహాకవిత్వమే అనే భ్రమలో పడ్డాడు. ఆ సమయంలో కృష్ణకవి కూడా సరిగా అలాంటి భ్రమలో నే పడడం జరిగింది. దానితో వారిద్దరికీ పరస్పరసాహాయ్యం అత్యావశ్యకమై కూర్చుంది. అప్పటినుంచీ వారు పరస్పర కవితాస్తోత్రాలు ప్రారంభించారు. అవి వారికి తెలియకుండానే అతిశయోక్తులు పుణికిపుచ్చుకొని ఆకాశం తలదన్నేవి. అప్పటినుంచీ వారికి ప్రగాఢమైన మైత్రీ బంధం ఏర్పడింది. కృష్ణకవి పన్నాగాలు పన్నడంలోను, ముఖస్తుతిలా కనిపించకుండా ముఖస్తుతి చెయ్యడంలోను చాలా ఘటికుడు. మహేశ్వరకవి కలాంటి చాకచక్యాలేవీ తెలియవు. అతనిదగ్గర ఉన్న గొప్పదనమంతా ఒక్కటే.

అంతగా కవి కాకపోయినా కవిలాగే కనిపిస్తాడు. అంటే అతని దృష్టి ఎల్లప్పుడూ కవితాలోకాల్లోనే విహరిస్తున్నట్టు కనబడుతుంది. కాని యథార్థం అదికాదు. అది నిరంతరమైన సంసార చింతలవల్ల, పరిష్కరించడానికి తగిన శక్తి లేకపోవడంవల్ల ఏర్పడిన అలసత్వం మాత్రమే. దానితో కొంత పరధ్యానంకూడా మేళవించడంతో అతడావిధంగా కనిపిస్తాడు. ఉన్నవారందరిలో అతడే కొంత రూపసి. ఎప్పుడు కృష్ణకవిని అంటిపెట్టుకుని తిరుగుతూ అతని చెప్పుచేతల్లో ఉండడం వల్లనే మహేశ్వర కవి జీవయాత్ర కొంత సుగమంగా సాగిపోతూంది. వారిద్దరి మైత్రి నానాటికీ దృఢపడానికిది కూడా ఒక కారణమే. అంతలో హఠాత్తుగా కృష్ణకవి కళ్లు రెండు తారకల్లాగ తళతళా మెరిశాయి. ఆ విషమసమస్యాపూరణకతనికో ఒక మహోపాయం స్ఫురించింది. వెంటనే మహేశ్వర కవికేసి తిరిగి ఒక చిరునవ్వు నవ్వి హేళగా ఇలా గన్నాడు. "అన్నట్టు ఆ దాసీ పిల్ల ఇంకా మీ కాళ్లా వేళ్లా పడి తిరుగుతూందా?"

మహేశ్వరకవి ఈ ప్రశ్నతో కొంచెం చిన్నబుచ్చుకున్నాడు.

"ఎవరయ్యా ఆ తరళాయతాక్షి!" అన్నాడు కళింగ కవి.

"అదే ఆ అంతఃపురదాసి!" అని జ్ఞాపకంచేశాడు కృష్ణకవి. మహేశ్వరకవికిప్పటిదాకా ఆవిషయమే స్ఫురణకు రాలేదు. తరవాత కొంతసేపటివరకు మాట్లాడకూరుకుని—

"ఎందుకేమిటి? ఏమిటి కథ!" అన్నాడు.

ఇప్పుడీ ఆపత్సముద్రంలోనించి మనల్ని ఉద్ధరించగలిగినది అది ఒక్కర్తే!" మహేశ్వరకవి కదేమీ బోధపడక "ఏది నేనిమ్మధ్యన అటుకేసి వెళ్ళడమేమానేశానే!" అన్నాడు!

"మరి ఇక్కడినించి రోజూ అక్కడికి వెళ్ళి దానిని కొంచెం బుజ్జగించాలి!"

"ఎందుకు?"

"నేను చెబుతాగా!"

"అసలింతా ఎందుకో తెలియందే మళ్లీ ఈ అనవసరపు రొష్టంతా నా కెందుకయ్యా!"

"ఆ అంతఃపురదాసితో మళ్లీ కొంచెం గ్రంథం నడిపించమంటే కష్టంటే ఎలాగయ్యా! మహానుభావా!"

కాని ఆరహస్యమేదో ముందుగా చెప్పందే మహేశ్వరకవి దాని కంగీకరించలేదు.

కృష్ణకవికిక చెప్పక తప్పలేదు. సూచనామాత్రంగా నే తనమంత్రాంగం కొంచెం అతనికి తెలియజేశాడు. కళింగకవి అది విని—"మీరు సాక్షాత్తు అపర చాణక్యులే! దీనితో మనమంత్రాంగం పారి తీరుతుంది! దీనికిక తిరుగులేదు!" అన్నాడు!

కాని మహేశ్వరకవి మొట్టమొదట దాని కంగీకరించలేదు.

"ఏమో! ఇదంతా తిరిగి మనమీదే విరుచుకు పడుతుందేమో!" అన్నాడు.

కృష్ణకవి అతన్ని చాలాసేపు బుజ్జగించి "కవీశ్వరా! సాహసే లక్ష్మీః అన్నారు ధర్మవేత్తలు! ఆ సూక్తి విస్మరించారా?" అన్నాడు.

మహేశ్వరకవి—

"దానికి సాహసే—అలక్ష్మీః అనికూడా అర్థం చెప్పవచ్చునేమో!" అన్నాడు కొంచెం సంకోచిస్తూ.

కృష్ణకవికీ తటపటాయింపుతో ఒళ్లుమండిపోయింది.

"నీవంటి దద్దమ్మలకు చివరికి తలపై విరుచుకుపడేదా పెద్దమ్మే!" అన్నాడు దురుసుగా.

ఆ ఏకవచన ప్రయోగంతో మహేశ్వరకవి మరి మాటాడలేదు! మిగిలిన ఇద్దరు కృష్ణకవి మంత్రాంగంతప్ప మరి వేరే గత్యంతరం లేదన్నారు. మహేశ్వరకవి మరి కాదనలేకపోయాడు. ఓమ్మట వారిసమావేశం ముగిసిపోయింది.

3

అలాగ కొంతకాలం గడిచిపోయింది. ఒకనాటి రాత్రి మహారాజభవనంలో విందు జరిగింది. మహారాజు తనతో కలిసి విందారగించవలసిందని కాళీదాసకవినెంతో ఆప్యాయంగా ఆహ్వానించాడు.

రాత్రివేళ సముజ్జ్వల దీపకాంతిలో మహారాజు కాళీదాసకవి సరసన కూర్చుని విందారగిస్తున్నాడు. ఏవేవో చిత్రచిత్రమైన సరస ప్రసంగాలు సాగిపోతున్నాయి. పరిచారికలు వారికి కావలిసిన ద్రవ్యపదార్థాలు వడ్డిస్తున్నారు. రాణి లీలాదేవి సరసనే కూర్చుని వారికి కావలిసిన పదార్థాలేవో అతి జాగరూకతతో గమనిస్తున్నది. భోజునికి ధగద్ధగాయమానంగా వెలిగే దీపకాంతులలో లజ్జాన్వితమైన లీలాదేవి ముఖము, ఆమె కర్ణాభరణాలు, కంఠంలోని ముత్యాలహారాలు ఒక వినూతన సౌందర్యంతో మెరిసిపోతున్నట్టుగా స్ఫురించాయి. అతడొకమారు లీలాదేవివైపు మరి ఒకమారు కాళీదాస కవివైపు జాగ్రత్తగా పరకాయించి చూచాడు. తిరిగీ యథాప్రకారంగా శరపరంపరగా ఛలోక్తులు విసురుతూ చిరునవ్వులు చిందించాడు.

పొట్టుతో కలిపి పాగిచిన పెసరపప్పు వంటకం అంటే భోజుని కెంతో ప్రీతి. ఆనాడెందు చేతనో ఆవంటకం పొట్టుతో కలిపి పాగచడం జరగలేదు. పొట్టులేనిదే అది అతనికి సయించదు. కాని కవీశ్వరుని కావిధంగా వంటకం తయారుచేస్తేగాని రుచించదేమోననే సంకోచంతో పరిచారికలా విధంగా వంటకం తయారుచేశారేమో! స్వయంగా లీలాదేవే వంటకం ఆ విధంగా తయారు చేయించిందేమో! అని అనుకున్నాడు మహా

మధుమాస లయగ్రాహి

కమ్మని లతాంతముల
కు మ్మొనసివచ్చు మధు
పమ్ముల సుగీత నిన
దమ్ము లెసగం, జూ
తమ్ముల లసత్కిసల
యమ్ముల, సుగంధి వకు
ళమ్ములను నానుచు ము
ద మ్మొనర, వాచా
లమ్ములగు కోకిల కు
లమ్ముల రవమ్ము మధు
రమ్మగుచు విన్చె, నని
శమ్ము సుమనోభా
రమ్ముల నశోక నిక
రమ్ములును, జంపక చ
యమ్ములును, గింశుక వ
నమ్ములును నొప్పెన్.

(నన్నయ భారతం నుండి)



" మరల తరళ నవవసంత
మురుగు పెంచె తరులనోహో!
అరుణారుణ కిసలయముల
తరుణాంగుళి విలసనముల "

—ఫోటో: త్రిపాఠ వెంకన్న - కడప.

సమస్యాపూరణం

రాజు. కాని ఆ భావమేమీ పైకి స్ఫురించ నీయలేదు. పొట్టు లేకపోవడానికి కారణ మేమో ఒక చిన్న సమస్యారూపంలో తెలుసుకోవాలని అనుకున్నాడు. వెంటనే కాళిదాస కవి వైపు తిరిగి చిన్ని చిరు నవ్వుతో ఇలా గన్నాడు: "ముద్గదాళీ గద వ్యాళీ కవీంద్ర! వితుషా కథం?" 'కవీంద్రా! రోగాలకు నాగుబాము వంటి పెసరపప్పు వంటకంలో పొట్టులేక పోవ డానికి కారణమేమో?" అని ఆ సమస్య తాత్పర్యం.

కవి ఒక నిమిషంసే పూరుకుని నెమ్మదిగా ఆ సమస్య ఇలాగ పూర్తి చేశాడు:

" అంధో వల్లభ సంయోగే
జాతా విగతకంచుకా"

కంచుక పదానికి పొట్టు అనీ రవికఅనీ రెండర్థాలు. అన్నమనే వల్లభునితో కలయికతో పెసరపప్పు పొట్టు (రవిక) జారిపోయినదని దాని తాత్పర్యం.

మహారాజసమస్య విన్న తరవాత కవి సమస్యాపూరణం శ్రద్ధగా ఆలకించిన లీలా దేవి సమస్యాపూరణంలోని శృంగార వ్యంగ్యం గ్రహించుకొని మల్లెమొగ్గలా ఒక చిన్న చిరునవ్వు చిలకరించింది. వెను వెంటనే తలవంచుకొని లజ్జారుణమైన ముఖం మరిఒక పక్కకు తిప్పివేసింది. అయితే అరు ణారుణమైన ఆమె కపోలంమీద కర్ణాభరణం తళుక్కున మెరిసింది! కవి దృష్టి ఆ మెరుపు తరగలలో ఉయ్యాల లూగింది! మహారాజు ఈ సన్నివేశం అంతా ఒకకంట కనిపెట్టి చూస్తూనే ఉన్నాడు. అదంతా పరికించి చూచేసరికి అతని కేదో పూర్తిగా అర్థమయి పోయినదని అనిపించింది. మహారాజు కన్నులు జేవురించాయి. అతికష్టంమీద అతడా క్రోధం నిగ్రహించుకొని సమస్యా పూరణం చాలా చక్కగా ఉన్నదని కవిని ప్రశంసించాడు. తరవాత మరిఒక విషయం మీద వేరొక ఛలోక్తి విసిరి అక్కడ ఉన్న వారందరి ముఖాల్లోను చిరునవ్వులు వెలి గించాడు!

అటుపిమ్మట కొంతసేపటికి విందు ముగిసి పోయింది. తాంబూలసేవ జరిగిన అనంతరం కవి స్వగృహానికి బయలుదేరాడు. మహారాజ తనితెంతో ఆప్యాయంగా రాజభవనం సింహద్వారంవరకు సాగనంపాడు. కవి మహారాజు తనయెడల చూపించిన ఈ అపూర్వ గౌరవాని కెంతో మురిసిపోతూ తొందరగా స్వగృహం చేరుకున్నాడు.

అనంతరం మహారా జెవరినీ పలకరించ నైనా పలకరించకుండా సరాసరి శయ్యా గృహంలోనికి వెళ్లిపోయాడు. శయ్యా

(54-వ పేజీ చూడండి)



13

పొద్దు క్రుంకటానికి ఇంకెంతో సేపు లేదు. గాలివాన కాసేపు తెరపి ఇచ్చింది. సర్వజయ వీధి గుమ్మంలో నుంచునివుంది. దారిలో నిలిచిన నీటిలో గలగల చప్పుడు చేసుకుంటూ రాజకృష్ణ పాలిత్ కూతురు ఆశాలత - చెరువుకి నీళ్ళకి వెళుతోంది. "మా దుర్గా—అపూ ఎక్కడైనా కన్పించారా అమ్మాయ్?" అని ఆదుర్దాగా అడిగింది సర్వజయ.

"లేదు పిన్నీ; ఎక్కడా కన్పడలేదే! ఎక్కడికెళ్ళారు?" అని నవ్వుతూ "గోదురు కప్పలు చేరేలా ఎన్ని నీళ్లు నిలిచాయో చూశావా పిన్నీ?" అన్నది ఆశాలత.

"ఇంకాసేపటికి గాలివాన వస్తుందనగా మామిడికాయలు ఏరుకుందామని వెళ్లారిద్దరూ. ఆ వెళ్లటం మళ్లీ రానేలేదు. ఈ గాలివాన ఒకటి సిద్ధమైంది, చీకటికూడా పడింది. ఏమైపోయారో ఏమో!"

సర్వజయ ఆదుర్దాపడుతూ లోపలికి వచ్చింది మళ్లీ. ఏమిటి చెయ్యటం అని ఆలోచిస్తూండగా దొడ్డితలుపు తోసుకుని, తడిసి ముప్పందుమై నీళ్ళు కారుకుంటూ ఓ కొబ్బరి బొండాం చేత్తో పట్టుకుని ముందు దుర్గ, కొబ్బరిమట్ట ఒకటి ఈడ్చుకుంటూ వెనకాలే అపూ లోపలికి వచ్చారు. సర్వజయ గభాల్న పిల్లల దగ్గరకువచ్చి "ఏమైపోయారే? తడిసి తడిసి ఇలా వానిపోయారేమిటే? వాన వచ్చినప్పుడు ఎక్కడున్నారు?" అంటూ పిల్లవాణ్ణి దగ్గిరకు తీసుకుని, "అయ్యో, తలంతా ఇంత ముద్దయిందేమిట్రా?" అని మళ్లీ సంతోషంతో "ఈ కొబ్బరిబొండాం ఎక్కడ దొరికిందే దుర్గా?" అని అడిగింది.

దుర్గా, అపూ ఇద్దరూ గొంతు తగ్గించి మెల్లిగా "అరవకు అరవకు అమ్మా!

అనువాదం:
మద్దిపట్ల సూరి

జరిగినకథ:—

నిశ్చిందిపురం బెంగాల్‌లోని మారుమూల కుగ్రామం. ఆ ఊళ్లో చితికిపోయిన మధ్య తరగతి సంసారి హరిహరరాయ్. అతని భార్య సర్వజయ. కూతురు దుర్గ. హరిహరరాయ్ పెళ్ళయిన తరవాత కొంతకాలం దేశాలు పట్టిపోయి, శాస్త్రాలు, కావ్యాలు చదివి పండితుడై, పదేళ్ళకి తిరిగివచ్చి కాపరంపెట్టాడు. దుర్గ పుట్టిన చాలఏళ్ళకి అతనికి కొడుకు పుట్టాడు. వాడిపేరు అపూ. ఇంట్లో ఎప్పుడుచూసినా 'ఇవాళ ఎలా గడుస్తుందిరా భగవంతుడా' అనే చింతే. కాని పిల్లలకిదేం పట్టింది? దుర్గకి ఒక్కనిమిషం ఇంట్లో కాలు నిలవదు. ఎప్పుడూ ఏ తోటలోనో, ఏ చెట్టుకిందనో ఆడుకుంటూ ఉంటుంది. అపూ ఎప్పుడూ ఊహాలోకంలోనే గడుపుతాడు. వాడికి ప్రతిదీ కొత్తే. ప్రతిదీవింతే. వాడి జీవితపరిధిలోకివచ్చే ప్రతి సాధారణవిషయమూ అసాధారణమైనదిగా, అద్భుతమైనదిగా వాడికి కనిపిస్తుంది. ఒక రోజున ఆ ఊళ్లో భాగ్యవంతురాలైన భువన ముఖర్జీ వదినగారు అపూవాళ్ళ ఇంటికి వచ్చి, తమ మామిడిచెట్ల పిందెలన్నీ దుర్గ దొంగతనంగా కోసుకుపోతోందనీ, తమ ఇంట్లో పిల్లలాడుకునే పూసలదండ ఎత్తుకువచ్చిందనీ సర్వజయతో ఫిర్యాదుచేసి జగడమాడుతుంది. ఈ అవమానం భరించలేక సర్వజయ కూతుర్ని పట్టుకుని చావబాదుతుంది. దుర్గ దెబ్బలు తిని యింట్లోంచి పారిపోతుంది. అక్కకి దెబ్బలు తగిలాయని అపూ ఎంతో బాధపడ్డాడు. అక్కమీద వాడికి ఎక్కడలేని అపేక్ష కలిగింది.



★ పథేర్ పాంచాలీ ★

ఆ దొడ్డమ్మగారి తోటలోంచి వస్తున్నాం. ఇలా వస్తున్నామనుకో—ఈ కంచె ప్రక్కగా కొబ్బరిచెట్టు లేదూ, దానిక్రింద పడివుంది. మేమూ ఇలా బయటికి వచ్చేశాం. ఆవిడ అటునుంచి అలా తోటలోకి వచ్చింది" అన్నారు.

"అపూనుమాత్రం స్పష్టంగా చూసింది. బహుశా నన్ను కూడా చూసిందేమో!" అంది దుర్గ. మళ్లీ ఉత్సాహంతో మెల్లిగా— "చెట్టు మొదట్లోనే పడిఉన్నదమ్మా! మొదట్లో నేను చూడలేదసలు. సువర్ణరేఖ చెట్టుకింద కాయలేమైనా రాలాయేమో చూద్దామని వెళ్ళబోతూ, తీరా ఇటు చూసే సరికి ఈ మట్ట పడివుంది. అపూతో 'ఒరే, ఈ మట్ట లాక్కురారా, అమ్మ చీపురులేక చాలా ఇబ్బంది పడుతోంది. మంచి చీపు రవుతుంది' అన్నాను. తర్వాత—" అంటూ చేతిలోని కొబ్బరిబొండం కేసి ఇంత మొహం చేసుకుని చూస్తూ — పెద్ద బొండంకదూ అమ్మా?" అన్నది దుర్గ.

అపూ ఎంతో సంతోషంతో చెయ్యి ఊగిస్తూ "నేనిలా మట్ట లాక్కొని పరుగెత్తు కొచ్చాను—" అని చెపుతున్నాడు.

"మంచి ముదురుబొండమే. అక్కడ పెట్టు. కడిగి లోపలపెడతాను" అన్నది సర్వజయ.

కొబ్బరికాయ లేదు, కొబ్బరికాయ లేదు అని అనుకు నేదానివిగా అమ్మా నువ్వు! ఇదిగో కొబ్బరికాయ. కొబ్బరి లవుజాలు చేసి పెడతానన్నావు కదూ అప్పుడు. ఈసారి చెయ్యకపోతే ఊరుకోను నేను" అన్నాడు అపూ.

వాననీళ్లకి తడిసిన పిల్లల ముఖాలు జూకా మల్లెపూవుల్లా అందంగా కన్పిస్తున్నాయి. చలికి వాళ్ళ పెదిములు కప్పువేసినట్లు నలు పెక్కాయి. జుట్టు తడిసి ముఖంమీద, చెవులక్రింద అతుక్కుపోయింది. "రండి, వచ్చి ముందు ఆ తడి బట్టలు విప్పండి. కాళ్లు కడుక్కుని ముందు వసారాలోకి పదండి ఇద్దరూ—" అన్నది సర్వజయ.

తర్వాత కాసేపటికి సర్వజయ నీళ్లు తెచ్చుకుందామని భువనముఖర్జీ గారి నూతికి వెళ్లింది. ముఖర్జీ దొడ్డిగుమ్మం తలుపుదగ్గరికి వెళ్ళే సరికి లోపల ఆయన 'వదినగారు ఇల్లెగిరి పోయేట్లు కేకలెడుతూండటం' విన్పించింది.

"పదిరూపాయలు ఖర్చుపెట్టి తీసుకో వాలి తోట కావాలంటే. తేరగా ఎత్తుకు పోగానే సరా? వాళ్లు కొనుక్కున్న చెట్టే అయితే ఇలా గతిలేనివాళ్లొచ్చి ముట్టుకుంటే ఊరుకుంటారా? అపిల్ల ఉండనే ఉంది.

అది అ స్తమానం ఆ చెట్టుకిందే ఉంటుంది. చెట్టు చెట్టునీ పెల్లగించుకెళ్ళి ఇంట్లో పెట్టుకోగలదది. దానికి తల్లి వత్తాసుకూడా ఉందిలే. ఆవిడమాత్రం తక్కువదా? వాన వెలిసిందికదా, ఓసారి తోటలోకి వెళ్ళి చూసివద్దామని వెదుదునుకదా, ఇంత పెద్ద కొబ్బరిబొండం పట్టుకుని ఒకటే పరుగు ఆ పిల్ల. ఇంత శత్రుత్వం ఎక్కడా ఉండ దమ్మా! వీళ్లు నాశనంకాను! ఈ అసుర సంధ్యవేళా అంటున్నాను కదా, మళ్ళీ కొబ్బరికాయ తినకముందే వల్లకాట్లోకి పోతారు వాళ్లు—"

సర్వజయ దొడ్డిగుమ్మం బయటే నుంచుని కొయ్యబారిపోయింది. వానలో తడిసిన పిల్లల పసిముఖాలు ఆమె కళ్ళముందు కది లాయి—ఈ తిట్లన్నీ వాళ్ళకి తగిలే ఒక వేళ? అమ్మ బాబో! వీళ్లు నిలువెల్లా విషం ఉన్న మనుషులే! ఏంచెయ్యను అనుకుంది. ఆమాట తలపుకు వస్తేనే వణుకు పుట్టు కొస్తోంది. ఆమె ఇహ ముఖర్జీగారి అవర ణలో అడుగు పెట్టనేలేదు. ఆ వెదురుచెట్లు



రాజా సులోచన సౌందర్యసూచనలు!
"మీ చర్మమును మృదువుగాను మరియు మనోహరముగాను వుంచుకొనుటకు...
"లక్స్ టాయిలెట్ సబ్బు యొక్క మీగడవంటి నురగతో బాగా రుద్దుడు— అది ఎంతో పరిమళ మైనది.
తరువాత కడిగివేసి తుడుచుకొనుడు — మీరు ఎంతో హాయిగా నుందురు!
"శరీరమంతటి సౌందర్యము కొరకు పెద్దసైజు సబ్బును వుపయోగించుడు — నేను చేయుచున్నట్లు."
రాజా సులోచన
తెలుపుకు మరియు
శుద్ధతకు
లక్స్
టాయిలెట్ సబ్బును
కోరుకొనును
LUX
TOILET SOAP
సినిమా తారలకు సౌందర్యమునిచ్చు
శుద్ధమైన తెల్లని సబ్బు
భారతదేశంలో తయారుచేయబడినది
LTS. 476-X52 TL

కాఖోటకపు చెట్లక్రింద, వానకురిసి వెలిసిన రాత్రివేళ మిణుగురుపురుగులు ఎగురుతున్నాయి. అడుగు కదలటంలేదు. నీళ్లు తోడుకునే చిన్న బాల్చీ, బిందె బుజాన పెట్టుకుని ఆమె భయపడుతూ భయపడుతూ ఇంటికి బయలుదేరింది.

వస్తూ వస్తూ దారిలో అనుకుంది. ఆ కొబ్బరిబొండం వాళ్లకిచ్చేస్తే పోనీ అప్పుడూ తగుల్తాయా తిట్లు? ఆఁ ఎందుకు తగుల్తాయి? వాళ్ళది వాళ్లకిచ్చేసినా తగుల్తాయా ఏమిటి ఎక్కడైనా!

ఇంట్లో అడుగుపెడుతూనే "దుర్గా! ఆ కొబ్బరిబొండం తీసుకెళ్లి అసలు వాళ్ల యింట్లో యిచ్చిరా" అన్నది సర్వజయ.

అపూ, దుర్గ తెల్లబోయి తల్లి ముఖంకేసి చూస్తూ ఊరుకున్నారు.

"ఇప్పుడేనా?" అని అడిగింది దుర్గ.

"ఆఁ. ఇప్పుడే ఇచ్చిరా. వాళ్ళ దొడ్డి వాకిలి తలుపు తెరిచే ఉంది. చప్పున వెళ్లు. 'మాకు దొరికిందిది. ఇచ్చిపోదామని వచ్చాం తీసుకోండి' అని చెప్పిరా."

"అపూనుకూడా నాకు సాయంరమ్మను అమ్మా. బాగా చీకటిపడింది" అన్నది దుర్గ.

పిల్లలు వెళ్లగానే సర్వజయ తులసిచెట్టు దగ్గిర దీపారాధనచేసి, గళవస్త్రంతో సాగిలపడి, "అమ్మా! కొబ్బరిబొండం శత్రుత్వం కొద్దీ ఎత్తుకువచ్చింది కాదని నీకూ తెలుసు. ఆ తిట్లు నా బిడ్డలకు తగలకుండా చెయ్యి తల్లీ! నా పాపలను నీవే కాపాడు తల్లీ! నీవే నా బిడ్డల్ని కాస్త కనిపెట్టి ఉండు తల్లీ నీకు శతకోటి నమస్కారాలు" అని ప్రాధేయపడింది.

14

ఊళ్లో బడిపంతులు ప్రసన్నగారికి చిల్లర కొట్టు ఒకటుంది. ఆ కొట్టు ప్రక్కనే బడి. బెత్తం ఒకటి తప్ప బడికి అవసరమైన ఉపకరణాలు అట్టే యేంలేవు. ఆ బెత్తం అంటే పంతులుగారికే కాదు, పిల్లల తలితండ్రులకు కూడా మంచి విశ్వాసం. అంచేత పిల్లలు కాళ్లూ చేతులూ విరగ్గొట్టుకుంటూ కళ్లు పొడుచుకుంటూ ఉంటే చూస్తూ ఊరుకోకుండా కావలిస్తే చిత్తంవచ్చినట్లు బెత్తం ఉపయోగిస్తూ ఉండండని పంతులుగారికి చెప్పేవారు. పంతులుగారికి చదువుచెప్పే సామర్థ్యం, ఉపకరణాలూ అట్టే లేవు. అంచేత ఆ లోటంతా ఒక్క బెత్తంతో తీర్చేయాలనే ఆయన ఆలోచన. ఆ లోటును పూర్తిచేసే పిల్లలనైతే కాళ్లూ చేతులు విరగ్గొట్టుకోనివ్వరు కాని, కొనప్రాణంతో మాత్రం బ్రతికిఉండేట్లు లెక్కలేకుండా కొడుతూ ఉంటాడు.


పుష్యమాసం, పొద్దుటిపూట. అపూ బొంత కప్పుకుని ఎండవచ్చేదాకా ప్రక్కమీద అలాగే పడుకొని ఉన్నాడు. వాళ్ళ అమ్మ వచ్చి—"అపూ, చప్పున లేవరా. బళ్లోకి వెళ్లాలి ఇవాళ నువ్వు. నీకోసం పలక, పుస్తకాలూ అన్నీ తెచ్చి పెట్టారు. ఊఁ. లేచి, చప్పున ముఖం కడుక్కో. మీ నాన్న వెంటపెట్టుకు వెళ్లి బళ్లో దిగబెట్టి వస్తారు" అన్నది.

బడిపేరు వినపడగానే అపూ కళ్లు రెండూ తెరిచి, 'ఆ అంతా ఒట్టిదిలే.' అన్నట్లు తల్లి ముఖంకేసి తేరిచూశాడు. అల్లరిచేసే పిల్లల్ని, అమ్మ చెప్పినమాట విననిపిల్లల్ని, అన్నదమ్ములతో దెబ్బలాడేవాళ్ళని మాత్రమే బళ్ళో పడేస్తారని వాడి నమ్మకం. తాను ఎన్నడూ ఇలాంటి పనులు చేసి యెరుగడు. అలాంటప్పుడు తాను ఎందుకు బళ్ళోకి వెళ్లటం?

కాసేపయ్యాక సర్వజయ మళ్ళీ వచ్చి, "లేచి ముఖంకడుక్కోరా అపూ! నీకు అడిగినన్ని మరమరాలు పొట్లంకట్టి ఇస్తాను. బళ్లో తింటూ కూర్చోవచ్చు. లే, నాన్నా!" అన్నది. తల్లిమాటలు నమ్మలేక అపూ 'ఊహూఁ' అని, తర్వాత తల్లికేసి తిరిగి నాలిక బయటపెట్టి కళ్లుమూసుకుని ముఖం అదోరకంగా పెట్టాడు; కాని లేచే లక్షణాలేం కనపడలా వాడిలో. చివరికి తండ్రి రావటంతో అపూ ఇంక మారాం చెయ్యలేదు. వెళ్లక తప్పలేదు. తల్లిమీది కోపం కొద్దీ వాడికి కళ్లలో నీళ్లు తిరిగాయి. చిరుతిండి పొట్లం కట్టి యిచ్చేటప్పుడు—"మళ్ళీ నేనసలు ఇంటికి వస్తానేమో! చూడు." అన్నాడు.

"ఛా, ఛా ఇంటికి రాకపోవటమేమిటి? అలా అనకూడదు, ఛా." అంటూ వాడి గడ్డం పుణికి ముద్దెట్టుకుని, "బాగా చదువుకోవాలి నాయనా శ్రద్ధగా చదువుకుంటే అప్పుడు నీకెంత పెద్ద పెద్ద ఉద్యోగం వస్తుందనుకొన్నావ్! ఎంతో డబ్బు సంపాయిస్తావ్ అప్పుడు. ఏం భయంలేదు...ఇదుగో నండీ, వాడినేమీ అనవద్దని చెప్పండి పంతులుతో" అన్నది సర్వజయ.

హరిహరుడు అపూని బళ్లోకి తీసుకెళ్ళి దిగబెట్టి, "బడి విడిచిపెట్టేవేళకి మళ్ళీ నేను వచ్చి ఇంటికి తీసుకువెడతాను. చక్కగా రాసుకుంటూ కూర్చో. పంతులుగారు చెప్పినట్లు విను. అల్లరిచెయ్యకేం?" అని చెప్పి వెళ్ళాడు. కాసేపయ్యాక వెనక్కి తిరిగి చూస్తే తండ్రి వీధిమలుపు తిరిగాడు. ఇంక కన్పించలేదు. వాడు చాలాసేపు వంచిన తల యెత్తకుండా అలాగే కూర్చున్నాడు. తర్వాత భయభయంగా తలయెత్తి చూసేసరికి పంతులుగారు గల్లాపెట్టెముందు కూర్చుని, ఎవరికో సైంధవలవణం తూచి ఇస్తున్నాడు. కొంతమంది తనకంటె పెద్ద పిల్లలు చదరలమీద కూర్చుని, రకరకాల గొంతులతో ఏమిటో చదువుతూ, ముందుకీ వెనక్కి ఊయ్యాలూగుతున్నారు. తనకంటె చిన్న కుర్రాడొకడు స్తంభానికి చేరపడి, తాటాకులు నములుతూ కూర్చున్నాడు. బుగ్గను పుట్టుమచ్చఉన్న మరొక పెద్దకుర్రవాడు, దుకాణంలోని గల్లాపెట్టె ముందున్న ఎత్తు పీటక్రింద ఏముందో మరి, దానికేసి అదేపనిగా చూస్తున్నాడు. వాడి కెదురుగా ఇద్దరుముగ్గురు పిల్లలు తమ పలకలతో బొమ్మరిల్లు కడుతున్నారు. ఒక కుర్రాడు రహస్యంగా "హాజరు గుర్తువేశాను నేను" అని చెపుతున్నాడు. 'ఇదిగో నా మిఠాయి' అంటున్నాడు మరొక కుర్రాడు. అలా అంటూనే వాడు పలకమీద లెక్కవేస్తూ, మధ్య మధ్య బేరంలో మునిగివున్న పంతులుకేసి ఓరకంట చూస్తున్నాడు. అపూ తన పలకమీద గుణింతం పెద్ద పెద్ద అక్షరాలు రాస్తున్నాడు. తర్వాత యెంతసేపటికో సరిగ్గా గుర్తులేదు, కాని—"ఫణీ, ఏమిట్రా పలకమీదది?" అని కేకేశాడు పంతులుగారు



లల్లూరాం అండ్ కో.,
(స్థాపితము 1928.)
ఎన్నో సంవత్సరాలుగా మన్నికకు, నాణ్యతకు, సరసమైన ధరలకు ప్రసిద్ధిచెందిన
* ఇనుప పెట్టెలు * ఉక్కుబీరువాలు
* క్యాషు బాక్సులు
లల్లూరాం అండ్ కో,
వెలగలేటివారి వీధి, : : విజయవాడ - 1.
క్రొత్త షోరూమ్ - మారుతి సినిమా ఎదురుగా.

ఎదురుగావున్న పిల్లలిద్దరూ చటుక్కున పలకలు బోర్లించేశారు. కాని పంతులు గారి కన్ను కప్పటం చాలా కష్టం. "ఒరే, సత్తూ ఫణీ, పలక ఇలా తీసుకురారా" అన్నాడు పంతులు. అతడి నోట్లోంచి మాట వచ్చిందే తడవు ఆ పుట్టుమచ్చ కుర్రాడు పలక గుంజుకుని తీసుకెళ్ళి పంతులు గారి గల్లా పెట్టెదగ్గిర పెట్టాడు.

"హూ. ఏమిట్రా ఆటలు ఈపలకమీద? సత్తూ, వాళ్ళనిద్దర్నీ చెవులు పుచ్చుకుని యిలా లాక్కునిరారా."

ఆ పెద్దకుర్రాడు అలా పలకగుంజుకుని లాక్కెళ్ళటం, ఎదురుగా వున్న పిల్లలిద్దరూ బిక్కమొహం వేసుకుని, అడుగులో అడుగు వేసుకుంటూ పంతులుగారి దగ్గిరకు నడిచి వెళ్ళటం- చూసేసరికి అప్పూకి పొట్టచెక్కలయేటంత నవ్వు వచ్చింది. వాడు ఫక్కున నవ్వేశాడు. తర్వాత కొసేపు నవ్వు తమాయించుకుని, తమాయించుకుని మళ్ళీ ఫక్కున నవ్వాడు.

"ఎవర్రా ఆ నవ్వేది? ఎందుకురా నవ్వు తావ్! ఇదేమన్నా నాటకాల చావిడా? ఆఁ. ఇదేమన్నా నాటకాల చావిడా? అంట?"

నాటకాల చావిడంటే ఏమిటో అప్పూ యెరుగడు. కాని భయంతో వాడి ముఖం ముడుచుకుపోయింది.

"ఒరేయ్ సత్తూ, ఆ చింతచెట్టు కింద ఉన్నవాటిల్లో పెద్దదిచూసి ఒక రాయి యిలా తీసుకురారా."

అప్పూ భయంతో నిర్విణ్ణుడైనాడు. వాడికి కంఠంవరకు ఒళ్లంతా కొయ్యబారిపోయింది. కాని ఆ రాయి తెప్పించింది తనకోసం కాదు, ఆ పిల్లలిద్దరికోసం అని తర్వాత గ్రహించాడు. వయసుకు పసివాడని అయితే యేం, క్రొత్తగా చేరినవాడని అయితే యేం—పంతులుగారు ఈ దఫాకి మాత్రం వాణ్ణి విడిచిపెట్టేశారు.

మళ్ళీ మధ్యాహ్నం బడిపెట్టారు. మొత్తం అంతాకలిసి ఎనిమిదిమందో పదిమందో ఉన్న పిల్లలు, అందరూ ఇళ్ళదగ్గిర్నుంచి చదరలు తెచ్చుకున్నారు. అప్పూకి చదర లేదు. వాడు యింటిదగ్గిర్నుంచి చిరిగిపోయిన మొద్దు గోనెపట్టా ఒకటి తెచ్చుకున్నాడు. బడికిచుట్టూ దడికాని, గోడకాని యేమీ లేదు. చుట్టూ అంతా బయలుగా ఉంది. పిల్లలుమాత్రం లోపల వరుసగా కూర్చుంటారు. బడిచుట్టూ చెట్లతోపులున్నాయి. వెనకవైపున పంతులు గారి తాతలనాటి తోట ఉన్నది. పంపరపనస, జామ, మామిడిచెట్ల సందులనుంచి సాయంకాలపు ఎండ ఒళ్ళో స్తంభం మొదట్లోకి వచ్చి పడుతూంటుండి. దగ్గిరలో ఎటు వైపునా ఇళ్ళులేవు, చెట్లూ చేమలూతప్ప. ఒకవైపున సన్నటి కాలిబాట మాత్రం ఉంది.

ఉన్న పిల్లలు పదిమందీ గణగణ గంటలు కొట్టినట్లు—రకరకాల గొంతులతో పాఠాలు బట్టీ పెడుతున్నారు. "ఒరే కేవలాయ్, వాకి పలక కేసి ఏమిట్రా చూస్తున్నావ్? చెవులు ఎక్కతీసి గూబలు పిండేస్తాను ఏమనుకున్నావో?" అంటూ మధ్య మధ్య పంతులుగారు కేకలెయ్యటం వినిపిస్తూవుంది.


పంతులుగారు ఓ కుంజకు చేరగిలపడి, తాటాకు చదరమీద కూర్చున్నాడు. తలకు రాచుకున్న నూనెతో—అనుకున్న చోట ఆ కుంజంతా నల్లగా నిగనిగలాడుతోంది. సాయంత్రమప్పుడు సాధారణంగా ఊళ్లోని దీనూపాలిత్ కాని, రాజారాయ్ కాని అతడితో కబుర్లుచెపుతూ కూచోటానికి వస్తూ ఉంటారు. చదువుకోటంకంటె వాళ్లు చెప్పే కబుర్లు వినటమంటే అప్పూకి అపరిమితమైన యిష్టం. రాజారాయ్ తనకాలం నాడు వ్యాపారాల్లో లాభాల్ని జ్ఞాపకం తెచ్చుకుంటూ—తానెలా పొగాకువర్తకం ప్రారంభించిందీ ఆ కథ చెపుతున్నాడు. అప్పూ చెవులు దోరగించుకుని వింటున్నాడు. చిన్నది స్వంత దుకాణం ఒకటి పెట్టుకుని, పొగాకు పాయలుతీస్తూ కూర్చోటం, రాత్రివేళ నదిలో ప్రయాణం చెయ్యటం, ఆ పడవలోనే వంటచేసుకు తినటం, మధ్య మధ్య ఆ మహాభారతం, దాశురాయ్ కీర్తనలూ చిన్న దీపపు ప్రమిదముందు కూర్చుని చదువుకోవటం—బయట చీకట్లో టపటప వానచినుకులు పడుతూంటే—చుట్టుప్రక్కల ఎవరూ లేకపోవటం, వెనక గుంటలో కప్పలు బెకబెక లాడుతూండటం ఎంత బావుంటుంది! పెద్దవాడయాక తానూ ఒక పొగాకు దుకాణం పెట్టాలి...

ఆవీధినుంచి రాజకృష్ణసన్యాల్ వస్తాడంటే ఇంక ఆ రోజున ఈకబుర్లు మంచి పాకాన పడుతూంటాయి. ఎలాంటికథైనా కానీ, అది యెంత మామూలు విషయమైనా కాని—దాన్ని రక్తికట్టేట్లు చెప్పటంలో రాజకృష్ణ సన్యాల్ చాలా ఆరితేరినవాడు. సన్యాల్‌కి తీర్థయాత్రల పిచ్చి జాస్తి. ద్వారక, కేదారం, బదరీ-మొదలైనచోట్లకు ఒక్కడూ వెడితే తృప్తిగా ఉండేది కాదతడికి. వెళ్లినప్పుడల్లా భార్యనీ, పిల్లల్నీ తీసుకు వెడుతూండేవాడు. తీసుకువెళ్లినదంతా ఖర్చు పెట్టుకుని మళ్ళీ వచ్చేస్తూండేవాడు. చీకూ చింతా లేకుండా వీధి అరుగుమీద హాయిగా హుక్కా పీలుస్తూ కూర్చునేవాడు. సన్యాల్ గారిలాగా సాంసారికమైన చిక్కుల్లు ఏమీ లేకుండా, పల్లెటూళ్లలో అంత తీరుబడిగా కూర్చునేవాళ్లు, ఆ కాలపువాళ్లు ఇంకెవరూ లేరేమో అనిపిస్తుంది. తండ్రి కట్టించిన చండీమంటపంలో హాయిగా పీటంవేసుకు కూర్చునేవాడు.

హఠాత్తుగా ఓరోజున చూస్తే వీధి గుమ్మంతలుపు తాళంపెట్టివుంది. ఇంట్లో మనుషులున్న అలికిడే లేదు. ఏమిటి సంగతి! సన్యాల్‌గారు సకుటుంబంగా వింధ్యాచలానికో, చంద్రనాథ పర్వతాలకో యాత్రకి వెళ్ళారుట. చాలా రోజులవరకూ మళ్ళీ కనిపించనేలేదు. హఠాత్తుగా ఒకనాడు మధ్యాహ్నం . రెండుఎడ్లబండ్లమీద సామానులవీ వేసుకుని సకుటుంబంగా రావటం చూసి ఊళ్లో జనమంతా ఆశ్చర్యపోయారు. రావటంతోనే నలుగురు మనుష్యుల్ని పిలిపించి మోకాలు ఎత్తున పెరిగిన జిల్లేడు ఉమ్మెత్తల అడవిని ఛేదించుకుంటూ పోయి ఇంట్లో ప్రవేశించాడు.

ఓ దుడ్డుకర్ర చేతపుచ్చుకుని అంగలూ-పంగలూ వేసుకుంటూ ఒళ్లోకి వచ్చి "ఏం ప్రసన్నా! ఎలా ఉన్నావ్? చేపల పెంపకం ఎలా ఉన్నకేమిటి?" అని అడిగాడు.

ఎక్కాలు వల్లిస్తూ కూర్చున్న అప్పూ



★ పథేర్ పాంచాలి ★

ముఖం సంతోషంతో విప్పారింది. సన్యాల్ గారు చదర వేసుకుకూర్చున్న వైపుకు, ఇంకొక కూరెడు ముందుకు జరిగి కూర్చున్నాడు ఉత్సాహంతో. ఇవాళేదో బడికి ఇహ సెలవయినట్లు పలక, పుస్తకాలు ఒకవైపున పెట్టేశాడు. కథలకు మొహం వాచిపోయినట్లు అతడు చెప్పే ప్రతిమాట ఎంతో ఆసక్తితో కళ్లు అప్పగించి వింటూ కూర్చున్నాడు.

"నీలిమైదానానికి వెళ్లేదారిలో ఒకచోట—వెనక ఒకప్పుడు ఉళ్ళో మతిహాజ్ రా తమ్ముడు చంద్రహాజ్ రా అక్కడికి మట్టి త్రవ్వటానికో దేనికో వెళ్లాడట. వానలకు ఆచోటంతా జమికి క్రుంగిపోయి ఉందట. చంద్రహాజ్ రాకి హఠాత్తుగా అక్కడొక చోట అడుగున బిందె అంచు కంటబడిందట. అతడు వెంటనే చుట్టూ త్రవ్వి బయటికి తీసి, ఇంటికి తీసుకువచ్చి చూసుకునేసరికి, ఆబిందె నిండా పాతకాలపు నాణాలున్నాయట! అవి దొరకటంతో చంద్రహాజ్ రా కొన్నాళ్లు దర్జాగా వెలిగిపోయాడు—" ఈ కథంతా సన్యాల్ గారు కళ్ళారా చూసిందే!....

ఒకొక్కనాడు రైలుప్రయాణం ప్రసక్తి వచ్చేది. సావిత్రీ పర్వతం ఎక్కడున్నదీ, అదెక్కటం తన భార్యకి ఎంత ప్రయాసయిందీ, గాభిగయలో పిండాలు పెయ్యబోయేటప్పుడు పండాలతో ఎంత దెబ్బలాటయిందీ—అన్నీ వచ్చాయి. ఎక్కడో ఒకచోట భలే తినుబండారం లభించిందట—దానిపేరు 'ప్యాండా' అని చెప్పాడు సన్యాల్. ఆపేరు వినేసరికే ఫక్కున నవ్వొచ్చింది అపూకి — పెద్ద అయినాక తానుకూడా 'ప్యాండా' కొనుక్కుని తినాలనుకున్నాడు.

మరొకరోజున సన్యాల్ గారు రెక్కడి కథో చెప్తున్నాడు. అక్కడెక్కడో ఇదివరకు చాలా ఇళ్లు ఉండేవిట! సాయంకాలం వేళ తాము చింతలతోపుగుండా అక్కడికి వెళ్ళారుట!—సన్యాల్ గారు తాను ఎన్నోసార్లు చూశానని చెప్పినదాని పేరు 'చిక్కామసీద్' అని అన్నాడు. అదేమిటో అసలు మొదట అతడికి తెలియలేదట: తర్వాత మాటల సందర్భాన్నిబట్టి అది ఒక పాడుపడిన భవనం అని గ్రహించాడట—చీకటిపడుతూ పడుతూ ఉండగా తాము ఆ భవనంలో అడుగుపెట్టేసరికి అక్కడినుంచి ఓ గబ్బిలం రివ్వున ఎగిరిపోయిందట. అపూ ఊహించుకోసాగాడు—చుట్టూ చీకటి గుయ్యారంలా చింతల తోపు. ఎక్కడా నరమానవుడనేవాడు లేకపోవటం, సగం పడిపోయిన భవనద్వారం. లోపల అడుగుపెట్టేసరికల్లా ఓ గబ్బిలం రివ్వుమని యెగిరిపోవటం—రాణూ వాళ్ల పడమటివైపు రహస్యగృహంలాంటి చీకటికొంప అయిఉంటుంది...... అనుకున్నాడు.

సన్యాల్ గారు ఎక్కడో ఓ ఫకీరుని చూశాడట. అతడొక రావిచెట్టుక్రింద కూర్చుని ఉండేవాడట. కాస్త గంజాయి దమ్ము దొరికిందంటే చాలు మంచి హుషార్ తెచ్చుకుని, "అచ్ఛా, నీకేంపండు ఇష్టమో చెప్పు."అని అడిగేవాడట తర్వాత ఆ పండు పేరు చెప్పగానే ఎదురుగా ఉన్న ఏదో ఒక చెట్టును చూపించి—"అదుగో వెళ్ళి కోసుకు తెచ్చుకో" అనేవాడట. అక్కడికి వాళ్లు వెళ్లి చూస్తే మామిడిచెట్టున దానిమ్మకాయలు, జామచెట్టున అరటిపండ్ల గెలలు వ్రేలాడుతూ కన్పించేవిట.

రాజారాయ్ ఆ ప్రస్తావన అందుకుని, "ఈ మంత్రతంత్రాల గారడీలకేంలే! వెనక మా మామ ఒకాయన—"

దీనూపాలిత్ ఆ మాటకు అడ్డంవచ్చాడు. "మంత్రాలసంగతి వచ్చింది కనుక నేనొక కథ చెప్తాను వినండి. కథకాదు నేను కళ్ళారా చూసిన సంగతి. 'చేలేడాంగా'లో బండిమనిషి బుధూని చూశారా మీలో ఎవరైనా? రాజా చూసివుండకపోవచ్చు. రాజకృష్ణరాయ్ కచ్చితంగా చూశాడు. తాడు కట్టిన చెక్క చెప్పులు తొడుక్కుని అదో మాదిరిగా కుంటుకుంటూ కమ్మరి కార్ఖానాకి నాగటిదుంప చేయించుకోటానికని వస్తూ ఉండేవాడు. ముసలివాడు. సరిగ్గా నూరేళ్లు నిండా బ్రతికినవాడు. చచ్చిపోయి అప్పుడే యాభైయేళ్లు. అతడు మంచి వయసులో ఉన్న రోజుల్లో మేమెవరం అతడి ముంగిట్లో బంచలేక పోయేవాళ్లం. ఒకసారి—చాలా కాలంక్రితం మాట.-మాకు అప్పటికి ఇరవై, ఇరవైరెండేళ్లుండేవి. గంగానానానికెళ్ళి మేమందరం రెండెడ్లబండిలో తిరిగి వస్తున్నాం. బుధూ బండి అది. బండిలో నేనూ, మా పిన్ని, అనంతముఖర్జీ మేనల్లుడు రామూ—ఇపుడు ఖూల్నాలో కాపురం ఉంటున్నాడు, అతడూ ఉన్నాం. కాన్సోనా మైదానంలోకి వచ్చేసరికి ప్రొద్దు క్రుంకిపోయింది. ఆరోజుల్లో ఆ ప్రాంతంలో ఎంత భయంగా ఉండేదో రాజకృష్ణభాయికి బాగా తెలుసు. అసలే మైదానందారి, వెంట ఆడవాళ్లు, కాస్త డబ్బూ దస్కం కూడా ఉంది—పెద్ద దిగులు పట్టుకుంది. ఇప్పుడు క్రొత్తగా ఊరొకటి వెలిసిందే—సరిగ్గా అక్కడికి వచ్చేసరికి. ఏమయిందో తెలుసా? నలుగురు కారుదున్నల్లాంటి మనుషులొచ్చి బండి వెనకవైపు వసికర్రలు ఇటు ఇద్దరు, అటు ఇద్దరూ పట్టుకుని నిలవేశారు. చూశారూ బాబూ! ఇంక మాకు నోటమాట పెకలేదనుకోండి. ఎలాగో బండిలో ఒదిగొదిగి కూర్చుని ఉన్నాం. వాళ్లూ బండి నలాగే అంటిపట్టుకుని వెనక వెనకే వస్తున్నారు. బుధూ వాళ్లకేసి ఖబడ్దార్ అన్నట్లు చూశాడు. మమ్మల్ని మాట్లాడక ఊరుకోమని సంజ్ఞచేశాడు. సరే, ఊరుకున్నాం. బండి నవాబ్ గంజ్ ఠానాదగ్గరకు వస్తోంది. బజారు కన్పిస్తూనేవుంది. అప్పుడిహ వాళ్లలో ఒకరు—"ఉస్తాద్ జీ! పొరపాటైంది మాది. ముందు కనుక్కోలేకపోయినాం మేము. విడిచిపెట్టండి" అన్నారు. "అలా వీల్లేదు, ఇవాళ ఏమయినా సరే మిమ్మల్ని పోలీసుస్టేషన్ కి తీసుకెళ్లి అప్పగించక మానను" అన్నాడు బుధూ. చాలాసేపు కాళ్లా వేళ్లా పడ్డాక, బుధూ "సరే, ఇవాల్టికి వదిలివేస్తున్నాను. ఇంక ఎప్పుడూ ఇలా చెయ్యకండి" అన్నాడు. అప్పుడిహ వాళ్లు బుధూ కాళ్ళకి మ్రొక్కి వెళ్లిపోయారు. కళ్ళారా చూశాను నేను. వసికర్రల్ని వచ్చి పట్టుకున్న వాళ్లు మంత్రబలవల్ల ఆ కర్రలకు అలాగే అతుక్కుపోయారు. విడిపించుకోవటం వాళ్ళతరం కాలేదు. బండితోపాటు చచ్చినట్లు వచ్చారు. మేకులు దిగకొట్టినట్లయినారు. మంత్రతంత్రాల్ని మహత్తుఅంటే ఏమిటనుకున్నారు మరి!"

ఇలా కథలతోనే ప్రొద్దు క్రుంకిపోతూ ఉండేది. బడిచుట్టూ చెట్లమీద అక్కడక్కడ నీరెండ పడుతూండేది. పనస, అత్తిచెట్లకు పెనవేసుకున్న తిప్పతీగమీద చిన్న పిట్ట ఒకటి వ్రాలి, ముందుకి-వెనక్కి ఉయ్యాల లూగుతూండేది. బడిలోకి వచే

(౬౦-వ పేజీ చూడండి)

బహుమతి రు. 500

(గవర్నమెంటు రిజిస్టర్డు)

తెల్ల వెంట్రుకలను పోగొట్టును

రంగులనుచూచి మోసపోవద్దు. అది తాత్కాలికము మాసువాసనగల "మన్ మోహిని హేర్ ఆయిల్" అనేక వనమూలికలతో ఆయుర్వేద పద్ధతిలో తయారైనది 60సం॥ల వయస్సువరకు వెంట్రుకలను నల్లగా వుంచును. ఇదిగాక మెదడుకు చల్లదనము విచ్చును. ఉన్మాదము, తలనొప్పి వగైరా జబ్బుల రానీయదు. "జ్ఞాపకశక్తి"ని కంటిచూపును వృద్ధిచేయును. కొద్దిగా నెరసివుంటే ఒక సీసా రు. 3-8-0; 3 సీసాలు రు. 9-0-0 సగము నెరసివుంటే ఒక సీసా రు. 5-0-0. 3 సీసాలు రు. 12/- పూర్తిగ నెరసివుంటే ఒక సీసా రు. 7/-లు 3 సీసాలు రు. 18/- లు. ఇది పనిచేయదని నిరూపించిన రు. 500/-

GENERAL LABORATARIES,
(H. O) P. O. Rajdbanwar (H. Bag h).


సొగసులరాణివంటి చర్మ సౌందర్యము మీకున్నూ గలుగును!
దినదినమున్నూ అతి మనోహరముగా నుండుడు...
...సహజంగా రెక్సోనాతో
ఇది ఒక్కటే కేడిల్‌తో గూడిన సబ్బు
పెద్ద సైజులోకూడ దొరకును
RP. 139X52 TL

టైగర్

మా టైగరు పేరుకు మాత్రమే టైగరు. అది సీమ కుక్క కాదు, వేటకుక్కా కాదు. కుక్క పెద్దదే కాని చూసేవాడి గుండె లదరజేసే భయంకర లక్షణాలేమీ దానిలో లేవు. సాహస మనసే శూన్యం. పిరికితనానికి ముందు పుట్టింది. పోనీ మరో అందమేనా ఆకర్షణేనా ఉందా అంటే అదీ లేదు. అది మామూలు గోధుమరంగు ఊర కుక్క. అటువంటి కుక్కను మేము పెంచడమేమిటి? దానికి టైగరు అని పేరు పెట్టడమేమిటి అనిపిస్తుంది. ఎవరికైనా. ఈ విషయం మాకూ ఆశ్చర్యం కలిగిస్తూనే ఉంటుంది.

దానిని మేము ఎక్కడినుంచో తీసుకు రాలేదు. అదే వచ్చింది. అంతకుముందు ఎక్కడ ఉండేదో ఎలా ఉండేదో కాని ఒక రోజున మరో పది కుక్కలు తరుముకు వస్తూంటే అది మా యింటికేసి పరుగెత్తుకు వచ్చింది. అది తోకముడుచుకొని పరుగెత్తుతూ మధ్యమధ్య తరుముకువస్తున్న కుక్కలవైపుకు తిరిగి గర్రుమంటోంది. అది తల తిప్పేసరికి వెనకనుంచి కుక్కలు దానిని కరుస్తున్నాయి. అది అలాగే అడుగడుగుకీ తిరుగుతూ తంటాలు పడుతూ మా దొడ్డి వరకూ వచ్చి ఒక్క ఉరుకులో దొడ్డిలోకి వచ్చి పడింది ప్రాణం కాపాడుకుందుకు. కుక్కలదండు వెన్నంటింది. వాటిబారినుంచి తప్పించుకోవడానికి ప్రయత్నిస్తోంది. కుక్కల గోల విని మా గోపీ, మా అన్నయ్య పిల్లలు రాముడూ, కృష్ణుడూ, సుబ్బారావూ ద్యాగుడుమూత ఆట కట్టిపెట్టి పరుగెత్తుకు వచ్చారు. కొంతసేపు తమాషా చూస్తూ నిలబడ్డారు. చివరికి అలా పది కుక్కలు ఒక్క కుక్కమీద పడటం చాలా అన్యాయమని తోచింది కాబోలు. వాళ్ళు ఆ ఒంటికుక్క పక్షం తీసుకొని దాడి వచ్చిన దండును కొడ్డలతో తరిమివేశారు. అంతకు ముందు వరకూ తోక ముడుచుకున్న కుక్క మళ్లీ ధైర్యం రాగా పెద్దగా అరుస్తూ కొంత దూరం దండు వెనకాల పరుగెత్తి తిరిగివచ్చి అరుస్తూ నిలబడింది రంగం తనదే అయిందని చెపుతున్నట్లుగా. దాని గోల నాకు చిరాకు కలిగించింది కాని దానినప్పుడు తరిమివేస్తే అది మళ్ళీ ఆ దండుబారిని పడుతుందని ఊరుకున్నాను.

గోపీవాళ్లు ఆ కుక్కకేసే చూస్తూ నిలబడ్డారు. గోపీ నన్ను కేక వేశాడు. "నాన్నా చూడు పాపం ఈ కుక్కనెలా కరిచాయో అవన్నీ" అని. నేను వెళ్ళి చూశాను. నిజంగానే దాని ఒంటిమీద చాలా కాట్లున్నాయి. అది ఆ కాట్లు నాకుతూ, అయాస పడుతూ, మధ్య మధ్య దండుపోయిన వైపుకు తిరిగి అరుస్తోంది. "సరే దానినేమీ చేయకండి. దానిదారి నదే పోతుంది." అని చెప్పి నేను నా కుర్చీలో కూలబడ్డాను. పిల్లలు కుక్క దగ్గరనుంచి కదలలేదు. కొంతసేపటికి నలుగురూ ఏమి ఆలోచించుకున్నారో వంటింటివైపుకు పరుగెత్తారు. అక్కడ వాళ్ళకు చీవాట్లు ఎదురయ్యాయి కాబోలు నాదగ్గరికి పరుగెత్తుకు వచ్చారు. "నాన్నా, కుక్కకన్నం పెట్టమంటే పెటలేదు చూడు" అన్నాడు గోపీ. నేను వాడితల్లిని కేకవేసి "పోనీ కాస్త 'అన్నం' పడేయకూడదూ" అన్నాను. పిల్లలు అన్నం ఆకులో పట్టుకు వెళ్ళి కుక్కముందు పెట్టారు. అది ఒక్క నిమిషంలో ఆకు ఊర్చి వేసింది. వాళ్లు 'పాపం పాపం' అంటూ అక్కడే నిలబడి ఉన్నారు. "ఇకపోయి ఆడుకోండిరా" అనేవరకూ వాళ్లు అక్కడనుంచి కదలలేదు.

పిల్లలు రాత్రిపోయి చూస్తే ఆ కుక్క అక్కడే ఉంది. మళ్లీ అన్నం పెట్టారు వాళ్లు. మర్నాడు పొద్దున్న పెట్టారు. రాక రాక మంచిచోటుకే వచ్చి పడ్డాననుకుంది కాబోలు. అది మా దొడ్లోనే స్థిరనివాస మేర్పరచుకుంది. మా పిల్లల స్నేహం సంపాదించడానికి పూనుకుంది. పిల్లలు కనబడగానే తోక ఆడిస్తూ పరుగెత్తుకురావడం, నేలమీద వంగి నమస్కారాలు చేయడం, వాళ్ళ కాళ్ళముందు నేలమీద వెలకితలపడి కాళ్ళు పైకి తిప్పుతూ కూకుకూకుమని కూయడమూ మొదలు పెట్టింది. పిల్లలనే కాకుండా పెద్దలను కూడా మంచి చేసుకోవడం చాలా అవసరమనుకుంది కాబోలు మేమెవరం వెళ్ళినా అలాగే నమస్కారాలు చేస్తోంది.

పిల్లలప్పుడే దానికి 'టైగరు' అని పేరు పెట్టివేశారు. 'టైగరేమిటిరా, అది ఉత్త పిరికికుక్క అయితే" అన్నాను నేను. అయినా వినిపించుకుంటేగా వాళ్లు. అది టైగరు కాకపోయినా దాని నలా పిలుచుకోవడం వాళ్లకు గొప్పగా ఉంది. వాళ్లప్పుడే దానిని స్నానం చేయించివేశారు. పుళ్లకు పౌడరద్దివేశారు. దానితో కబుర్లు చెప్పడం కూడా మొదలు పెట్టారు. తిరువాత అందరూ కలిసి గోపీచే నాదగ్గరికి 'డెప్యుటేషన్' పంపారు. "నాన్నా' మా టైగరుకొకబెల్టూ గొలుసూ తెప్పించవూ" అని అడిగాడు గోపీ. అదేపనిగా వేధించగా బజారునుంచి బెల్టూ గొలుసూ తెప్పించక తప్పిందికాదు. ఆ బెల్టు టైగరు మెడలో బిగించి, గొలుసుతగిలించి దానితో ఊళ్ళోకి షికారుకు బయలుదేరారు గర్వంగా. రెండురోజుల నుంచీ కడుపునిండా తిండి దొరుకుతోంది కాబట్టి వాళ్ళవెనకాల హుషారుగా పరుగిడుతోంది టైగరు. బెల్టూ గొలుసూతో టైగరు చూడడానికి బాగానే ఉందనిపించింది.

గోపికీ, మా అన్నయ్య పిల్లలకీ అస్తమానూ కుక్కగొడవతప్ప మరొకటి లేకపోయింది. దాని కప్పుడే వెనకకాళ్ళమీద లేవడం, నడవడం నేర్పివేశారు. ఇంకా ఎన్నో 'ఫీట్సు' నేర్పయత్నంలో ఉన్నారు. ఎప్పుడో కుక్కల సర్కసు పెట్టాలనీ, దానికి కానీ కానీ టికెట్టు పెట్టాలనీ నిశ్చయించుకున్నామని నాతో చెప్పాడు గోపీ. తమ సర్కసుకి ఎవరెవరిని ఊరికే రానీయవచ్చో ఆలోచిస్తున్నారట. నా పేరు లిస్టు మొదట్లోనే ఉందట. తమ టైగరు ప్రతాపం చూపించేందుకు వాళ్లు దానిని ఊళ్ళో కుక్కలమీదికి ఉసికొల్పుతున్నారు. అది పెద్దగా అరుస్తూ ముందు కురికేది. అవతలది దానికన్నా పిరికిదైతే దాని బండారం బయటపడేదికాదు. కాని అవతలదే కాస్త మొండి రకము అయితే టైగరు చటుక్కన వెనక్కి పరుగెత్తుకువచ్చి మాగోపీగాడివాళ్ల వెనక నిలబడి మహాపౌరుషంతో అరచేది. మాయింటికెవరు వచ్చినా అరిచేది. దాని అరుపులకు భయపడి ముష్టివాళ్లుకూడా రావడం మానివేశారు మాయింటికి. అదీ మంచిదే అనుకున్నాం కాని రెండురోజుల తరువాత ఒక గడుగ్గాయి ముష్టివాడు కర్ర చూపి బెదరించాడు దానిని. అంతే అప్పటినుంచి బిచ్చగాడెవడైనా వస్తున్న అలికిడైతే చాలు టైగరు వీధిలో ఎక్కడా కనబడేది కాదు.

మరిరెండు రోజులికి మా అన్నయ్య ఊరునుంచి తిరిగివచ్చాడు. అన్నయ్యను చూడగానే. టైగరు 'భౌంయ్, భౌంయ్'మంటూ అడ్డుపడింది. గోపీవాళ్ళూ కంగారుగా పరుగెత్తుకు వచ్చి గొలుసు పట్టుకొని దానిని దొడ్లోకు లాగుకుపోయారు. "ఏమిటిరా ఈ వెధవకుక్క ఎక్కడినుంచి వచ్చింది? మన అరుగుమీదనుంచి అరుస్తోందేమిటి?" అని అడిగాడు అన్నయ్య. మా అన్నయ్య దృష్టిలో కుక్కను పెంచడంవంటివి వెర్రి వేషాలు. అవి ఏమీ గిట్టవు. అందువల్ల నేను

వాసమూర్తి

అడిగిన ప్రశ్నకి జవాబు చెప్పకుండా మరో విషయం మీదికి మళ్ళించాను. "వెళ్ళినపని ఏమయింద"ని.

కాని అన్నయ్యకు తెలియకుండా ఎంత కాలం ఉంటుంది. పిల్లలు టైగరును పెంచుతున్నారని "ఏరా వెధవల్లారా, దానిని వెంటనే వదిలి పెట్టేస్తారా లేదా" అని కేకలు వేశాడన్నయ్య. టైగరు అన్నయ్యముందు చాలా ప్రాధేయపడింది. 'తాను ఫలానా అని నాకు మొదట్లో తెలియ లేదు. అందువల్ల అలా అరిచాను. ఇంకెప్పుడూ అలా చేయను నన్ను తరిమి వెయకండి.' అని తనభాషలో ఏదో చెప్పుతుంది. కాని అన్నయ్యకు నక్క భాష తెలియదు. కాబట్టి టైగరు ప్రార్థనలన్నీ నిష్ఫలమయ్యాయి. అన్నయ్య కర్ర తీసుకు వచ్చారు. అన్నయ్య చేతిలో కర్రచూసిగా టైగరు ప్రాణం సంకటంలో పడింది. తన రక్షకులకేసి చూసింది ఆశగా- కాని వాళ్లు నలుగురూ ఒక్క మొగాలు వేసి ఏమీ చేయలేక చూస్తూ నిలబడ్డారు. టైగరు ఇక లాభం లేదనుకొని నేలమీద సాష్టాంగ పడింది. ఘొల్లకిలాపడింది. అన్నయ్య కర్రతో తోశాడు. అది కదలలేదు. నేలకంటుకు పోయినట్లుంది. అన్నయ్య కొఖరుకు మండి కర్రతో ఒకటి పెట్టాడు. అది కుయ్యో కుయ్యోమంటుందే కాని కదలదే. పిల్లలు నలుగురూ ఏడుపు మొగాలు వేశారు. గోపీ కళ్లలో నీళ్లు స్పష్టంగా నిలిచాయి. అన్నయ్య మళ్ళీ ఇంకొకటి వేశాడు. ఆఖరికి ఉండలేక నేనే అన్నాను. పోనీలే అన్నయ్యా, పిల్లలేదో ఏడుస్తారు. దానివల్ల మనకు పెద్ద ఇబ్బంది లేదు కదా. పూటకు కాసిని అన్నం మెతుకుల ఖర్చు తప్ప. ఇది ఉండడం వల్ల కొస్త దొంగల గొడవకూడా తగ్గింది."

*

అంతకు ముందు మాకు దొంగలబాధ ఒకటి ఎక్కువగా ఉండేది. దొంగతనాలంటే పెద్దవి కావు దొడ్లో ఏదుంటే అది ఎత్తుకుపోవడం వంటివే జరిగేవి ఆఖరికి పుల్ల వుంటే పుల్ల, పుడక వుంటే పుడక, ఎత్తుకుపోయేవారు. మా ఇళ్లు ఊరికి ప్రక్కగా ఉన్నాయి. మా ఇళ్ళ వెనకాల అన్నీ పొలాలూ, తోటలే. మాకీ పెద్ద పెద్ద దొడ్లున్నాయి. అందువల్ల మేము ఎప్పుడూ భయపడుతూ ఉండవలసి వస్తూండేది. పోలీసులకు రిపోర్టు చేయడానికి తగిన దొంగతనాలా కావు. పోని గ్రామంలో నే బందోబస్తు చేదామంటే మా వూళ్ళో అంత ఐకమత్యం లేదు. అందువల్ల మాకు యీ దొంగలబాధ తప్పలేదు. కాని టైగరు వచ్చినప్పటినుంచి అదెలాంటిదో తెలియదు కాబట్టి ఎందుకైనా మంచిదని దూరంగా నే ఉండిపోతున్నట్లున్నారు దొంగలు.

అన్నయ్య, "సరే-అయినా దీన్ని ఆట్టే




ఈ మంచువలె నున్న క్రీమ్ మీ సౌందర్యమును అధికము చేయుటలో సహాకరించును

దీనితో మీ చర్మము మృదువుగ, సహజముగ సుందరముగ ఉండును

...లోపములు కనపడక నిష్కళంకముగ ఉండును

మీరు ఎల్లప్పుడూ మనోహరముగ ఉండాలనుకోవడమూ సహజమే! అద్భుతమైన పాండ్సు వ్యానిషింగ్ క్రీమ్ వాడితే సులభముగ అలా ఉండగలరు.

రోజూ ఉదయము, పాండ్సు వ్యానిషింగ్ క్రీమ్ పైపైన రాసుకోండి, కొన్ని సెకండ్లలోనే అది మాయమవుతుంది! కాని అది చర్మమును నిష్కళంకముగ మృదువుగ చేస్తుంది. నవవికసిత పుష్పమువలెనున్న మీ ముఖ వర్చస్సుకు అందరూ ఆశ్చర్యపడుట మీరు గమనిస్తారు!



ముఖము మీద పౌడరు అంటుకుని ఉండేలా చేసే ఒక అద్భుతమైన సాధనము!


మీరు పౌడరు రాసుకునేటప్పుడు లేక మేకప్ చేసుకునే ముందు ప్రతిసారి జిడ్డు లేని వ్యానిషింగ్ క్రీమ్ పైపైన రాసుకోండి. అది పౌడరును గంటల తరబడి సమంగా అంటుకుని ఉండేలా చేస్తుంది! మంచువలె నున్న పాండ్సు వ్యానిషింగ్ క్రీమ్ రాసుకుంటే రోజంతా మీరు మనోహరముగా ఉంటారు.

పాండ్సు వ్యానిషింగ్ క్రీమ్

క. 277.

నెత్తిమీద కెక్కించుకో కూడదు. ఇంట్లో తిరిగి పాడుచేస్తుంది" అని లోపలికి వచ్చే వాడు. టైగరుకు తనస్థానం తెలుసు. నెత్తి మీది కెక్కించుకుందా మన్నా నెత్తిమీద కెక్కే రకం కాదు. అది వీధి అరుగుమీద దొడ్లోనూ తప్ప ఎన్నడూ ఇంటి లోపలికి అడుగు పెట్టలేదు. మా దగ్గర ఎంత చను వయినా దూరంగానే నిలబడి తోక ఆడిం చేది. పిల్లలదగ్గరైనా ఎప్పుడూ కాళ్ళెత్తి వాళ్ళని తాకేదికాదు. అందువల్ల టైగరు మా ఇంట్లోనే ఉండిపోయింది. కడుపు నిండా తిండి పడడంవల్ల అది బాగా బలు స్తోంది.

కాని ఉన్నది ఊరికే ఉండక కొన్ని కొత్తచిక్కులు తెచ్చిపెట్టింది టైగరు. చుట్టు ప్రక్కల ఇళ్ళు పరిశోధించడం మొదలు పెట్టింది. రోజుకొకరి ఇంటికి వెళ్ళి చూసి వస్తోంది. మాకు కుడిప్రక్క శంకరంగారు న్నారు. ఆయన కొడుకులిద్దరూ ఉద్యో గాలు చేస్తున్నారు. కూతురు కాపురానికి వెళ్ళిపోయింది. శంకరంగారు వ్యవసాయం చూసుకుందుకు ఇక్కడే ఉంటున్నారు. ఇంట్లో లింగూ లిటుకూమంటూ ఆయనా, ఆయన భార్యే ఉంటున్నారు. శంకరం గారి భార్యకు తగని ఆచారం చాదస్తం. రోజుకు కనీసం రెండుసార్లేనా ఇల్లంతా కడుగుతుంది ఆవిడ. ఇంటికి ఎవరేనా వచ్చి వెళ్ళిన తరువాత వాళ్ళు లేచినచోట కాసిని నీళ్లు చల్లితేకాని ఊరుకోలేదు. ఆవిడ చాద



స్తము ఎంతవరకూ వెళ్ళిందం టే సాయంత్రం వేళ భర్త పొలంనుంచి ఆవును తోలుకొస్తే ఆవుమీదా ఆయనమీదా గోమయం కలిపిన నీళ్ళు చల్లితే కాని లోపలకు రానీయదు. అటువంటి ఇంటిమీద పట్టించింది టైగరు. ముఖ్యంగా శంకరం గారితో స్నేహం చేయా లనిపించింది కాబోలు దానికి. అడ్డంగా పెరిగిన ఆ స్థూలాకారం చూస్తే దానికి ప్రత్యేకాకర్షణ కలిగింది కాబోలు. ఒకరోజున శంకరంగారు గొడుగు వేసుకొని వీధిలోకి పోతున్నారు. హాఠాత్తుగా టైగరు తోక ఆడించుకుంటూ ఆయన దగ్గరకి పరు గెత్తింది. శంకరంగారు చేతులు పైకెత్తి "ఏమేవ్, ఏమేవ్ రావే" అంటూ పొలి కేకలు పెట్టారు. శంకరంగారి భార్య లోపలినుంచి పరుగెత్తివచ్చి చీపురుకట్ట తీసు కుని టైగర్‌ను కొట్టుతోంది. "స్నేహం చేయడానికి వస్తే ఈ మర్యాద ఏమిటి?" అన్నట్టుగా చూస్తూ టైగరు అక్కడనుంచి కదలలేదు. గోపీ వాళ్లూ పరుగెత్తుకువెళ్ళి టైగ రును పట్టుకున్నాడు. "మీదా నాయనా, యీ కుక్క. ఇలా ఊరిమీదికి వదిలేస్తే ఎలా? అందరినీ కరవదూ? దిక్కుమాలిన కుక్క! దీనిమూలాన మళ్ళీ నూతిదగ్గరకి పోయి నాలుగు చేదలు నెత్తిమీద గుమ్మరించుకో వాలి" అనుకుంటూ లోపలికి పోయింది ఆవిడ. పిల్లలు టైగర్‌ను లాగుకువచ్చారు.

కాని ధ్యాని దృష్టి శంకరంగారిమీదే ఉం టోంది. మళ్ళీ ఇంకోనాడు శంకరంగారు వాళ్ళ అరుగుమీద కూర్చొని ఉండడము చూసింది. అక్కడికి పరుగెత్తింది. శంకరం గారు దానిని చూసి కంగారుగా లోపలికి పరుగెత్తబోయి కాలుజారి మెట్లమీదనుంచి గుమ్మడికాయాలా క్రిందకు దొర్లిపోయారు. మేము ఆయనదగ్గరకు పరుగెత్తాం. లోపల నుంచి ఆయన భార్య "అయ్యో, అయ్యో, అదేమిటండీ" అంటూ పరుగెత్తుకు వచ్చింది. శంకరంగారు మాటలేకుండా వుండి పోయారు. అది చూసి ఆయన భార్య గుండె బాదుకుంటూ "అయ్యో భగవంతుడా, ఏం కష్టం తెచ్చిపెట్టావురా? పిల్లలేనా దగ్గర లేకపోయారుగదరా భగవంతుడా. ఈ దిక్కు మాలిన కుక్క ఎక్కడనుంచి దాపురించిం దండోయ్ మీ ప్రాణాలకి" అంటూ పెద్ద పెట్టున 'శోకన్నాలు' పెడుతూ మధ్య మధ్య "దీని శ్రాద్ధం పెట్టా! దీనిని పొయిలో పెట్టా" అంటూ మా టైగరుని 'శాపన్నాలు' కూడా పెడుతోంది. ఊళ్లోవాళ్లు ఆవిడ యేడుపులు విని పరుగెత్తుకు వచ్చారు. మమ్మల్ని తలో మాటా అన్నారు. మేము శంకరంగారిని యెలాగో లేవదీసి నిలబెట్టి పట్టుకున్నాం. మాఅన్నయ్య అక్కడికి వచ్చి సంగతి తెల్సు

కొని "వెధవ కుక్కను పెంచటం నాకు మొదటినుంచీ యిష్టం లేదు. ఈ పూటే దాని భరతం పడతానుండండి" అన్నాడు. నేను శంకరంగారిని అడిగాను: "ఏమండీ ఎక్కడ కరిచింది" అని. ఆయన కళ్లుమూసు కొని ఉండిపోయారు. జవాబీయలేదు. ఆయన వరసమాని: "అయ్యో నాయనోయ్, ఎక్కడో కరిచే ఉంటుందోయ్. ఇంక ఏం దిక్కురోయ్ భగవంతుడోయ్. వెనక మా అన్నయ్యకొడుకు ఇలా కుక్కకరిచే ఆరు నెలలకు వెళ్లిపోయాడురోయ్. ఏంరాత రాసి పెట్టావురా భగవంతుడా, భగ వంతుడా—" అంటూ ఆరున్నొకటో రాగం లయతాళబద్ధంగా ఆలాపించసాగింది. మేము శంకరంగారి మొగంమీద కాసిని చన్నీళ్లుచల్లి, కాసిని లోపలికిచ్చి, నడ్డితట్టి మళ్లీ అడిగాం కుక్క ఎక్కడ కరచిందని. ఆయన కొంతసేపటికి వేగంగా ఊపిరిపీలుస్తూ విడుస్తూ: "హ—కరవలేదు—హ— కాని—హ—దాన్ని చూసి—హ—పడి పోయాను" అని చెప్పారు. వచ్చినవాళ్లకు నవ్వాపుకోవడం కష్టమైంది. కాని ఎలాగో శంకరంగారిని లోపలికి సాయంపట్టుకువెళ్లి మంచంమీద పడుకోబెట్టాం. మా టైగరు కరిచేరకంకాదనీ, దానికేమీ ఆయన భయ పడనక్కర్లేదనీ చెప్పి ఇంటికి వచ్చాను.

అన్నయ్య కర్రతీసుకొని ఇల్లంతా వెతి కాడు. దొడ్డిఅంతా వెతికాడు. ఎక్కడా టైగరుకానీ, పిల్లలుకానీ కనపడలేదు. ఆ సమయంలో వాళ్లు కనిపిస్తే కుక్కనీ వాళ్లనీ కూడా చావకొట్టేవాడే. కాని పిల్లలు ఆవేళ అన్నయ్య కెదురుపడలేదు. మరి రెండు రోజులవరకూ టైగరును అన్నయ్య కంట బడకుండా చూశారు. మూడో రోజుకి అన్నయ్య కోపంకూడా చల్లబడింది. "వెధవల్లారా, పగలస్తమానూ దానిని కట్టే యించండి" అని చెప్పి ఊరుకున్నాడు.

శంకరంగారికి చట్ట తెణికి మూడురోజులు మంచంమీదనుంచి లేవలేదు ఆయన. తరువా తైనా వీధిలోకి పోవలసివస్తే ఒక పెద్ద కర్ర తీసుకొని ఇటూ అటూ చూసుకొని మరీ పోతున్నారు. మా పిల్లలు టైగరును పగలు కట్టే ఉంచుతున్నారు. ఎప్పుడో ఆట సమ యాన్ని విడిచిపెట్టినా కూడాఉండి చూస్తు న్నారు. అయినా ఎప్పుడో ఏమరుపాటున పిల్లలు కొంచెంసేపు దానిమాట మరచి పోయారు కాబోలు. అది వెంటనే ఒకసారి శంకరంగారి యింటికివెళ్ళి వచ్చేసింది. మరి కొంతసేటికి శంకరంగారిభార్య వాళ్ల గోడ అవతల నిలబడి మా యింటోవాళ్ళ నందరినీ కలిపి తిట్టడం మొదలుపెట్టింది. ఆ తిట్లు వింది మా వదినగారు. అవతల ఆవిడ ఎందుకలా అరుస్తోందో విచారించకుండానే వెంటనే

అవతల ఆవిడకు మించిన తిట్లతో గొంతుక విప్పింది. గోపీ తల్లి కూడా తోడుకోడలికి తోడయింది. నేనూ మా అన్నయ్యా: "ఊరుకోండి, ఆ విడతో సమానంగా మీరుకూడా గొంతుకలు ఎందుకు చించుకుంటారు. అన్యాయంగా తిత్తే ఆవిడ తిట్లు ఆవిడకే తగులుతాయి" అని ఎంత చెప్పినా వాళ్లు వింటేగా. వంశమర్యాద కాపాడాలనే కకొందీకుతో కదనరంగంలో నిలబడ్డారు. ఆ గోడ అవతల ఆవిడ, ఈగోడ ఇవతల వీళ్లు తిట్లతోటే, శాపనార్థాలతోటే ఒకరినొకరు చెరిగేసుకుంటున్నారు. ఇలా ఇంట్లో ఆడవాళ్లు వీధిన బడటంచూసి మాకు సిగ్గువేసింది. వీధిలో వాళ్లు చోద్యంగా వింటూ ఉంటారు 'ఈ వాగ్యుద్ధం. పోనీ మేము అడ్డుపడుదామంటే ఆడవాళ్ళ తగాదాలో మగవాళ్లు కలగజేసుకోవడం బాగుండదుకదా. కాని మరికొంతసేపటికి వీధిలో శంకరంగారి గొంతుక విని మేమిద్దరం వీధిలోకి నడిచాం. అప్పటికే జనం చాలామంది పోగైఉన్నారు. శంకరంగారు తమ అరుగుమీద నిలబడి మా యింటి వైపుకు చేయిచూపిస్తూ ఏదో అరుస్తున్నారు. మేము దగ్గరికి వెళ్ళగానే శంకరంగారు తేలుకుట్టినకోతిలా ఎగురుతూ: "ఏమిటయ్యా మీరు మర్యాదస్తులేనా. ఊరు మీఒక్కరిదే అనుకుంటున్నారా. ఊళ్ళో మరెవరూ ఉండకూడదనుకుంటున్నారా? మీరు మనుష్యులేనా?" అంటూ అరిచారు. మేము తెలబోతూ: "ఏమిటండీ ఇంతకీ ఏమి జరిగింది" అని అడిగాం. కాని ఆయన జవాబు చెప్పడే ఆయన కేకలేమో ఆయనవి. నేను - కాస్త గట్టిగా అడిగాను: "ఏమిటో చెప్పకుండా తిట్టడమేమిటి" అని. శంకరంగారు కోపంతో వణికిపోతూ: "అదుగో చూడండి మీముద్దుల కుక్క ఏంచేసిందో" అని గడపకేసి చూపించారు. అక్కడ టైగరు చెరిపింది. నాకు చాలా ఆశ్చర్యంవేసింది. మా యింట్లో చాలాజాగ్రత్తగాఉండే టైగరు శంకరంగారి యింట్లో ఈ పని చేయడమేమిటి. పిరికివాడినిమాస్తే గొర్రె తోకతో కరిచిందన్నట్లు మా టైగరుకికూడా శంకరంగారు లోకువగా కనిపించారు కాబోలు. ఆయన భార్య మూడు రోజులు ఇల్లంతా నీళ్ళతో ముంచేత్తేకాని ఇలు శుద్ధికాదు. శంకరంగారు "ఏమిటయ్యా ఇందుకేనా మీరు కుక్కను పెంచుతున్నది? ఊళ్ళోవాళ్ల యిళ్లు పాడుచేసి రమ్మనా? ఎలాగైనా పెంచారు పెంటలమీద తిరిగే కుక్కని. మీ లాంటివారు ఇలాంటి కుక్కలనే పెంచుతారు" అని నోటికి వచ్చినట్లు పేలుతున్నారు. ఆయన ఏం తిటినా మారు మాటాడక పడవలసి వచ్చింది. నేనూ మా అన్నయ్యా ఆయన్ని చేరో చెయ్యీ పట్టుకొని బ్రతిమాలాం. ఇంక కుక్క బాధ లేకుండా చేస్తామనీ, కుక్కను ఇంటినుంచితరిమివేస్తామనీ, ఆయన గుమ్మందగ్గర మేమేబాగు చేయిస్తామనీ. కాని మేము ప్రార్థిస్తున్నకొద్దీ ఆయన మరింత పైకి ఎగురుతున్నాడు. కోర్టులో కేసు పెడతానని కూడా బెదిరించడం మొదలుపెట్టాడు. చివరికి నాకు ఒళ్ళుమండి "సరే కోర్టుకు వెళ్ళాలని అంత సరదాగా ఉంటే అలాగే వెళ్లండి. హైకోర్టుకు కూడా వెళ్లండి" అన్నాను గట్టిగా. అప్పుడు ఊళ్ళోవాళ్లు మా పక్షం తీసుకొని "వారంతగా చెప్తుతూంటే వినక పోవడమేమిటి" అని కేకలు వేశారు. అప్పటికి శంకరంగారు నేలమీద సరిగా నిలబడ్డారు. మేము యింటికి తిరిగి వచ్చి మా పనిమనిషిని పంపి శంకరంగారి వీధి అరుగులూ, గుమ్మాలూ అన్నీ కడిగించాం.

అన్నయ్య ఇంటికివచ్చి కర్ర తీసుకొని తిన్నగా దొడ్లోకి పరుగెత్తి టైగరును అదే పనిగా కొట్టడం మొదలుపెట్టాడు. అది చూసి మా వదినగారు "అయ్యో అది చస్తుందేమో నండోయ్ కొంప తీసి. కుక్కను చంపిన పాపం గుడికట్టినా పోదట" అని గోల పెట్టింది. నేను కూడా భయపడ్డాను ఆ దెబ్బలకి టైగరు చస్తుందేమోనని. అన్నయ్యా దానిని మనం చేతులారా చంపడమెందుకు? ఆనక ఎవళ్ళచేతేనా మరో ఊళ్లో దిగబెట్టిస్తాను మళ్ళీ మన యింటికి రాకుండా" అన్నాను. అన్నయ్య "ఆగి ఈ సాయంత్రంలోగా ఈ పీడని వదిలించెయ్యి. వెనక కుక్క నానా అప్రతిష్ఠ తెస్తోంది. దీని మూలాన ఊళ్లోవాళ్లందరితో విరోధాలు వచ్చేటట్లున్నాయి" అన్నాడు. అలాగే ఆ సాయంత్రమే కోమటిరామన్న బళ్లవాళ్లు ధాన్యం బస్తాలు వేసుకొని మరో దూరపు ఊరు పోతూంటే వాళ్లి కప్పగించాను టైగరుని. వాళ్లు దానిని తాళ్ళతో కట్టివేసి ఒక బండిలో పెట్టారు. అప్పుడు టైగరు చేసిన అల్లరి అంతా యింతా కాదు. గిలగిల కొట్టుకుంది. మొర్రోమని పెద్ద ఏడుపు పెట్టింది. బండివాళ్ళకేసి జాలిగాచూసింది. మాకేసి జాలిగా చూసింది. అయినా బళ్ళవాళ్లు బళ్లు తోలుకుపోయారు. గోపీ, మా అన్నయ్య పిల్లలూ కళ్లనీళ్లు పెట్టారు. మా వదినగారు కూడా అంది "పాపం వెర్రి ముండకి ఎంత ప్రేమో" అని.

ఆరాత్రే మా యింటికి దొంగలువచ్చారు. దొంగతనం జరగలేదు. అప్పుడే దొడ్లోకి వచ్చారు కాబోలు. అంతలో మా వదినగారు మంచినీళ్లు త్రాగడానికి లేచి కిటికిలో నుంచి ఎవరో కదులుతుండడం చూసి 'వావావా' అని వెర్రికేక వేసింది. మేము కర్రలూ బేటరీలైట్లూ పుచ్చుకొని దొడ్లోకి పరుగెత్తాము. దొంగలప్పటికే పారిపోయారు. చుట్టుపక్కల అన్నీ తుప్పలూ తోటలూ ఉండడంవల్ల వాళ్ళ వెనకాల పరుగెత్తడం ప్రమాదమని ఆగిపోయాం. ఆ రాత్రి మాకు చాలా భయం వేసింది. టైగరున్నా బాగుండుననిపించింది." కాని ఉన్నది సరిగా ఉండ



కేశవర్ధనితో

కేశాలను వృద్ధి చేసుకోండి

చుండును పోగొట్టండి.
ఇక తలలో
దురద ఎందుకుండాలి?
వెంట్రుకలు



ఎందుకు రాలిపోవాలి? పసితనంలో నెరియుట
మాన్పండి. నెరియుటం ఆలస్యం కానివ్వండి.

కేశవర్ధనితో కేశాలకు పునర్జీవంపోసి, అందం చేకూర్చండి

షాంపూ వాడి కేశ శుభ్రత, సువాసన పొందండి.

కేశవర్ధని అ. 14; షాంపూ అ. 14, పోస్టేజి అదనం. అన్నిచోట్లా లభించును

కేశవర్ధని ప్రాడక్ట్సు, కోయంబత్తూరు. No. 3

నేషనల్ సేల్సు & సర్వీసెస్ (సదరన్) లిమిటెడ్, బకింగ్‌హాంపేట, బెజవాడ.

"...కాయో, ఊళ్ళోవాళ్ళతో పేచీలు తెస్తోంది" అన్నాడు అన్నయ్య.

ప్రొద్దున్నే అన్నయ్య లేచి వీధి తలుపు తీసి తిన్నగా టైగరు పొట్టమీద కాలు వేసి కెవ్వుమని కేక వేశాడు. "అరి దీని మొగం తగలెయ్యా! మళ్ళీ వచ్చిందిరా" అన్నాడు. గోపీవాళ్ళూ పరుగెత్తుకు వచ్చి టైగరును తీసుకువెళ్ళారు. టైగరు గంతులు వేస్తూ వాళ్ళ వెనకాలపరుగెత్తింది తన ఘనకార్యానికి పొంగి పోతున్నట్లుగా.

మధ్యాహ్నం వేళ కోమటిరామన్న బళ్లవాళ్లువచ్చారు "అయ్యగారూ మీ కుక్కను దిగబెట్టొచ్చామండి" అన్నారు.

"ఎక్కడ దిగబెట్టారేమిటి?" అన్నాను నేను తమాషాగా.

"మూడు నాలుగు కోసులువెళ్లిన తరువాత బాగా తుప్పలూ పొదలూ పెరిగి దారీ తెన్నూ లేని చోట విడిచిపెట్టి" అంటూనే ఉన్నారు. ఇంతలో గోపీవాళ్ల వెనకాల తోక ఆడిస్తూ టైగరు అక్కడికి సిద్ధమయింది- "ఇకేమిటి? ఇక్కడికి కెలా వచ్చింది!" అన్నారు.

"ఏమో తెల్లవారేసరికిచూస్తే గుమ్మంలో పడుకొని ఉంది" అన్నాను.

"మా కన్నా బాగా ముందే వచ్చిందన్నమాట" అని వెలవెలపోతూ వెళ్లిపోయారు బళ్ళవాళ్ళు.



౨

టైగరును పగలుగొలుసుపెట్టి కట్టిపెట్టున్నాం. రాత్రిళ్లు మాత్రం దొడ్లో విడిచిపెట్టున్నాం. నాలుగురోజులు దొడ్లో ఏ వస్తువులు విడిచిపెట్టినా పోలేదు కాని తరువాత పరిస్థితి మళ్లీ మామూలైంది. విచారిస్తే టైగరు రాత్రిళ్లు దొడ్లో వుండడం లేదని తేలింది. మాకన్న భయం దానికి. రాత్రి మేము విడిచి వెళ్లిన కాసేపటికే గోడదూకివచ్చి అరుగుమీద పడుకుంటోంది. మరోగొలుసు తెచ్చి పాతగొలుసుతో కలిపి రాత్రిళ్లుకూడా దానిని దొడ్లోనే నిమ్మచెట్టుకు కట్టిపెట్టడం మొదలుపెట్టాం. అది ఏడ్చింది. గొలుసు కొరడానికి ప్రయత్నించింది. వచ్చినవాళ్లందరినీ బ్రతిమాలింది. అయినా దాని ఆటలేమీ సాగనీయలేదు. మళ్లా కొన్నాళ్లవరకూ మాకు ఏ గొడవా లేదు.

ఒకరోజు అర్ధరాత్రి వేళ మాకు ఎందుకో అనుమానం వేసి వంటింట్లోకి వెళ్లాం. గోడకు పెద్ద కన్నం కనిపించింది. మా గుండెలు ఆగిపోయాయి. కంగారుగా ఇంట్లో సామానులు చూసుకున్నాం. రెండు ఇత్తడి బిందెలూ, కొన్ని కంచుగిన్నెలూ, ఒక వెండిపళ్లెమూ కనిపించలేదు. దొడ్లోకి పరుగెత్తాం. మా కేకలకీ చప్పుళ్లకీ ఊళ్లోవాళ్లు కూడా పరుగెత్తుకు వచ్చారు. దొడ్డి అంతా వెతికాం. చుట్టుపక్కల తోటలు వెతికాం. అయినా లాభం లేకపోయింది. ఎక్కడా దొంగలజాడ కానరాలేదు. వస్తువులజాడా కానరాలేదు. అంతకు ముందెప్పుడూ కన్నంవేసి జరగలేదు మాఊళ్లో. అదే మొదటిసారి. ఊళ్లోవాళ్లు కూడా హడలిపోయారు. ఏదో గట్టి చర్య తీసుకుంటేకాని లాభంలేదన్నారు. ఎవరో అడిగారు "అయితే మీ కుక్క ఏం చేస్తోంది" అని. మేము అంతవరకూ టైగరు మాటే మరచిపోయాం వెళ్లి చూశాం. టైగరు నిమ్మచెట్టుపక్క కొన్ని తాటివాసాలు పడిఉంటే వాటిమధ్య ఖాళీచేసుకొని హాయిగా నిద్రపోతోంది. నాకుకూడా అప్పుడు దానిమీద విపరీతమైన కోపం పొంగుకువచ్చింది. దానిని చితకకొట్టినా తప్పు లేదనిపించింది. అన్నయ్య కోపంపట్టలేక దాని డొక్కలో ఒక్కటి తన్నాడు. అది ఉలిక్కిపడి లేచింది. అన్నయ్య ఇంకా చాలాసార్లు తన్నాడు. అయినా అది అక్కడనుంచి కదలలేదు. కుయ్యో కుయ్యోమంటూ అక్కడే నిలబడిఉంది. చివరికి అన్నయ్యకే విసుగుపుట్టి చరచర లోపలికి నడిచాడు. వచ్చినవాళ్లు కూడా టైగరును తలోతన్నూ తన్ని లోపలికి నడిచారు.

మర్నాడు మధ్యాహ్నం పోలీసులు తయారయ్యారు. వాళ్లి పరీక్షలతో ప్రశ్నలతో మా ప్రాణాలు హైరాన పెట్టేశారు. కుక్కను గురించి ప్రస్తావన రాకుండా ఎలా ఉంటుంది. వాళ్లు పెద్దగా నవ్వేశారు. అటువంటి కుక్కను పెంచుకున్నందుకు మేము కూడా నవ్వులపాలు కావలసివచ్చిందనుకున్నాం. పోలీసులు వెళ్లిన తరువాత అన్నయ్య మళ్లీ కర్రతీసుకుని వెళ్లి టైగరును వీధిచివరి వరకూ తరిమికొట్టి వచ్చాడు. పిల్లలతో చెప్పాడు అది మళ్లీ అటువస్తే తరిమికొట్టమని. అన్నయ్య పిల్లలు అలాగే చేస్తామన్నారు. ఈ దొంగతనం తరువాత వాళ్లకు టైగరుపట్ల విశ్వాసం పూర్తిగా పోయింది. గోపీ కొక్కడికే ఇంకా అభిమానం పోకుండా ఉంది. టైగరు మా యింటికి రావడానికి చాలాసార్లు ప్రయత్నించింది కాని ప్రతిసారీ అన్నయ్య పిల్లలు బెడ్డలు పుచ్చుకొని తరిమికొట్టూ వచ్చారు. చివరికి టైగరు ఊళ్లోనే ఉండిపోయింది.

కాని నేను ఊళ్లోకి వెళ్లినప్పుడల్లా తోక ఆడించుకుంటూ నాదగ్గరకు పరుగెత్తుకు వచ్చేది. నేను దానికేసి చూడకుండా పోయేవాడిని. అయినా అది కొంతదూరం నా వెనకాలే వచ్చి తిరిగిపోయేది. గోపీ, తల్లీ ఆమె వైపు బంధువులింట్లో ఏదో శుభకార్యం ఉంటే వెళ్లారు. వాళ్లు బండిలో కాలువగట్టు వైపుకు పోతూండడం చూసింది కాబోలు టైగరు. ఎక్కడనుంచో పరుగెత్తుకువచ్చి బండికూడావచ్చి వాళ్లు బస్సు ఎక్కేవరకూ అక్కడే ఉండి తరువాత వెళ్లిపోయింది.

దానిని మా టైగరు అని చెప్పుకోవడం మేముమానివేసినా ఊళ్లోవాళ్లుమాత్రం దానినింకా మా టైగరుకిందే ఎంచుతున్నారు. మేము కనిపించినప్పుడల్లా 'ఏమండోయ్ మీ టైగరు ఎలా పాడైపోయిందో చూశారా? పెంటకుప్పలమీద తిరుగుతూండగా చూశాను' అని ఒకరూ 'మీకుక్కను ఊళ్లో కుక్కలు కరిచివేశాయండి' అని ఒకరూ ఇలా చెపుతూనే ఉండేవారు. నాకు బాధ తోచి "అది ఇక మా టైగరు కాదు"ని గట్టిగా చెప్పేవాడిని. కాని నన్ను చూసేసరికి తోక ఆడిస్తూ అది తయారవుతుండగా అది మాది కాదని చెప్పినా ఏం లాభం? దాని రూపమే మారిపోయింది. మళ్ళీ ఎముకలగూడులా తయారైంది. ఊరి కుక్కలు కరిచినచోట్లల్లా పుళ్లుపడ్డాయి గజ్జికూడా పట్టింది. దానిని చూడడానికే రోతపుట్టుతోంది. అది మాకళ్ళముందే అలా పాడైపోవడం చూస్తే బాధపడకుండా ఉండలేకపోతున్నాం కాని అది దగ్గరికివస్తే ఒక బెడ్డ

(55-వ పేజీ చూడండి)



"నిభృతనికుంజగృహం...."

(18-వ శతాబ్దపు కాంగ్రా చిత్రకళకు చెందిన 'రాధాకృష్ణ' చిత్రం)



వ్రజవధూటి (తైలవర్ణ చిత్రం)

చిత్రకారిణి: కుమారి శ్యామా కాంతిలక్ష్మి



రాగరక్తి

చిత్రకారుడు: పాతిశెట్టి నరేంద్ర - మద్రాసు.

బెంగాలీ తార సుచిత్రాసేన్. 'దేవదాసు' విడుదల అనంతరం బొంబాయి చిత్రసీమలో ఈమె కొన్ని హిందీచిత్రాలలో బుక్ అయింది.







భరణీవారి 'చింతామణి'లో భానుమతి



మినర్వా వారి 'సారంగధర' లో రాజసులోచన, రామారావు.




భరణీవారి 'చింతామణి'లో జమున.

బొంబాయి సినిమా లేఖ

చలన చిత్రాల నిర్మాణానికి, మిగతా పరిశ్రమ లన్నిటికీ చేసినట్లే, లైసెన్సు లిచ్చే పద్ధతి ప్రవేశపెట్టాలనుకున్నట్లు కేంద్ర సమాచార, బ్రాడ్‌కాస్టింగ్ శాఖ మంత్రి డా|| బి. వి. కేస్కర్ మొన్న పార్లమెంటులో అన్నారు. ఈ మాట చలనచిత్ర నిర్మాతలలో సంచలనం కలిగించింది. నిజానికి ఇంత స్వేచ్ఛ ఉన్నది-ఇంకోటి లేదు. మన దేశంలో ఈనాడు సినిమా తీయడానికి డబ్బు సమకూర్చుకో గలిగిన ప్రతివ్యక్తీ మహారాజులా పూనుకోవచ్చు. అందుకు అనుభవంగాని, శక్తి సామర్థ్యాలు గాని, చిత్తశుద్ధి గాని అవసరం లేకుండా పోయింది. అందువల్ల ఈ పరిస్థితులలో ఇప్పుడు అమాంతం లైసెన్సులు పద్ధతి ప్రవేశపెడితే, నూటికి 50 మంది వరకూ నిర్మాతలకు, వాళ్ళ వెంట ఉండే, బుకాయింపు రాయుళ్ళకూ, ప్రతిభ లేనివారికీ ఉద్వాసన చెప్పవల్సివస్తుంది. పరిశ్రమ శ్రేయస్సు దృష్ట్యా చూస్తే, నిజమైన ప్రతిభ, సత్సంకల్పం, చిత్తశుద్ధి ఉన్న ఏ కొద్దిమందో మాత్రమే ఇందులో పాల్గొనడం ఉత్తమోత్తమం అవడానికి సందేహం లేదు. అటువంటివాళ్లు స్వప్రయోజనాలు సాధించుకోవడంతోపాటు, ఈ పరిశ్రమకూ కళకూ సేవచేయ గలుగుతారు. అభివృద్ధికి దారితీస్తారు. చిత్ర నిర్మాణం అనేది ప్రధానంగా, అమెరికా బ్రిటనలలోవలె, ప్రతిష్ఠమైన సంస్థల ద్వారా జరుగుతుంది.

అయితే, ఇందువల్ల ఒక ప్రమాదం ఉంది. యుద్ధకాలంలో చిత్రనిర్మాణం తలపెట్టిన వారికిది తెలిసిన సంగతే. అప్పట్లో భారతప్రభుత్వం ఒకసారి లైసెన్సు పద్ధతి ప్రవేశపెట్టారు. ప్రభుత్వానికి నమ్మకం ఉన్న నిర్మాతలకే లైసెన్సులు ఇస్తూ వచ్చారు. అలా ఇవ్వడంలో, అర్హత



అశ్వరాజ్ ప్రొడక్షన్స్ వారి రెండవ చిత్రం 'వినాయకచవితి' కి మార్చి 21 న రేవతీస్టుడియోలో ప్రారంభోత్సవం జరిగింది. రచయితగా పేరు గడించుకున్న శ్రీ సముద్రాల రాఘవాచార్య తొలిసారిగా, ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. కెమెరా స్విచ్ ఆన్ చేస్తున్నవారు శ్రీ జి. రామరాజు. ఆయన ప్రక్కనున్నవారు కెమేరామన్ శ్రీ సి. నాగేశ్వరరావు.

లేని వారికి అవి దొరికిన సందర్భాలు అనే కం. అప్పట్లో లైసెన్సులను బ్లాక్ మార్కెటులో అమ్ముతూ ఉండడం, అక్కడితో, ఆ పద్ధతి ప్రవేశ పెట్టడంలోగల లక్ష్యమే దెబ్బతినడం జరిగింది.

ఈ పరిశ్రమలో స్థిరపడి, ఇందులో సేవ చేసేవారందరికీ ఇది ఇప్పుడు కొంత కలవరం కలిగిస్తోంది. అందువల్ల ప్రభుత్వం ఈ పరిస్థితులన్నిటినీ సమగ్రంగా పరిశీలించి, లైసెన్సులు జారీచేసేశాఖను అతి కట్టుదిట్టంగా ఉంచడానికి పూనుకోవలసి ఉంటుంది.

*　　*　　*

అంతర్జాతీయ సుహృద్భావం పెంపొందడానికి చలనచిత్రాలు ఎంతో దోహదంచేయగలవని అమెరికా చలనచిత్ర సంఘఅధ్యక్షుడు ఎరిక్ జాన్‌స్టన్ అన్నారు. మన దేశంలో చలనచిత్రపరిశ్రమ స్థితిగతులు స్వయంగా తెలుసుకోవడానికై ఆయన వచ్చారు. ఈ సందర్భంలో ఆయన గౌరవార్థం బొంబాయిలో పలువురు విందులు చేశారు. ఫిలిం ఫెడరేషన్ ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతూ, చలనచిత్రాల భూమికను వాటి ప్రాధాన్యాన్ని గుర్తించి, సద్వినియోగం చేయవలసిన బాధ్యత నిర్మాతలపై ఉన్నదని జాన్‌స్టన్ అన్నారు. భారతీయ నిర్మాతలంతా కలసి నియమనిబంధనలు ఏర్పాటుచేసుకొని, వాటికి లోబడి వ్యవహరిస్తూ, చలన చిత్రాలస్థాయిని పెంచి ఉత్తమ ప్రమాణాలను అందుకోవడానికి కృషిచేయాలని ఆయన సూచించారు.

ప్రభుత్వం సహాయంతో భారతీయచిత్రాల దిగుమతిని అరికట్టి ఊరుకోకుండా, వాటిలో బాగా డబ్బుచేసుకున్న చిత్రాలను మక్కికి మక్కీ అనుకరించి, స్వంతంగా చిత్రాలు నిర్మించేధోరణి పాకిస్తాన్ లో పెచ్చు పెరిగిపోతూంది మనదేశంలో నిర్మాతలూ, విదేశీ చిత్రాలను అనుకరించేవారుసహా ఈ దారుణ మైన ధోరణి చూచి ఆందోళన చెందుతున్నారు. రజతోత్సవాలు చేసుకున్న భారతీయచిత్రం 'షౌలాద్'ను, పాకిస్తాన్ నిర్మాతలు పూర్తిగా కాపీచేసి 'నౌకర్' అనే పేరుతో విడుదలచేశారు అలాగే మరో బాక్సాఫీస్ చిత్రం 'వచన్'ను పాక్ చిత్రం 'హమీదా' ఆద్యంతం నకలుప్రతి వంటిది 'ఫాబ్యులస్ సినోరిటా' ఆధారంగా గోయెల్ ప్రొడక్షన్ 'ఆల్బేలీ' నిర్మిస్తే, పాకిస్తాన్‌లో దానికి నకలుప్రతులు రెండు తయారయ్యాయి. ఒకదానికి 'అనోఖీ' అని పేరు పెట్టుకున్నారు. ఇంకొకటి 'మిస్ పాకిస్తాన్'. ఈ రెండూ 'ఆల్బేలీ'కి కాపీలే. మంచి చెడ్డా లేకుండా, బరితెగించిపాక్ నిర్మాతలు సాగిస్తున్న యీ



మహీప్రొడక్షన్స్‌వారి "శ్రీ గౌరీమాహాత్మ్యం"లో సూర్యకళ, శ్రీరంజని, రేలంగి, రామారావు.

తరహా పనులను 'పాకిస్తాన్ టైమ్స్' అనే పత్రిక ఈమధ్య నిశితంగా విమర్శించింది. డబ్బు చేసుకోవాలన్న ఆశతో పాక్ నిర్మాతలు నీతి నిజాయతీ లేకుండా, భారతీయ చిత్రాలకు పాకిస్తాన్ 'నకళ్లు' తయారు చేయడానికి ఒకరితో ఒకరు పోటీలు పడుతున్నారని ఆ పత్రిక విమర్శించింది.

(ఆంధ్ర-వారపత్రిక బొంబాయి విలేఖరి)

ఫిలింఫెడరేషన్ కొత్తఅధ్యక్షుడు

భారత ఫిలిం ఫెడరేషన్‌కు శ్రీ జగత్ నారాయణ్ అధ్యక్షుడుగా ఎన్నికయ్యారు. శ్రీ ఎస్. ఎస్. వాసన్, శ్రీ ఎం. బి. బిల్లిమోరియా ఉపాధ్యక్షులుగా ఎన్నికయ్యారు.

మార్చి 24 న ఇండూర్‌లో జరిగిన సర్వసభ్యసమావేశంలో 36 గురు సభ్యులతో కార్యవర్గం ఎన్నికయింది. ఆ మండలి అధ్యక్ష ఉపాధ్యక్షులను ఎన్నుకుంది.

కార్యవర్గం తరపున, మాజీ అధ్యక్షుడు శ్రీ వాసన్ సమర్పించిన నివేదికలో చలన చిత్ర పరిశ్రమపట ప్రభుత్వ వైఖరిలో మార్పేమీ లేదని పేర్కొన్నారు.

శ్రీ పాటిల్‌కు అభివందనలు

భారతీయ చలన చిత్ర నిర్మాతల సంఘం (ఐ. ఎం. పి. పి. ఎ.) అధ్యక్ష పదవికి శ్రీ



అమెరికా మోషన్ పిక్చర్ అసోసియేషన్ అధ్యక్షుడు, వాణిజ్య రాజకీయ రంగాలలో ప్రముఖుడు అయిన ఎరిక్ జాన్స్టన్ మార్చి మూడో వారంలో బొంబాయి వచ్చినపుడు, నిరూపరాయ్, కామినీకౌశల్, ఆయనకు స్వాగతమిచ్చారు.

శ్రీ పాటిల్‌కు అభినందనలు

ఎస్. కె. పాటిల్ రాజీనామా ఇచ్చారు. ఆ సంఘం ఉపాధ్యక్షుడు శ్రీ కిశోర్ సాహు కొత్త అధ్యక్షుడుగా ఎన్నికయ్యారు. శ్రీ కె. ఎం. మోడీ సీనియర్ ఉపాధ్యక్షుడుగాను, శ్రీ బిమల్ రాయ్ ఉపాధ్యక్షుడుగాను ఎన్నికయ్యారు.

శ్రీ పాటిల్ ఏడాదిపాటు ఈ పదవి నిర్వహించి చలనచిత్ర పరిశ్రమకు సేవ చేశారు. దేశంలో నిర్మాతలందరిని ఒక సంఘంగా ఏర్పాటు చేయడం తమ లక్ష్యమని పదవి స్వీకరించిన రోజున ఆయన చెప్పారు. అది కార్యరూపం ధరించింది. కాగా ఇప్పుడు రాజకీయంగా ఇతర వ్యవహారాల ఒత్తిడి ఎక్కువైనందువల్ల ఆయన ఈ బాధ్యతను మరొకరికి ఒప్పగించారు. సంఘ కార్యవర్గం శ్రీ పాటిల్ రాజీనామాను ఆమోదిస్తూ ఆయన చేసిన సేవకు అభినందన లర్పించారు.

* * * *

సుప్రసిద్ధ బ్రిటిష్ నటుడు రాబర్ట్ న్యూటన్ మార్చి 25న 'బెవర్లీ హిల్స్' (కాలిఫోర్నియా) మరణించాడు. ఆలివర్ ట్విస్ట్ (బ్రిటిష్) ట్రెజర్ ఐలెండ్ వంటి చిత్రాలలో నటించి పెద్దలకూ పిల్లలకూ కూడా అభిమాన పాత్రుడైన న్యూటన్ బ్రిటన్‌లో బాక్సాఫీస్ నటుడుగా రెండుసార్లు ఎన్నికయ్యాడు. గత ఆరేళ్లుగా ఇతడు హాలీవుడ్‌లోనే ఉంటూ వచ్చాడు.

* * *

దేశీయ చలనచిత్ర పరిశ్రమ అభివృద్ధికి దోహదం చేసే నిమిత్తం, విదేశాలనుండి వచ్చే చిత్రాల సంఖ్యకు పరిమితులు నిర్ణయించి, కోటాలపద్ధతి ప్రవేశ పెట్టాలని థాయిలాండ్ ప్రభుత్వం సంకల్పించింది.

హాలీవుడ్ తీరుతెన్నులు

హాలీవుడ్ చిత్రాలలో హత్యలు, దొంగతనాలు, ఇతర దౌర్జన్యాలకూ ఎక్కువ ప్రాధాన్యం యిచ్చి చిత్రించే వాటి సంఖ్య క్రమంగా పెరుగుతున్నదట. తదితరం అని చెప్పతగ్గ చిత్రాల సంఖ్య క్రమంగా తరిగిపోతోంది.

బాల నేరస్థులకు సంబంధించిన వివరాలు సేకరించడానికి అమెరికా సెనేట్ నెలకొల్పిన ఉపసంఘం తమ నివేదికలో ఈ విషయం పేర్కొన్నారు. ఈ ధోరణి మంచిది కాదని ముఖ్యంగా పిల్లలను ఇది చెడుదారిన పెట్టగలదనీ వారు పేర్కొన్నారు. అయితే దీన్ని అరికట్టడానికి ప్రభుత్వం సెన్సారు నిబంధనలు పెట్టనవసరం లేదని, పరిశ్రమలో వారే నియమనిబంధనలు పరిదిద్దుకొని పరిస్థితులను చక్క బెట్టుకోవాలనీ వారు సూచించారు.

పత్రికా విలేఖరులతో ఎ. నాగేశ్వరరావు గోష్ఠి

దక్షిణ భారత చలనచిత్ర పత్రికా రచయితల సంఘం సభ్యులతో సినీ నటుడు శ్రీ ఎ. నాగేశ్వరరావు ఇటీవల ఇష్టాగోష్ఠి జరిపారు. మైలాపూర్ వుడ్‌లాండ్స్‌లో ఈ గోష్ఠి జరిగింది. శ్రీ నాగేశ్వరరావు తాము చలన చిత్ర రంగంలోకి ఎలా ప్రవేశించిరదీ, మొదట్లో ఎన్ని ఇబ్బందులు పడిందీ, క్రమంగా ఎలా నిలదొక్కుకుని పైకి రాగలిగిందీ వివరించారు. చలన చిత్రాలలో నటించి కీర్తి ఆర్జించాలనే కాంక్ష ఒకటే మొదటి నుండి తనను నడిపించిందని ఆయన అన్నారు.

లనచిత్రాలపై పత్రికా సమీక్షలను గూర్చి మాట్లాడుతూ, సమీక్షకులు అనేక విషయాలలో పారంగతులై ఉండాలనీ, వారు నటులకంటె, దర్శకునికంటె విజ్ఞానవంతులై ఉండాలని తమ అభిప్రాయమనీ చెప్పారు. విమర్శ నిర్మాణాత్మకంగా ఉన్నప్పుడు దాని వలన అందరికి ప్రయోజనం ఉంటుందనీ, అటువంటిదానిని తామెప్పుడు గౌరవిస్తామనీ ఆయన తమ ఉద్దేశ్యం తెలిపారు. సంఘకోశాధికారి శ్రీ రామానుజం అభినందనలతో గోష్ఠి ముగిసింది. ★

హైదరాబాద్‌లో సినిమా స్టుడియో

సారథీ సంస్థపేరిట నిర్మాణం

విశాలాంధ్ర రాజధానీ నగరంలో త్వరలోనే ఒక చలన చిత్ర నిర్మాణ కేంద్రం అవతరించబోతోంది. రైతుబిడ్డ మాలపిల్ల పల్నాటి యుద్ధంవంటి చిత్రాలు నిర్మించిన కీ॥ శే॥ గూడవల్లి రామబ్రహ్మం గారి 'సారధి' సంస్థ పేరిట, ఇది వెలయబోతోంది. సారథీ ఫిలింస్ ప్రస్తుత అధిపతి, 'తోడికోడళ్ళు'? 'జాలుమారాయి' చిత్రనిర్మాత శ్రీ రామకృష్ణప్రసాద్ ఇందుకు పూనుకొన్నారు. హైదరాబాద్ లోని అమీర్ పేట వద్ద పన్నెండు ఎకరాల స్థలంకొన్నారు. స్టుడియోకు కావలసిన సరంజామా, పరికరాలూ తెప్పించడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయనీ, 'విశాలాంధ్ర' అవతరించే రోజు అక్టోబరు ఒకటవ తేదీనే ఈ స్టుడియోకు కూడా ప్రారంభోత్సవం జరిపించాలని సంకల్పమనీ శ్రీ రామకృష్ణప్రసాద్ చెప్పారు. తమ తరువాతి చిత్రంకూడా సాంఘికమేనని, కథారచన జరుగుతున్నదని ఆయన చెప్పారు.

* * *

దక్షిణ భారత సినీ టెక్నిషియన్ల సంఘంవారి త్రైమాసపత్రిక జనవరి సంచిక మా కార్యాలయానికి చేరింది.

శబ్దగ్రహణంలో గత 25 సంవత్సరాలలో సాధించబడ్డ అభివృద్ధిని సమీక్షిస్తూ ఆర్. సి. ఎ. లెబారేటరీ (ప్రిన్సటన్)కు చెందిన డా॥ హారీ ఆల్సన్ వ్యాసం, కార్టూన్ చిత్రాలపై శ్రీ శాంతి ఎస్. వర్మ వ్యాసం, చలనచిత్రాలకు సంబంధించిన విషయాలలో కాపీరైట్ చట్టం ఎలా వర్తించేదీ వివరిస్తూ శ్రీ ఐ. శే. మీనన్ వ్యాసం మొదలైనవి ఉన్నాయి. టెక్నిషియన్లు కాని వారుకూడా చదివి తెలుసుకోదగ్గ విశేషాలు ఇందులో పొందుపరచారు. కార్యాలయం నెం. 8, రాజాంబాళ్ వీధి, మద్రాసు-17.

* * *



జూపిటర్ వారి 'ఉమాసుందరి' లో కన్నాంబ.

'మాయల ఫకీర్' నాటక ప్రదర్శనం

ప్రఖ్యాత సినీ నటుడు కీ. శే. దాసరి సదాశివరావు, కుటుంబానికి సహాయంచేసే నిమిత్తం శ్రీ వెంకటేశ్వర నాట్యమండలి వారు మార్చి 25-న వాణీమహల్‌లో మాయల ఫకీర్ (బాలనాగమ్మ) నాటకం ప్రదర్శించారు. శ్రీ ఎల్. వి. ప్రసాద్ అధ్యక్షతవహించారు. కణ్వశ్రీ రచించిన ఈ నాటకంలో శ్రీయుతులు రాజారెడ్డి, పిఠాపురం నాగేశ్వరరావు, వి. సీతారాం, వల్ల రామమూర్తి, ఎస్. వి. సుబ్బారావు, కేశవరావు, దుర్గారావు, మాస్టర్ వరసు, శ్రీమతులు లక్ష్మీదేవి, పి. సీత, శారదాదేవి, సీతారామమ్మ నటించారు. మాస్టర్ షోలాపూర్ సంగీతం సమకూర్చారు. నాటకప్రదర్శనానికి నగరంలోని ఆంధ్రులు-ముఖ్యంగా చలన-చిత్ర పరిశ్రమకు చెందినవారు పలువురు వచ్చారు.



'క్లేర్' బహుమతి ప్రధానోత్సవ సభ (బొంబాయి) లో భరతనాట్య ప్రదర్శనం జరిపిన దక్షిణ భారతనర్తకీ ద్వయం కుమారి శాయి, సుబ్బులక్ష్మి.

★ సినిమా వార్తలు ★

ధనశాయి ఫిలింస్ వారు 'భలే బావ' అనే హాస్య చిత్రం నిర్మిస్తున్నారు. జగయ్య, జానకి, రేలంగి, గుమ్మడి, లక్ష్మీకాంతం ఇందులో ముఖ్య భూమికలు నిర్వహిస్తారు. మాటలు శ్రీ పరశురాం' పాటలు 'శ్రీ అనిసెట్టి' వ్రాస్తున్నారు. అప్పుడే రెండు పాటలు రికార్డు చేశారు. వాటిని పి. లీల పాడింది. మొన్ననే షూటింగ్ కూడా ప్రారంభమైంది. ఈ చిత్రానికి శ్రీ సబ్నవీస్ రజనీకాంత్ దర్శకుడు.

*　　*　　*

గోకుల్ పిక్చర్సు తరువాతి చిత్రం హాస్యరసప్రధానమైనదని తెలుస్తూంది. దీనికి కూడా శ్రీ రజనీకాంతే దర్శకుడు. ఈ చిత్రానికి మాటలు శ్రీ కొండముది గోపాలరాయశర్మ, పాటలు అనిసెట్టి వ్రాస్తున్నారు. ఈ వారంలోనే సెట్సుకు వెళ్తారని తెలిసింది.

*　　*　　*

శ్రీ రామకృష్ణ దర్శకత్వాన భరణివారి 'చింతామణి' నిర్మాణం పూర్తిఅయింది. ఏప్రిల్ 11 న విడుదల. ఇది పూర్తికావటంతో, వీరి హాస్య చిత్రం "వరుడు కావాలి" నిర్మాణం చురుకుగా సాగుతుంది.

*　　*　　*

సాయిరాం పిక్చర్సు అనే కొత్తసంస్థకు ఇటీవలే ప్రారంభోత్సవం జరిగింది. వీరు సంపూర్ణ రామాయణం' నిర్మింప నిశ్చయించడం విదితమే. ఇందులో ఎన్. టి. రామారావు శ్రీరాముడి భూమిక నిర్వహిస్తారట. ఎం. ఏ. వి. అనే మరో కంపెనీ (కోయంబత్తూరు) కూడా రామాయణగాథను చిత్రించ దలచినట్లు ప్రకటించారు. అయితే వారు తమిళంలో మాత్రమే తీస్తారు. అందులో కూడా రామారావే శ్రీరాముడు. తెలుగు చిత్రానికి శ్రీ యోగానంద్ దర్శకుడు. మల్లీశ్వరిలో కృష్ణదేవరాయలు భూమికనిర్వహించిన 'శ్రీ వత్స' (శ్రీ తీగల వెంకటేశ్వర్లు) దీనికి మాటలు, పాటలు వ్రాస్తున్నారు.

*　　*　　*

సాహిణీ వారు, నిర్మించనున్న "పెంకె పెళ్ళాం" అనే చిత్రానికి శ్రీ కమలాకర కామేశ్వరరావు దర్శకత్వం వహిస్తారు. ఇది సాహిణీవారికి రెండవచిత్రం. శ్రీరంజని, రాజసులోచన, రామారావు, రేలంగి, రమణారెడ్డి, నాగభూషణం, జోగారావు ప్రభృతులు నటీనటులు. మాటలూ పాటలూ ఆరుద్ర వ్రాస్తున్నారు.

*　　*　　*

జూపిటర్ వారి ఉమాసుందరి మూడు వంతులకుపైగా పూర్తి అయింది. బహుశా మే 11 న విడుదల కావచ్చునని తెలుస్తూంది. శ్రీరంజని, రామారావు, నాగయ్య, కన్నాంబ, రేలంగి ప్రభృతులు నటించారు. దర్శకుడు శ్రీ లంక సత్యం. పర్యవేక్షణ శ్రీ పి. పుల్లయ్య.

జూపిటర్ వారి హిందీలో నిర్మించిన 'నయా ఆద్మీ' ఏప్రిల్ 6 న విడుదల అయింది. 'సంతోషం' చిత్రంలో నటించిన రామారావు, అంజలి, జమున ప్రభృతులే ఇందులోనూ ఉన్నారు.

*　　*　　*

అశ్వరాజ్ వారి రెండవ పౌరాణిక చిత్రం 'వినాయకచవితి' నిర్మాణానికి పూర్ణాపిక్చర్సు మానేజింగ్ డైరెక్టర్ శ్రీ జి. కామరాజు మార్చి 21 న రేవతీ స్టూడియోలో ప్రారంభోత్సవం చేశారు. చలనచిత్ర పరిశ్రమ ప్రముఖులు పలువురు హాజరయ్యారు. ఈ చిత్రానికి మాటలూ పాటలూ శ్రీ సముద్రాల రాఘవాచార్య వ్రాశారు. తొలిసారిగా దర్శకత్వం కూడా ఆయనే నిర్వహిస్తున్నారు. ఎన్. టి. రామారావు, జమున, రాజనాల, ఎ. ప్రకాశరావు, సత్యవతి మొదలగువారు నటిస్తున్నారు. ★

వహాయుల పకీర్ నాటక ప్రదర్శనం

వసూలయిన సొమ్ము ఆరువేలపై చిలుకును, కీ. శే. సదాశివరావు సతి నారీమణికి అందచేశారు.

సాటి నటుడిపట్ల గౌరవం, అతని కుటుంబంపట్ల సానుభూతి వెలిబుచ్చుతూ, ఈ రూపేణా సత్కార్యానికి పూనుకొని, జయప్రదంగా నిర్వహించినందుకు శ్రీయుతులు రాజారెడ్డి, జి. అబ్బులు, ప్రదర్శనంలో పాల్గొని జయప్రదం చేసిన నటీనటులూ అభినందనీయులు. ★

తిమింగిల గిలం

ఏనిమిదిన్నరకు మేలుకునే ప్రయోజకు లందరికీ తెల్లవారింది. ఈలపాటలు వచ్చిన వాళ్లంతా ఇంగ్లీషు, హిందీ మట్లలో అందుకు పూనుకుంటున్నారు. రానివాళ్లు గాత్రం పాడుతున్నారు. భగ్నహృదయులు బాధపడుతూ, కాఫీ తాగి, సిగరెట్టు కాలుస్తూ బెంగపెట్టు కుంటున్నారు. దగ్గర్లో రేడియో ఉన్నవాళ్లు బాధాకరమైన పాటలు వింటూ, వాటి సహాయం పుచ్చుకు మరీ బాధపడుతున్నారు. టింకు రంగారావు సినిమా పుస్తకాలు తిరగేస్తున్నాడు. భోజు రాజు అద్దం ముందు రిహార్సల్సు వేసుకొంటున్నాడు.

అప్పారావు అప్పు సంపాదించడానికి ఉపాయాలు ఆలోచిస్తున్నాడు.

అప్పారావు ఋణవంతుడు. ఆ కల్పవృక్షం మీద గురి, గౌరవం కలవాడు. లోక భ్రమణానికి అదే మూలాధారం అని నమ్మిన వాడు. అన్యథాభావన లేనివాడు. తరచుగ్గా ఉద్యోగాలు, అంతకన్న తరచుగా భోజనం చేసేవాడు కావటంవల్ల, అప్సరసలను—దేశవాళీ విదేశవాళీ కూడా, అగుడుగా కన్నెత్తి చూసేవాడు.

అప్పారావు అసలు పేరు తుకారాం. అతనికి ఎప్పుడూ అప్పులిచ్చే గోపాలం, మీసాలంవంటి ఆప్తమిత్రులు అప్పారావని పేరు పెట్టుకున్నారు. ఇదొక్కటనే కాదు, గోపాలం ఏ పేరు పెట్టి పిలిచినా తుకారాం పలుకుతాడు.

బేస అప్పుచేసి కాఫీ తాగేసి, అర్ధణా అరువుపెట్టి సిగరెట్టు తీసుకున్న తుకారాం, ఘాటుగా, గబగబా ఆలోచించి, రైకో అనుకున్నాడు. అనుకుని తిన్నగా గోపాలం ఇంటికి వచ్చాడు.

"హలో! ఖులాసా?" అన్నాడు.

"లాభం లేదురా తుకారాం" అన్నాడు గోపాలం నవ్వుతూ.

"పోనీ హలో. ఉత్తి హలో."

"ఉహుం. ఇవ్వనురా శోభనాద్రీ" అన్నాడు గోపాలం.

తుకారాం "హలో ఖులాసా" అంటే ఐదు రూపాయలు అప్పు కావాలని తాత్పర్యం "ఉత్తి హలో" అంటే రెండే రెండు చాలు అన్నమాట.

"అర్జెంటు గోపాలం యమర్జెంటు. కాసిని మంచినీళ్లు, రెండు రూపాయలూ, ఓ సిగరెట్టు, నీ సైకిలూ ఓసారి కావాలి. రెండోదీ నాలుగోదీ కూడా సాయంత్రం యిచ్చేస్తా" అన్నాడు తుకారాం అర్జన్సీని అభినయిస్తూ.

"ఖుదర దప్పారావ్. ఒకటోదీ మూడోదీ నిక్షేపంలా పుచ్చుకో."

"ఊహు! అక్కర్లేదు"

గోపాలం నవ్వి లోపలికెళ్ళాడు.

"నరసింహారావుకి రెండు రూ॥లు ఋణం కావాలిట. వీలైతే కాసిని మంచినీళ్లుకూడా ఇవ్వమన్నాడు" అన్నాడు.

రాధ అలవాటుప్రకారం చిరాకుపడింది.

"ఇక్కడేం పాతిరుందా"

"అలాగా ఉందా......ఎక్కడా?" అన్నాడు. గోపాలం చిరాకుపడ్డ రాధ ముఖంలో వచ్చే మనోహరమైన పరిణామాలను మహాశ్రద్ధగా గమనిస్తూ.

"నా నెత్తిమీద" అంది రాధ విసుగ్గా.

రాధకి 'తలితండ్రులు పెట్టని సొమ్ము'ల పైన గోపాలానికి చక్కని పూలచెండు కనబడింది. పసుపుఛాయ లీనేకోల నుదురుమీద పెద్ద బొటులో లక్ష్మీకళ కనబడింది.

"పోనీలే. ఇవ్వద్దు. ఇవ్వనన్నావని... ఇవ్వనని ఊహు......లేదని చెబుతా" అన్నాడు గోపాలం.

మంచినీళ్లు పట్టుకొచ్చి తుకారాంకి ఇచ్చి, "మాయింట్లో డబ్బు లేదుటోయ్" అన్నాడు యాదాలాపంగా.

"నువ్వు బలేవాడివే. ఇవాళ నువ్వు కాదంటే, ఏడాదిపొడుగునా నాకు దమ్మిడీ అప్పుపుట్టదు. దమ్మిడీ బాకీ తీర్చలేను తెలుసా?" అన్నాడు తుకారాం

"భేష్. అయితే అసలివ్వను"

"అలాకాదు. నువ్విప్పుడు ఇచ్చితీరాలి. సాయంత్రం మళ్ళా నేను ఈ అప్పు తీర్చి తీరాలి. ఇంక అసలు ఎవణ్ణీ ఎన్నడూ అడగదలచుకోలేదు."

"ఆకొడికి ఇవాళ పుచ్చుకోకపోవటమే మంచిదిగా" అంటూ, వంటివేపు తొంగి చూసి, చెక్కురాసిచ్చాడు గోపాలం.

మామూలుగానే. చెక్కుతో పాటు చీవాట్లు, పెళ్ళిచేసుకోరాదట్రా అని ఓ సలహా జత పరచి చేతులో పెట్టాడు.

చెక్కు చేతపట్టుకొని చీవాట్లు సలహాతో సహా చిల్లుజేబులో వేసుకొని బయల్దేరాడు తుకారాం.

గోపాలానికి అసలు సంగతి జ్ఞాపకం వచ్చింది. "ఓరే అప్పారావూ!...ఓయ్! మణుగ్గం! ఇలారా మాటమాట" అన్నాడు.

"త్వరగా చెప్పు. పోవాలి" అన్నాడు తుకారాం, తిరిగివచ్చి ఇంకో సిగరెట్టు తీసుకుంటూ.

"ఏంలేదు. నీకు పెళ్ళి. రేపే ప్రయాణం. మూటా ముల్లె ఉంటే సర్దుకో"

"అలాగా. శుభం. ఏవూరు?...అయినా నాకెందుకు లెద్దూ. సలహాలిచ్చే తెలివిలేదు, పనుంది వస్తా."

"అప్పారావ్. వెధవ్వేషాలెయ్యకు. నీకాక్కడు చెప్పేది?"

"ఏమిటది?"

"పెళ్ళి"

"ఎవరికి?"

"నీకే..."

"ఏశిలావు...అయినా ఏవూరు?"

"మావూరే. మా చినమావగారి కూతురు"

"మీకు చినమావగారున్నారా. మీసాల రావుకికూడా ఉన్నారు. ఆయన చాలా మంచివాడు. క్రితంసారి ఈ ఊరొచ్చినప్పుడు...నువ్వు ఊళ్ళో లేవులే. అర్జెంటుగా ఐదు కావాలంటే నర్దాడు...బహు

15 జ్యూయల్సు
చేతిగయారం రు. 5



స్విస్ తయారీ. 15 జ్యూయల్సు అసలు చేతిగడియారం. 16 ఏళ్ల గ్యారంటీ. ధర రు. 5. పోస్టేజీ రు. 1/8 - అదనం.

JAI HIND WATCH Co.
P. B. 97 (A. P. W) AMRITSAR.

★ తిరింగిఅగిలం ★

మంచివాడులే. తరవాత ఇస్తానంటే వద్ద న్నాడు" అన్నాడు.

"వఠి అప్రోయోజకుడు కాడు" అని గట్టిగా విసుక్కున్నాడు గోపాలం.

"ఎవరూ ఆయనా?"

"ఛప్!"

"ఇంకెవరు? మీ చినమావగారా?"

"ఛప్. నువ్వే"

"నే నేమిటి?"

"అప్రోయోజకుడవి"

"అవునా?"

"నీకు ప్రపంచంలో అప్పులు, అప్పులు ఇచ్చేవాళ్లుతప్ప మరొకటి కంటికానదు" అన్నాడు గోపాలం.

జరిగితే జ్వరం అంత సుఖంలేదు. దొరికితే అప్పులాంటి మంచి వస్తువులేదు. తుకారాం మనసారానమ్మిన మాట ఇది. అందుకని పకపక నవ్వాడు. విరగబడినవ్వాడు.

"హారినీ. ఇందుకా పనిమల్లె పిలిచావు. వస్తా పనుంది" అన్నాడు.

"అరె అదేమిటి నే చెప్పిన సంగతేం చేశావు...పెళ్ళిసంగతి?"

"పెళ్లా? ఎవరికిరోయ్" అన్నాడు తుకారాం హుషారుగా.

"పెంకెఘటమా." అని, ఆ పంథాలో కొంతసేపు ఉపన్యసించ సంకల్పించాడు గోపాలం. అంతలోకే, గోపాలం చినమావగారు జగన్నాథంగారు బజారునుంచి తిరిగి వచ్చాడు.

తుకారాంని ఆయనకి పరిచయం చేశాడు గోపాలం.

మాటా మంతీ ఆడినపుడు అప్పుల విషయం రాకుండా జాగ్రత్తపడ్డాడు. తుకారాంని బలవంతాన కుకేసి భోజనం పెట్టాడు.

"వస్తా పనుంది" అన్నాడు తుకారాం.

"చూడు సుబ్రహ్మణ్యం. నువ్వు ఇవాళ రాకపోయినా మహాబాగే కాని, రేపు మధ్యాహ్నం మూడింటికితప్పకుండా రా. మేమంతా ఊరెళ్తున్నాం. నీకు పది రూపాయలు అప్పిస్తాను" అన్నాడు గోపాలం రహస్యంగా.

"రైట్" అని వెళ్ళిపోయాడు తుకారాం.

*   *   *

"మీ సీతని ఈ అబ్బాయికిస్తే బావుంటుందండి. బహుమంచివాడు. అత్త ఆడపడుచుల పోరుండదు" అన్నాడు గోపాలం.

"అబ్బాయి దీపంలా ఉన్నాడు. ఓ సారి చూస్తే సరి" అన్నాడు జగన్నాథంగారు.

"శుభం రేపే ప్రయాణం" అన్నాడు గోపాలం.

వెంటనే, తుకారం గుహ వెతుక్కుంటూ వెళ్ళి శుభవార్త చెప్పాడు.

"వెయ్యినూట పదహార్లు కట్నం ఇస్తారు తెలుసా. మంచి, వ్యాపారం చేసుకుందువుగాని ఈ మూర్ఖులు గుమాస్తా బెడద ఉండదు" అన్నాడు.

"అబ్బెబ్బే. మనం కట్నం చచ్చినా పుచ్చుకోం తెలుసా? ఓ పని చెయ్యమను. ఆ వెయ్యి. ఇంకో వెయ్యి కలిపి అప్పుగా ఇవ్వమను. కావలస్తే నోటు రాసిద్దాం" అన్నాడు.

"నువ్వు బొత్తిగా ఇలా అయితే ఎలా జలాలుద్దీన్" అన్నాడు గోపాలం లాలనగా.

*   *   *

సాయంకాలం దీపాల వేళ, రాధమ్మ పెరట్లో తులసికోటకి దీపం వెలిగిస్తూ ఉండగా గోపాలం వచ్చి గుమ్మం మీద కూర్చున్నాడు.

"షికారయిపోయిందా ఏమిటి...ముందు గుమ్మం దిగండి. పీటేసుకు కూర్చోండి" అంది రాధ.

"అది సరేలేకాని, మా శోభనాద్రికి పెళ్లి సంబంధం చూశాను" అన్నాడు గోపాలం.

"శోభనాద్రెవరండీ."

"అదే. వాడే గోవిందలాల్..."

"అతగాడెవరు?"

"అబ్బ. అప్పారావు...ఐ మీన్ తుకారాం" అన్నాడు గోపాలం చిరాగ్గా.

"బావుంది. మీ ముద్దు పేర్లన్నీ నాకెలా తెలుస్తాయి. సరే...వి వూరుట?"

"మా ఊరే. సీత....మా బాబాయి సరే అన్నారులే."

"మీకేం మతిగినాపోయిందా. వరహీనం కూడా. పైగా అది పరమగయ్యాళి. దాంతో ఇలాటివాడు వేగలేడు" అంది రాధ.

"అది గయ్యాళి అయితే వాడు మొండి తెలుసా. వాడి కిష్టంలేని సంగతి చెవి కెక్కించుకోడు...ఇక యోగ్యతంటావా. అందుకేం లోపంలేదు."

"నే నన్న దదికాదు. ఆ పెంకెఘటాన్ని భరించలేడని" అంది రాధ ముభావంగా.

"గోపాలం! ఏంచేస్తున్నావు?" అంటూ జగన్నాథంగారు పెరట్లోకొచ్చాడు.

"అదే సీత పెళ్ళి సంగతే మాట్లాడుకుంటున్నాం బాబాయ్. నీకు ఈ అబ్బాయి నచ్చినట్లేనా? మొహమాట పడకుసుమీ" అంది రాధ.

"నచ్చినట్టే అనుకో...కాని...."

"సందేహించకండి మావయ్యగారూ..." అన్నాడు గోపాలం మర్యాదకి.

"అంటే మరేంలేదుసుమీ. ఆ మీసాలున్నాయి చూడు టిప్పుసుల్తానులాగా..."

"అబ్బే. అదాండి. ఇదివరకు అక్బరు పాదుషా పంథాలో పెంచాడు. మీసాలరావు ప్రభావంలెండి. దరిమిలా కృష్ణదేవరాయల ఫాషన్‌కి మార్చాడు. ఈ మధ్యనే ఎవరో చెబితే, ఇలా చేసుకున్నాడు. దానికేముందిలెండి..." అన్నాడు గోపాలం.

"మీకు వాళ్ల మీసాల పరిణామఘట్టాలు చరిత్ర కంతతా ఉంటాయిగాని, ఇవాళ బాబాయికి సినిమా చూపిద్దామన్నమాట గుర్తులేదు కదూ" అంది రాధ.

"ఇప్పుడేం పెళ్ళి గోడ లెందుకులే. ముందర ఐమీన్ సినిమా కేం తొందరలే ముందర పెళ్ళి సంగతి ఆలోచిద్దాం... రెండో సంగతేమిటండి మావయ్యగారూ?"

"అదే పిట్ట కొంచెం కూత ఘనమన్నట్టు ఆ పిల్లాడికి ఈడు తక్కువ అయిఉండి, అంతేకని మీసాలుంటే...చూశావూ నాకు సరిపడదు. ఇహ రెండోదేమిటంటావూ. అతనికి చౌరవపాలు ఒఖరవ ఎక్కువనుకుంటా అంటే డబ్బుతో కూడిన లావాదేవీలలో..."

గోపాలం గుండె గతుక్కుమంది. గబుక్కున తమాయించుకున్నాడు.

"మిమ్మల్ని అప్పు అడిగాడనికదూ మీరు చెప్పేది?... నే నతనికి బాకీలెండి ఇందాక అతనికి ప్రాణావసరం వచ్చి అడిగాడు. చెక్కు ఇచ్చాను. సరే ఇవాళ బ్యాంకు లేదు కదా అని, అంత అవసరమైతే, మిమ్మల్ని అడగమన్నాను లెండి" అన్నాడు కంగారుగా.

"నా తలకాయిలా ఉంది మీ సమర్థింపు మీరూనూ" అంది రాధ చిరాగ్గా.

"అబ్బే. నేను తప్పట్టుతున్నా ననుకునేవోయ్. అతనికి మంచి ఆత్మవిశ్వాసం ఉంది. యోగ్యుడుకూడా. బజార్లో ఇందాక కనబడ్డాడులే. ఏదో మాటామంతీ ఆడుతూ ఉండగా అర్జన ప్రసక్తి వచ్చింది. 'ఆఁ దాం దుంపతెగా, కుటుంబం పోషించుకోలేని వాడుంటాడండీ, నా కుట్టుకు నేను,



కాశ్మీరు శాలువ

రు. 2-8-0 మాత్రమే

96" × 54",

కొంతం కాశ్మీరు శాలువ రు 2-8-0

పోస్టేజీ అదనం. స్టాకు పరిమితంగా ఉంది. విలాసం ఇంగ్లీషులో వ్రాయండి:

KASHMIRI SHAWL HOUSE,
Durgiana (A. P. W.) Amritsar.


రమేశ్ ఇంటికి
వెళ్లుటకు భయపడ్డాడు...
నా బట్టలను మాపుకొన్నాను, రామ్. మా అమ్మ నన్నిప్పుడు తిట్టుతుంది.
రమేశ్, నేను-కూడా తరచుగా బట్టలను మాపుకొంటుంటాను గాని మా అమ్మ నన్నెప్పుడూ తిట్టదు, రావోయ్.
రామ్ ఇంటివద్ద:
ఎందుకతనేదుస్తున్నాడు?
అతడింటికి వెళ్లుటకు భయపడుచున్నాడు, ఎందుకంటే అతదు తన బట్టలను మాపుకొన్నాడు.
రమేశ్ ఇంటివద్ద:
మళ్లీ మురికిగా ఇంటికొచ్చావు! నిన్నింక యెప్పుడూ ఆటకు బైటకు వెళ్లనీయను!
ఈ బాలుని తిట్టకమ్మా - పిల్లలందరూ ఆడునప్పుడు మురికిగా నగుదురు.
ప్రతిరోజూ వాడి బట్టలను ఉతుకుటకు చెమట వొడుస్తున్నాను వాటిని బాదుతూ, అందుకవి చాలాత్వరగా చిరిగి పోతున్నవి.
అది నిజమే, బాదుట బట్టల పోగులను తెంచును మరి అందువల్లనే బట్టలుత్వరగా చిరిగి పోవును
బాదబడినబట్ట పెద్దదిగా చూపబడెనది
కాని మీరు సన్‌లైట్ పబ్బుతో ఉతికినప్పుడు బట్టలను బాదనక్కర్లేదు దాని సమృద్ధయిన నురగమురికి నంతటిని సులభంగాతొలగించును, ఆవిధంగా మీ బట్టలు చాలాకాలము మన్నును కూడ.
అది నిజం! త్వరగా నురగను గలిగించు సన్‌లైట్ సబ్బు బట్టలను బాదకుండానే సరిగ్గా తెల్లగాను మరియు కాంతివంత ముగాను ఉతుకును. అంటే- బట్టలు చాలాకాలము మన్నును మరియు నాకు డబ్బు మిగులును.
SUNLIGHT SOAP
SUNLIGHT SOAP
సన్‌లైట్ సబ్బు
భారతదేశంలో తయారుచేయబడినది
బట్టలు చాలకాలము మన్నునట్లు చేయును
S. 237-X52 TL

తిమింగిలగిలం

ఎన్నడూ దేనికీ లోటురానివ్వనూ, అంతగా అయితే అప్పయినా చేస్తాం అనటా(ని) అన్నాడు...మంచి ధైర్యవంతుడే." అన్నాడు.

అది హేళనో నిజమో గోపాలానికి తెలియలేదు.

"అయుక్క నిజమేనండి అయినా లోకంలో అప్పు చెయ్యనివాడెవడున్నాడు ప్రపంచం అంతా అప్పుమీదే నడుస్తోంది. గవర్నమెంటు వాళ్లు జనం దగ్గర, జనం గవర్నమెంటు దగ్గరా అప్పు తీసుకుంటారు. అప్పు పంచభూతాలలో ఒకటి. పృధివ్యప్తేజోవాయ్వాకాశాలన్నారు" అన్నాడు గోపాలం వెకలిగా నవ్వుతూ.

రాధకి ఉవ్వెత్తున కోపం వచ్చింది. వెక్కిరించబోయినంతపని చేసి, "చాల్లెండి. ఎవరన్నా వింటేనవ్విపోతారు" అని ఊరుకుంది.

రైలెక్కేముందు తుకారాంని చాటుకి పిలిచి పదిరూపాయల చేతిలో పెట్టాడు గోపాలం.

"అబ్బీ. నువ్వు కాబోయే పెళ్ళికొడుకువి. రత్నమంటి పిల్లని చూడబోతున్నావు. కాబోయే మావగారు నీ వెంటే వస్తున్నాడు. ఒళ్లు దగ్గిరపెట్టుకుని బుద్ధిగా మసలుకో. నన్నుగాని, మా ఆవిణ్నిగాని, అయ్యన్నగాని, మరే ప్రాణినిగాని దమ్మిడీ అప్పు అడిగావో నీ పూనా కూ అంతే." అని హెచ్చరించాడు.

అది జేబులో పెట్టుకుంటూ ఉండగా, గోపాలానికి అలాంటివే మరో నాలుగు కనబడ్డాయి,

"ఎక్కడివిరా అంతడబ్బు. విన్నటే గా నన్నడిగావు?" అన్నాడు

"ఆ. ప్రయాణం చూడు. ఎందుకేనా ఉంటుందని నలుగుర్ని అడిగి జతపరచుకొచ్చాను" అన్నాడు తుకారాం ఇకిలిస్తూ

పది ఉంచి మిగతాది తీసుకున్నాడు గోపాలం

రైలెక్కాకే కాని తుకారాంకి కాలు నిలవటం లేదు. స్టేషన్లో ఆగడం తడవు, రైలు దిగి నాలుగు పెట్టెలూ పరకాయించి చూసొస్తున్నాడు. ప్రతి చోటా ఎవడో ఒకడు తెలిసినవాడు కనబడుతునే ఉన్నాడు.

ఒక స్టేషన్లో గోపాలం రైలుదిగి సిగరెట్లు తేవడానికి వెళ్ళి వస్తూ ఉండగా ఆ పక్కనే తుకారాం ఎవరితోటో గుసగుసలాడుతున్నాడు. "పెద్దనోటుంది. మార్చి తరవాత ఇస్తాగాని, ఓ రూపాయివ్వండి" అని వినబడింది.

"ఒరేయ్ అవతారం నువ్విలా రా రా? నీకొక్కడు చెప్పింది" అని గదమాయించాడు గోపాలం.

రైల్లో కబుర్లూ ఆ పంథాలోనే సాగాయి. వేరుసెనక్కాయల్నించి ఆటంబాంబు వరకూ ఏ సంగతి ఎవరు మాట్లాడినా అప్పుల మీదకి చర్చల్ని మళ్ళించేస్తున్నాడు తుకారాం. ఆపడానికి గోపాలంవల్ల కాలేదు. అణా బేడా అప్పుచేసిన లక్షాధికారుల కథలు, అప్పులగురించిన వింతలు విశేషాలు దానిమీద అనుభవజ్ఞుల సిద్ధాంతాలూ కొల్లలుగా, ఎడతెరిపి లేకుండా అనర్గళంగా వర్ణిస్తూన్నాడు. రాధకి నవ్వాగటం లేదు. జగన్నాథంగారికి ఊపిరాడటం లేదు.

"ఇదెక్కడి గోలోయ్ దేవుడా. వీడెక్కడి మనిషోయ్ భగవాన్లూ" అని ఊహూ తలక్రిందులై కర్తవ్యం నిర్ధారణ చేసుకోలేక తిప్పలుపడుతున్నాడు. గోపాలం దాదాపు ఆశవదిలేసుకున్నాడు.

ఒక స్టేషన్లో హుషారుగా దిగి షికారు కెళ్ళిన తుకారాం, ఐదునిమిషాల తరవాత దిక్కుమొహం వేసుకొచ్చాడు.

'ఏం గిరాకీ' అన్నాడు గోపాలం నవ్వుతూ.

"హాలో ఖల్లాస్హాల్లో ఖల్లాస్" అని మూలిగాడు తుకారం. (అంటే పదిరూపాయలు పోయాయని భావం.)

గుడివాడ సంధి వచ్చేసింది. రైలు ఆగుతూ ఉండగా, ఎవర్నో చూసి ఎగిరి గంతేశాడు తుకారం.

గోపాలం అమాంతం వెంటబడి రెక్క దొరక పుచ్చుకున్నాడు.

"నీకేం మతిపోయిందా" అన్నాడు కోపంగా.

'లేదు పది' అని గొణుక్కున్నాడు. తుకారాం.

కూలీలు చుట్టుముట్టారు. తుకారాంకి భయమేసింది. దర్జాకోసం గోపాలం తనని కూలి ఇమ్మంటాడేమోనని.

"కామా కొట్లేల్లా మేం ఉండగా మీ కెందుకోయ్" అన్నాడు గంభీరంగా.

జగన్నాథం గారు ఛ ఛ అన్నాడు గబుక్కున.

కుర్రాడు లోకువైపోతాడని భయపడి గోపాలం బుకాయింపుకి సిద్ధపడ్డాడు.

"మీరూరుకోండి మామయ్యగారూ కాయకష్టం గౌరవం మీరింకా గ్రహించలేదు. మీరెందుకు మీరలా ఉండండి చెప్తా మీరిక్కడ సామాను చూస్తూ ఉండండి. రాధ అవతలప్లాట్ ఫారంమీద ఉంటుంది. నిమిషంలో మేంసామాను అవతలకి చేర్చేస్తాం" అన్నాడు. రాధనిస్తుపోయి, మర చెంబు, టిఫిన్ కారియరు పట్టుకు బ్రిడ్జి ఎక్కింది. గోపాలం ఉసూరుమంటూ, మోస్తున్నాడు. తుకారాం ఆయాసపడుతూ పరుగు పెడుతున్నాడు. అయినా కళ్ళు మాత్రం లేడికళ్ళలా నలువంకలా చూస్తూనే ఉన్నాయి. "అయ్యన్నిగాని ఇంకెవ్వరినిగాని దమ్మిడి బదులడిగావో చంపేస్తా" అని బెదరిస్తూ వచ్చాడు గోపాలం. రెండు ట్రిప్పులు అయ్యేసరికి ఓపిక తగ్గింది, జాగ్రత్త! అనిఓసారి, చంపేస్తాఅని ఓసారి స్పష్టంగా హెచ్చరికలు, బెదిరింపులు చేస్తూ వచ్చాడు. నాలుగో ట్రిప్పు అవుతూ ఉండగా, అంతసామాను తెచ్చినందుకు రాధమీద, పట్నంలో బోలెడు కొన్నందుకు మామగారిమీద విసుక్కున్నాడు. ఎదటివేపు నించి రైలొచ్చింది. బ్రిడ్జిమీద ఉండగా, గోపాలానికి, పరిగెడుతున్న తుకారాం కనబడ్డాడు గోపాలం బ్రిడ్జి దిగేసరికి ఇకిలిస్తూ, మురిసిపోతూ చకచకవచ్చేచాడు.

"ఏం చేశావు? ఎంత తెచ్చావు?" అన్నాడు గోపాలం ఆయాస పడుతూ.

"ఛ ఏం లేదే"

ఇద్దరూ కారోబుట్టా పట్టు మళ్లా బయలుదేరారు. అటు వెళ్ళేసరికి గోపాలం బాల్యమిత్రుడు మీసాలరావు, అతని భార్య, రాధతో మాట్లాడుతున్నారు. మీసాలరావు గడ్డంకూడా దట్టంగా పెంచాడు. మొహం అసలు కనబడటంలేదు.

"ఏరోయ్! ఎప్పుడు రావటం" అన్నాడు గోపాలం.

"అదే మొన్న రైలుదిగాను. మా పెట్టె ప్లాటుఫారం చివర ఆగిందిలే. తాపీగా మజిలీలు చేస్తూ ఇవాళకి ఇక్కడికి చేరాను. ఏమిట్రా నీ బొంద. చవటప్రశ్నలూ నువ్వూను" అన్నాడు మీసాలరావు.

తుకారాం, గోపాలం వెనక దాగినట్టు నిల్చున్నాడు.

"వీడికి ఎంతిచ్చావురా?" అన్నాడు గోపాలం మీసాలం పకపక నవ్వాడు.

"ఐదు...వాడి దుంపతెగా మాట తోచనిస్తేనా. నేనిక్కడే దిగుతున్నానని చెప్తే వినిపించుకోడే. రైలు ఆగకుండానే

నాణ్యతకు ప్రసిద్ధి చెందినవి!

ఎస్. ఆర్. మిస్కి ఇంగువ, కర్పూరపు బిళ్లలు, స్పెషల్ జవ్వాదువత్తులు.

బాలకృష్ణా ఇండస్ట్రియల్ వర్క్సు, మద్రాసు 13.

సేల్స్ ఆఫీసు:
27, స్ట్రింగన్ ముత్తయ్యముదలివీధి, మద్రాసు-1.

చూశాడు. అంతే ఆ చివరకొచ్చి 'అర్జెంటు పదు' అంటూ తగులుకున్నాడు. ఇవ్వక చస్తానా...ఏరా అప్పారావు అంతేనా ?" అన్నాడు.

'హాయింటే' అన్నాడు తుకారాం.

* * *

పెళ్ళిచూపులు ఫలప్రదం కాలేదు. సీతకి తుకారాం వాటం నచ్చలేదు. అందుగ్గాను, సుబ్బారావు అనే ఘటం ఒకటి—పెద్దసైజు 'ఋణ' ధ్రువం హాజరు కావడంతో తుకారాం హుషారు పట్టపగ్గాలు లేకుండా పోయింది. సంబంధం కుదరనందుకు గోపాలం చిన్నబుచ్చుకున్నాడు.

"పోవుందండీ, దానికి నచ్చకపోతే మన మేం చేస్తాం" అంది రాధ.

"కావలస్తే ఓ పదిరూపాయలు అప్పిస్తాను. ఏమనుకోవద్దను బావా" అంది సీత నవ్వుతూ.

రాధ మందలించింది..

నిజానికి తుకారాం ఈ విషయం అట్టే పట్టించుకోలేదు. ఫలితం చూచాయగా తెలియగానే, ఒక్క క్షణం తలవంచుకున్నాడు. "ఘటన ఉండాలిగదా. మా యిద్దరికీ ఋణానుబంధం లేదేమో" అన్నాడు మెల్లిగా.

"నీ ఋణం తగలేసిరి" అన్నాడు గోపాలం ఉప్పొంగే ఆశ్చర్యంతో, ఆనందంతో, ప్రేమతో, వాత్సల్యంతో.

* * *

పెళ్ళిచూపులకి పెద్దమనిషిగా వచ్చిన 'ఋణధ్రువం' సుబ్బారావుకీ, మహా ఋణవంతుడు, ఋణాశనుడు ఋణాఢ్యుడు అయిన అప్పారావనే తుకారాంకీ క్షణాల మీద స్నేహం కలిసిపోయింది. దృక్పథాలు ఏకీభవించాయి. ఒకరిప్రతిభ నొకరు గుర్తించారు. అక్కడే చిక్కు. ఇద్దరికీ భయం పట్టుకుంది. ఎవరినెత్తిన ఎవరు చెయ్యిపెడతారా అని.

షికారు రమ్మన్నాడు సుబ్బారావు సరే పదమన్నాడు అప్పారావు.

పది నిముషాలలో ఋణకణధ్వని చెలరేగింది. నా మాట వినండే నా మాట వినమనుకున్నారు. బాబ్బాబు అని ప్రతిమాలుకున్నారు. రేపటికి ఫిరాయించేస్తానని పరస్పరం హామీలు ఇచ్చుకున్నారు.

స్థానబలమే జయించింది. ఋణధ్రువమే సార్థకమైంది. అంటే సుబ్బారావే గెలిచాడు. అనగా అప్పారావు అనే తుకారాం, గుడివాడ సంధిలో మీసాలరావు దగ్గర వడేసి పుచ్చుకున్న ఐదు రూపాయలూ సుబ్బారావుకి అప్పుగా సమర్పించుకున్నాడు. జీవితంలో తొలి పరాజయం అది.

సుబ్బారావుకి జీవితంలో తొలి మన విజయం అది. మురిసిపోయాడు. గర్వపడ్డాడు. తుకారాంమీద అభిమానం పెల్లుబికింది. గొప్ప ఊహ తట్టింది. మా యింటికి భోజనానికి రా అన్నాడు.

రైట్ అన్నాడు తుకారాం. సుబ్బావురా అత్తగారు మాటామంతీ ఆడుతో ఊరూ పేరూ కనుక్కుంది.

భోజనానంతరం తుకారాంని సావిట్లో కూర్చోపెట్టి, లోపల అత్తగారితోనూ, భార్యతోనూ, మరదలితోనూ మాట్లాడి వచ్చాడు సుబ్బారావు.

* * *

పదినిముషాల తరువాత, సుబ్బారావు, అత్తగారూ సావిట్లోకి వచ్చి, తుకారాంకి పిల్లనిచ్చి పెళ్ళి చేస్తామన్నారు. ఇంకో క్షణం తరువాత, సుబ్బారావు తన మరదల్ని కేకేశాడు.

తుకారం ఓ క్షణం ఆలోచించి, అట్టే బెట్టు చెయ్యకుండానే 'రైట్ సుబ్బారావ్' అనేశాడు.

* * *

రాత్రి ఎనిమిది గంటలకి తుకారాం గోపాలం ఉన్న ఇంటికి వెళ్ళాడు.

"పరారీ అయిపోయావనుకున్నా...రా" అని చేరదీశాడు గోపాలం.

దూరదృష్టి లోపించినందువల్ల తుకారాం జేబు గుట్టు బయట పెట్టింది.

"ఈ నోట కట్టేమిటిరా. ఇక్కడెవరు అప్పిచ్చారురా నీకు?" అన్నాడు గోపాలం ఆశ్చర్యపోతూ.

"కాబోయే అత్తగారులే. సుబ్బారావు మరదల్ని చేసుకుంటున్నా. కట్నం ఐదొందలు. టెంపరరీగా ఓ యాభై అప్పు తీసుకున్నాను." అన్నాడు తుకారాం సిగ్గు అభినయిస్తూ.


అప్రయత్నంగా గోపాలం ఆ నోట్లు లెక్కపెట్టాడు. "పాతికే ఉన్నాయేం?" అన్నాడు వెంటనే.


"ఓ పాతిక మా తోడల్లుడు సుబ్బారావు చేబదులు తీసుకున్నాడు" అన్నాడు తుకారాం.

"నువ్వెవరో కాని అసాధ్యుడివిరా" అన్నాడు గోపాలం కొయ్యబారిపోయి.

"దానికేముంది ఋణానుబంధం" అని ఛలోక్తి విసిరాడు తుకారాం.

"అబ్బే నీ సంగతి కాదులే" అన్నాడు గోపాలం. ★





శాకాహారులకు పుష్టికరమైన భోజనము

ఉదయము లేచినప్పటినుండే గృహిణికి 'ఈ పూట వంట ఏం చెయ్యాలి?' అన్నదొక సమస్యగా ఉంటుంది. ఒక యింట్లో నలుగురు ఉంటే, అందరికీ ఏ ఒక్క వంటకమూ కలిసిరాదు; యజమానికి ప్రీతికరమైనది పెద్దకొడుకు తినడు; అతడికి రుచించినది కనిష్ఠులకు నచ్చదు; పిల్లల దృష్టిలో ఆమోదింపబడినవి యజమానికి సరిపడవు. సాధారణముగా అందరి యిళ్లలోను ఒక గృహిణి మాత్రము తన యిష్టాయిష్టాలను అంతగా పాటించదు. ఇది బహుశః పాలనా సౌకర్యమువల్ల కలిగిన దృష్టి అయినా కావచ్చు - లేక స్వభావరీత్యా సరిపెట్టుకోవటమయినా కావచ్చు.

ప్రతినిత్యమూ యజమానికీ పిల్లలకూ రుచ్యములయిన వంటకాలను గమనించిచేసే గృహిణికి, మరొక చిక్కు వస్తుంది. అందరికీ ఇష్టమయిన వంటకాలు ఏ రెండో మూడో రకాలు కనబడుతాయి. వాటిని చేయగానే 'అబ్బ! రోజూ ఈ కూరా వచ్చుడేనా?' అని విసుక్కుంటారు. కష్టపడి వంటచేసిన ఇల్లాలికి, భర్తగాని పిల్లలుగాని చేసినవంట మెచ్చక, విసుగుతో, సరిగా భోజనాలు చేయకుండా లేచిపోతే, మనసు చివుక్కుమంటుంది. వంట చేయటానికి ఇల్లాలి ఉత్సాహము దిగజారిపోతుంది. ఏదిచేసినా ఎవరూ మెచ్చరని ఒకవిధమైన అసంతృప్తి ఆమెలో బయలుదేరుతుంది. కొన్ని కుటుంబాలలో భోజనాల రభస వర్ణనాతీతముగా ఉండి ఇల్లాలిపరిస్థితి దినదినగండముగా ఉంటుంది.

అసలు ఈ వంటకాలు ఆహారము నాటి రుచులను బట్టికాకుండా, విలువలనుబట్టి గ్రహించటము తెలిసికొనినుంటే, ఈ సమస్య ఇల్లాలిని అంతగా బాధించదు. రుచులు పాటింపబడవలసినవే కాని - అవి పదార్థపు విలువకంటె ప్రధానమైనవికావు. విలువగల పదార్థాలను రుచికరముగా వంటచేసుకొని, భుజించటము అవసరమని గ్రహించినట్లయితే, గృహిణికి ప్రతినిత్యమూ వంటకాలను నిర్ణయించటములో కలిగే సౌలభ్యము అటుంచి, తీసుకొన్న ఆహారములో పదార్థాల విలువనుబట్టి దేహానికి బలము చేకూరటానికి అవకాశము కలుగుతుంది

ఇల్లిందల సరస్వతీదేవి

మానవ దేహపోషణలో ప్రోటీనుల (మాంసకృత్తుల) ప్రాముఖ్యత 1839 లో తెలిసికొనబడ్డది. దీనిని కనిపెట్టిన శాస్త్రజ్ఞుడు 'దేహావయవాలలో కండరాలు, చర్మము, కోశములు, వెంట్రుకలు-వీటన్నిటి నిర్మాణములో ప్రోటీనులు ప్రముఖ పాత్ర వహిస్తున్నట్లు తెలిసికొన్నాడు. ప్రోటీను అనగా మూలావసరమైనదని అర్థము ఈ ప్రోటీను మొక్కలలో ఉత్పత్తి అవుతుంది. మన శరీరానికి కావలసిన ప్రోటీనులను సహజముగా ఉత్పత్తిఅయినవాటినుండి గ్రహించటమే ఉత్తమమైన మార్గము. పప్పులు, గింజలు, ధాన్యాలు ప్రోటీనుకు మూలపదార్థములు. దుంపలలో, ఆకు కూరలలో ప్రోటీను తక్కువ ప్రమాణములో లభిస్తుంది. ఈ ప్రోటీను పండ్లలో చాలా తక్కువగా ఉంటుంది. మాంసము, చేప, గుడ్లు, పాలు-వీటిలో కూడా ప్రోటీనులు ఉంటాయి.

మాంసాహారముకంటె శాకాహారము నిస్సారమయినదని సామాన్యముగా అనుకునే మాట; కొందరు వైద్యులు కూడా ఖండిత

ముగా వాదిస్తారు. ఇంగ్లండు దేశములో అనేక ప్రయోగాలను చేసిన ఒక ప్రొఫెసరు 'భోజనములో మాంసము తప్పకుండా వుండి తీరాలనటానికి తగిన ఆధారాలు లేవు' అన్నారు. స్కూల్ ఆఫ్ హైజీన్ అండ్ హెల్తు డైరెక్టరు ఒకరు 'పుష్కలముగా పాలు, మంచి శాకాహారము మానవుడికి తృప్తినీ, ఆరోగ్యాన్నీ చేకూర్చగలవవటంలో సందేహము లేదు' అన్నారు.

దేహాభివృద్ధికీ, మరమ్మతుకూ పరిపోవు ప్రమాణములో మాత్రమే ప్రోటీనులు ఉపయోగించాలి. ఇవి అధికముగా తీసుకొన్నప్పటికీ శక్తికింద దహింపబడటమో, మలిపము క్రింద విసర్జింపబడటమో జరుగుతుంది. ప్రోటీను కాయకష్టము చేసేవారికీ, మెదడుతో పనిచేసేవారికీ కూడా అవసరమయినది. ఎదిగేబిడ్డలకు ప్రోటీను పుష్కలముగా కావలసివుంటుంది. ఇది తగినంతగా లభించకపోయినట్లయితే పిల్లలు ఎదగటంలో లోపము కలుగుతుంది. అంతర్జాతీయ పరిశోధనా సంఘము మనిషియొక్క బరువులో ప్రతి 2.2 పౌనులకు ఒక గ్రాము ప్రోటీను మానవ దేహానికి అవసరమని నిర్ణయించింది. కనుక, ఏ వస్తువులో ఎంత ప్రోటీను ఉన్నదో ప్రతి గృహిణీ తెలిసికొన్నట్లయితే వాటిని ఉపయోగించటములో సౌలభ్యము కలుగుతుంది.

ఒక కప్పు వండిన సోయా చిక్కుడులో—18 గ్రాముల ప్రోటీన్లు.

రెండు ఔన్సుల గింజల ముద్దలో—11 గ్రాముల ప్రోటీన్లు.

అరకప్పు తాజా బటానీలలో—7 గ్రాములు.

గ్లాసెడు పాలలో—8.5 గ్రాములు.

అరకప్పు వండిన నేవీ చిక్కుడులో—7 గ్రాములు.

ఒక గ్రుడ్డులో—7.5 గ్రాములు.

ఒక టేబిలుచంచా వేరుసెనగ వెన్నలో—6 గ్రాములు.

అర్ధ ఎండిన అత్తిపళ్ళలో—4 గ్రాములు.

15 వేరుసెనగ పప్పులలో—4 గ్రాములు.

10 పెద్ద బాదాములలో—3 గ్రాములు.

ఒక స్లైసు బ్రౌను బ్రెడ్ లో—3 గ్రాములు.

¾ ఆకు కూరలో—3 గ్రాములు.

మధ్యస్థమయిన 1 బంగాళాదుంపలో—3 గ్రాములు.

1 పండులో (ఇంచుమించుగా అన్ని రకాలు)—1 గ్రాము.

కూరలను మూడు రకాలుగా విభజించి, ఆకుకూరలు, కాయగూరలు, దుంప కూరలు అని వ్యవహరిస్తున్నాము. ఆకు కూరలలో ఉన్న ఖనిజాలు రక్తములో ఎరుపు రక్త కణాలలో ప్రాణవాయువును తీసుకొనిపోవు ఎరుపురంగును (హీమొగ్లోబిన్) వృద్ధి చేస్తాయి. కండరనాడీ మండలాలను ఆరోగ్యమయిన స్థితిలో ఉంచటము, రక్తము గడ్డకట్టుకొను శక్తిని ఉండవలసిన స్థాయిలో ఉంచటము, దేహపు ఆమ్లాన్ని పొదుపు చేయటము, దేహములోని కాల్షియమును పోషించటము—ఈ పనులు తప్పనిసరిగా దేహారోగ్యసంరక్షణకు జరుగవలసినవి. ఇవన్నీ ఆకుకూరలవల్ల నెరవేరుతాయి. కనుక ఆకుకూరలు నిత్యమూ ఆహారములో చేర్చ తగినవి.

సక్రమమైన భోజనముద్వారా లభించేవి కాక, విటమినులు ఖనిజాలు అదనముగా కూడా వాడుతూ ఉండాలి. ఖనిజాలలో కాల్షియము ఇనుము వృద్ధులకు ఎక్కువ అవసరము. దేహములో ఇనుము తగ్గినప్పుడు రక్తహీనత సంభవిస్తుంది. కనుక ఇనుము ఎక్కువగా ఉన్న భోజనపదార్థాలను వాడాలి. వాటిలో క్రొవ్వు ఎక్కువగా లేని ముడి గోధుమపిండి, ఆకుకూరలు, చెరకు పానకము, ఎండు ద్రాక్ష ముఖ్యమైనవి. వీటిలో కొంతవరకు కోబాల్ట్ రాగి మెంగనీసులు కూడా ఉండటమువల్ల వీటిని పేర్కొనట మయినది. ఇవి తక్కువగా ఉండే వరి అన్నము మొదలయిన ఇతర పదార్థాలలోని లోపాలను తీర్చటానికి ఆకుకూరలు సాధనములుగా ఉపయోగపడతాయి. ఆకు కూరలలో కాల్షియము, ఇనుము, విటమిను బి1, బి 2, ప్రోవిటమిను ఎ, కె. ఉన్నాయి.

ఆకుకూరలలో దేశీయమైనవీ కృషిచేసి పెంచబడేవి పెరుగుతోటకూర, మొక్కతోటకూర, కొయ్యతోటకూర, మట్టుబచ్చలి, తీగ బచ్చలి, గోంగు, చుక్కకూర, మెంతికూర, కొత్తిమిరి, చేమకూర, అవిసె, చింత, పాలకూర, గంగబాలివి.

కృషిచేసి పెంచవలసిన విదేశీయములైన ఆకుకూరలు లెట్యూస్, క్యాబేజి (గోబి), కాలీఫ్లవరు (పువ్వుగోబి) సెలరీ, టర్నిప్ ఆకు మొదలైనవి కొంతకాలమునుండీ, మన దేశంలో పెంచబడుతున్నాయి.


పైవి గాక, స్వతస్సిద్ధముగా తోటలలో పెరళ్లలో పెరిగేవి. చిలుక తోటకూర, దొగ్గలి, పొన్నగంటి, పులిచింత, గలిజేరు, వావిల, నల్లేరు, సీకాయచిగురు, సెల్లికూర మొదలయినవి. ఇవి కాలువ చెరువుగట్లమీద కూడా పెరుగుతూ ఉంటాయి.

ఆకుకూరలను పెంచటము చాలా సులభము. కొనటానికికూడా చౌక. కాని—కాయలు దుంపలు ఉన్నంత రుచిగా ఉండవు. కనుక వాటితోపాటుగా ఆకుకూరలను చేర్చి తీసుకోవటము మంచిది. ప్రతిదినమూ మన ఆహారములో చేర్చుకొనే కూరలలో, నాలుగవ వంతైనా ఆకుకూరలు ఉండటము శ్రేష్ఠము. చాలామంది ధనవంతుల ఆహారములో, ఈ ఆకుకూరలు లోపించినందువల్ల అనారోగ్యము పొందగించటము జరుగుతూ ఉంటుంది. సామాన్యులు ఆకుకూరలను వాటి విలువలనుబట్టికాక, చౌకగా లభిస్తాయని వాడుతూ ఉంటారు. ఆకుకూరలను పట్టణాలలోకంటె గ్రామాలలో ఎక్కువగా ఉపయోగిస్తారు. పట్టణాలలో ఆకుకూరలను పెంచటముకూడా తక్కువే.

ఆకుకూరలు శరీరపుష్టికి అంతగా ఉపకరించవు. కాని ఇతరపదార్థాలలోని లోటును తీర్చటానికి ఉపయోగపడుతాయి. ఆకుకూరలలో నారపదార్థము కొంత ఉండటము చేతను, నైసర్గిక స్వభావముచేతను అవి విరేచనకారులు. కనుక ఆహారములో విధిగా ఆకుకూరలను చేర్చుకొన్నవారికి మలబద్ధకము ఉండదు.

ఆకుకూరలను అలవాటు చేసుకొన్నయెడల పచ్చివే తినవచ్చును. కాని వండకుండా తినటము కష్టమే. వీటిలో లెట్యూస్, పెరుగు తోటకూర అలవాటు చేసుకొన్నట్లయితే అంత కష్టముగా ఉండవు. బచ్చలి, క్యాబేజీకూడా ప్రయత్నించతగినవి. ఆకుకూరలు సన్నగా తరిగి, పెరుగులో కలిపి, పచ్చికొబ్బరి, పచ్చిమిరపకాయలు, కొత్తిమిరి, పండిన టొమేట సన్నగా తరిగి చేర్చుకొని, అవసరమనిపిస్తే నిమ్మపండు వాడుకోవచ్చు. దీనిని వ్యంజనము క్రింద ఉపయోగించవచ్చు దీనిలో మొలకలు తేలిన ధాన్యాలను కూడా చేర్చుకోవచ్చు. ఆకు కూరలను ఎండబెట్టి, సీసాలలో భద్రపరచుకొని వాడుకోవటముకూడా మంచిదే. ఆవిధముగా ఎండబెట్టినప్పటికీ విటమిన్ 'సి' నశించదని పరిశోధనలవల్ల తేలినది. ఈ విధముగా నిలువచేసిన ఆకు పొడిని పూటకు రెండు చంచాలవంతున బెల్లములోకాని తేనెలోగాని, అరటి సపోటా వంటి పండ్లలో కలిపిగాని తీసుకోవచ్చు.

కూరదినుసులలో చేరకపోయినా తమలపాకులు పచ్చివిగా తినదగినవి. మన దేశములో ఈ ఆకులను తాంబూలముగా వాడుకొనే ఆచారము శ్రేష్ఠమైనదే కాని ఈ ఆకులతో



★ శాఖాహారులకు పుష్టికరమైన భోజనము ★

పాటు పోకచెక్కలు సున్నము కాచు మొదలయిన ఇతరమసాలాద్రవ్యాలు హెచ్చుగా ఉపయోగించటము చేత మేలుకంటె కీడు ఎక్కువగా కలుగుతుంది. ఒక శాస్త్రజ్ఞుడు తమలపాకులను వేరుసెనగ గింజలతో కలిపి, కొంతసేపు నమలి తినవచ్చుననీ, యీ పద్ధతికూడా అనుకూలమైనదీ లాభకరమైనదీ దీని తేల్చాడు. తులసి పచ్చిదిగా తినదగిన ఆకు. దీని శక్తి అమోఘమని ఆయుర్వేద శాస్త్రజ్ఞులు విశదీకరించారు. ఈ ఆకు వేసిన నీళ్లు త్రాగటముకూడా మంచిది. ఈ తులసి తీర్థము మనకు దేవాలయాలలో లభిస్తూ ఉంటుంది. దేవాలయములో ప్రసాదింపబడిన తులసిదళము కొంతభాగము తిని, కొంత భాగము చెవిలో పెట్టుకోవటము హైందవాచారము. తులసిఆకు క్రిమి సంహారి. వేపాకు కూడా క్రిమి సంహారి. వేపపూతను ఉగాది నాడు మామిడి ముక్కలు, చింతపండు పులుసుతో కలిపి, బెల్లముచేర్చి తిన్న తరువాత నే, మరొక పదార్థము తినటము మన ఆచారము. ఈ వేపపూతను సంవత్సరముపొడుగునా వాడుకోవటానికి వీలుగా ఎండబెట్టి వరుగు చేసి ఉంచుతారు.

మనకు కావలసిన ప్రోటీనులు పప్పులలో గింజలలో కూడా ఉంటాయి శాకాహారులకు ప్రోటీనులు పప్పులనుండీ, ధాన్యాలనుండీ లభిస్తాయి కనుక వాటి విలువలను వివరాలను తెలిసికోవటము ముఖ్యము. పప్పుపదార్థాలలోని ప్రోటీనులు అసమగ్రమయినవి. ఈ లోటు మజ్జిగతోను పాలతోను భర్తీ చేయవలసినది. కోడిగ్రుడ్డు అయినా చేర్చబడని శాకాహారము ఒక కప్పుపాలతో కాని సమగ్రమైనది కాదు. ఈ క్రమము గర్భిణీస్త్రీలకు, ఎదుగుతున్న బిడ్డలకు, బిడ్డలకు పాలుయిచ్చే తల్లులకు రెట్టింపు చేయవలసి ఉంటుంది. ప్రతినిత్యమూ అర్ధసేరు పాలు త్రాగటమువల్ల సమగ్రమయిన ఆహారము దేహానికి లభించి పుష్టి కలుగుతుంది.

బటానీ గింజలజాతిలో చేరినది. ఇది పూర్తిగా ప్రోటీనుమయము. దీనిలో విటమిను బి 1 కూడా ఉంటుంది. విటమిన్ బి 1 ఆరోగ్యకరమైన పుష్టివంతమైన ఆహారములో చేర్చతగినది. ఇది దేహానికి అలసట నివ్వదు. బటానీలను చెట్టుమీదినుండి త్రెంపగానే వంటకాలలో కలిపి ఆరగిస్తారు. ఒక గుప్పెడువంతున బటానీలు పచ్చివిగాని, వంటకాలతో కలిపి వండిగాని, వారానికి మూడు పర్యాయములు భుజించగలిగినట్లయిన, దేహానికి ప్రోటీనులు పుష్కలముగా లభిస్తాయి.

పప్పుపదార్థాలు సులభముగా అరుగుదలకు రావు. కాని నానబెట్టగా మొలకదేరిన బటానీలలో ఉన్న ప్రోటీనులు సులభముగా జీర్ణము కాదగినవి. నానబెట్టిన బటానీలు మొలకదేలిన తరువాత పచ్చివిగాని వేయించిగాని తినవచ్చును.

పప్పు పదార్థాలలో లభించే ప్రోటీనులలో, మినుము పెసరలలో లభించేవి ఉత్తమమైనవి. పెసరలో లభించేవి మరింత శ్రేష్ఠమయినవి. మొలకదేలిన పెసరలో విటమిన్ బి, సి కూడా ఉంటాయి. వీటిని పచనము చేయటములో మూడు నిమిషాలకంటె ఎక్కువ సమయము అయినట్లయితే, విటమిన్ సి. నశించిపోతుంది. నానబెట్టిన పెసరగింజలు మెత్తగా రుబ్బి భోజనములో ఉపయోగించుకొన్నట్లయితే, వాటిలో ఉన్న ప్రోటీనులు మిగతా ఆహారముతో ఏకమయి, సులభముగా జీర్ణము కాగలవు. పప్పులను నానబెట్టి రుబ్బి పచ్చళ్లు చేసుకోవటము మనకు అలవాటేకాని, మొలకదేలినవాటిని రుబ్బి పచ్చడి చేసుకోవటము శ్రేషము. కొంత తీసినా, కొంతవరకూ పప్పుకు పొట్టు ఉంచటము మంచిది.


కూరగాయలలో విటమినులను, ఖనిజాలను నిలుపవలెనంటే, తాజా కూరగాయలను ఉపయోగించుకోవలెనన్నది అందరికీ తెలిసిందే. కాని— వండిన తరువాత, ఎంతో సేపటికి భుజించటము గాని, వాటిని తిరిగి తిరిగి వేడిచేయుటము గాని చేసినట్లయితే ఆ విటమినులన్నీ నశించిపోతాయి ఖనిజాలు మాత్రము నిలువ ఉన్నందువల్ల చెడిపోవు. అవి నీటితో కలిపితే గాని నశించవు. మనలో కొందరు ఆచారపరులు ఉదయపు వంటకాలను రాత్రికి ఉపయోగించరు, కాని ఆచారము అంతగా లేనివారు ఉపయోగిస్తూ ఉంటారు. ఈ ఆచారపరులు ఉపయోగించకపోవటములో ఉన్న అర్థము, పైన వివరింపబడినటగా కనబడుతుంది కాని కేవలము ఆచారము కొరకు కాదు.

కూరగాయలను వండేటప్పుడు కొద్దిగా నీళ్లుచల్లి వండాలిగాని వార్చకూడదు. వండిన పదార్థాలను భద్రముగా మూసి ఉంచాలి. వీటిని ఆవిరిమీద సిద్ధము చేసుకొంటే మరీ శ్రేష్ఠము. కూరలను చమురువేసి చాలాసేపు వేయించటము గానీ, అధికముగా ఉడకపెట్టటముగానీ చేసినట్లయితే, ఆ పదార్థాలలోని సి. విటమిను నశించిపోతుంది. ఎక్కువగా పొట్టు తీయటమువల్ల కూడా పదార్థాల విలువ తగ్గుతుంది. సోడా వేసినందువల్ల విటమిను సి. నశించిపోతుంది. తిరిగి వేడి చేసినందువల్ల నూటికి 90 వంతులు విటమినులు నశించిపోతాయి.

కూరగాయలలో మొదళ్లుకానీ చివరలుగానీ పొట్టుగానీ తీయనవసరము లేనివి అన్నిటికంటె శ్రేష్ఠమయినవి. ముల్లంగి, ఉల్లి మొదళ్ళలో, కొసలకంటె ఖనిజము ఎక్కువగా ఉంటుంది.

చాలామంది స్త్రీలకు దుంపలను గురించి ఒక అనుమానము పీడిస్తూఉంటుంది. ముఖ్య

(56 పేజీ చూడండి)



ఆంధ్రరాష్ట్రమునకు ఏజెంట్లు : సీతారాం జనరల్ స్టోర్సు ఏజెన్సీస్, విజయవాడ.

బాలసాహితి:

నిజన్యాయం

మూలం: **ప్రేమ్‌చంద్**

అనువాదం: **“సత్యం”**

జుమ్మన్ శేఖ్, అలగు చౌదరి బాల్యంనుంచి ప్రాణ స్నేహితులు. ఒకరిపై ఒకరు పూర్తి విశ్వాసంతో మెలగుతుండేవారు జుమ్మన్ శేఖ్ విద్యలో గొప్ప అయితే అలగు చౌదరి సంపదలో గొప్ప.

జుమ్మన్ శేఖ్‌కు ఒక ముసలి పినతల్లి గలదు. ఆమెకు జుమ్మన్ శేఖ్ తప్ప నా అన్న వారెవరూ లేరు. ఆమెకు కాస్త ఆస్తిగూడ ఉన్నది. విశాలమైన వాగ్దానాలతో జుమ్మన్ ఆ ఆస్తిని తన పేర వ్రాయించుకొనెను.

దానపత్రం రిజిస్టరీ అవ్వనంత వరకు ఆమెను ఆదర సత్కారాలతో ఆదరించాడు. దానపత్రం రిజిస్టరీ అయిన వెంటనే ఆదరసత్కారాలకు గూడ అంతం ఏర్పడింది. దానికితోడు జుమ్మన్ భార్య ఎండిపోయిన రొట్టెలతోపాటు కొద్దిగా తిట్లు గూడ పెడుతుండేది ముసలమ్మకు.

“ఈ ముసలిముండకు మేం పెట్టలేకుండా ఉన్నాం. కొద్దిగా ఆస్తి ఇచ్చిందో లేదో దానికి బ్బడిగా మావద్ద తింటున్నది. ఎన్నాళ్ళకు చస్తుందో ఈ ముసల్ది. పీడ! దీనికి పెట్టే ఆహారంతో రెండు మూడు గ్రామాలన్నా కొనవచ్చు” అని జుమ్మన్ అతని భార్య ముసలమ్మను తిడుతుండేవాళ్లు.

కొన్నాళ్ళవరకు ఈ మాటలు వింటూ సహించగలిగింది, పాపం! ఆ ముసలిపినతల్లి.

చివరకు తెగించి ఒకరోజున “అరే! అబ్బాయి ఇంక నీవద్ద నేనుండలేను నాకు గనుక కొంచెం డబ్బు యిచ్చావంటే వేరే వండుకు తింటాను” అన్నది ముసలిపినతల్లి.

“ఏం, ఇక్కడ రూపాయలు పండుతున్నయి అనుకున్నావా?” అన్నాడు గర్వమైన స్వరంతో జుమ్మన్ శేఖ్.

“కొంచెం గూడా యివ్వలేవా?” జాలిగొలిపే స్వరంతో అన్నది పినతల్లి.

“లేదు” అన్నాడు కఠిన స్వరంతో ఆ కఠినాత్ముడు.

“అయితే పంచాయతి పెట్టించవలసివస్తుంది” అని బెదిరించింది ముసలమ్మ.

“ఊ, త్వరగా కానీయి, నాకు రాత్రింబగళ్ళు ఈ గోల ఏం బాగాలేదు” అన్నాడు అందుకు నవ్వి జుమ్మన్.

పంచాయతిలో జయాపజయాల భయం జుమ్మన్‌కి ఎన్నడూ లేదు. అతనికి ఎదురుపల్కి శత్రుత్వం వహించడానికి ఎవరు సాహసిస్తారు?

2

ఆరోజునుంచి ముసలమ్మ కర్ర సహాయంతో ప్రతి మనిషివద్దకు, ప్రతి గ్రామానికి, ప్రతి పల్లెకు వెళ్లి తన గోడు చెప్పుకొని తనకు పంచాయతిలో సహాయం చేయమని వేడుకుంది.

కొందరు “ఊ, ఊ” అంటూ ఊ కొట్టి ఊరుకున్నారు.

కొంతమంది ఆమెను చూచి నవ్వి “కాటికి కాళ్లు జాచిన నీకు ఎందుకమ్మా ఈ గొడవంతా? హాయిగా వాళ్ళు పెట్టిందేదో తిని రామ్ రామ్ అంటూ కళ్లుమూసుకు పడుకోక” అని నీతులు చెప్పి సాగనంపారు.

చివరికి అలసి సొలసి అలగు చౌదరి ఇంటికి వెళ్ళింది తనవిషయమంతా చెప్పుకొని విలవిలా ఏడ్చింది. సహాయం చేయమని బతిమాలింది.

“నేను పంచాయతికి వస్తాను కాని ఎవరివైపు ఏవిధంగానుమాట్లాడను. జుమ్మన్ నా బాల్య స్నేహితుడు. అతనితో శత్రుత్వం తెచ్చు

★ నిజన్యాయం ★

కోవటం నా కిష్టంలేదు" అని అలగు చౌదరి చెప్పాడు ఆ ముసలమ్మతో.

"శత్రుత్వం వస్తుందనే భయంతో సత్యాన్ని చెప్పటానికి జంకుతావా?" అంటూ వెళ్లిపోయింది.

అలగు చౌదరి హృదయంలో "శత్రుత్వం వస్తుందనే భయంతో సత్యాన్ని చెప్పటానికి జంకుతావా?" అనే మాటలే మారు మ్రోగుతున్నాయి.

3

సంధ్యాసమయంలో ఊరిమధ్య చెట్టుక్రింద పంచాయతీ యేర్పాటయింది. ఎవరిని పంచాయతి అధ్యక్షునిగా చేయాలి అనే విషయం చర్చలో కొచ్చింది. జుమ్మన్ శేఖ్ పినతల్లి అలగు చౌదరిని పంచాయతి అధ్యక్షునిగా చేయాలంది. దానికి అయిష్టత చూపించాడు అలగు చౌదరి. తప్పదన్నారు పెద్దలంతా. పంచాయతి అధ్యక్షపదవిని స్నేహితుడే స్వీకరించినందుకు సంతోషపడ్డాడు తనదే గెలుపు అనే ఉద్దేశ్యంతో జుమ్మన్ శేఖ్.

"జుమ్మన్ శేఖ్, నీవు నేను పుట్టినప్పటినుంచి ప్రాణ స్నేహితులం. కాని ఈ సమయంలో నీవు నా స్నేహితుడివి గాదు, శత్రువువీ కాదు. నీవు నీ పినతల్లిగారు గూడా నా దృష్టిలో సమానులు. పంచాయితిలో నీవు చెప్పదలచుకుందేదో చెప్పు" అని అలగు చౌదరి జుమ్మన్‌తో చెప్పాడు అధ్యక్షపదవి స్వీకారానంతరం.

జుమ్మన్ శేఖ్ ఈవిధంగా చెప్ప మొదలిడెను.

"పంచాయతీ పెద్దలార! మా పినతల్లి తన కొంచెం ఆస్తిని నాపేర పెట్టి ఇప్పటికి మూడు సంవత్సరాలైంది. ఆరోజునుంచి ఈరోజువరకు నేను పోషిస్తున్నాను. ఈ రోజువరకు ఆమెకు పీసమెత్తు కష్టం గూడా కలగనీయలేదు. నా స్వంత తల్లిగా చూచుకుంటున్నాను. నేను ఈవిధంగా చూస్తున్నప్పటికి ఆమెకు ప్రతినెల పైఖర్చులకి కొంతడబ్బివ్వమంటుంది. నేను ఏవిధంగా తెచ్చి యివ్వగలను? నేను ఆమెకు డబ్బు ఇవ్వలేదనే ఉద్దేశ్యంతో మమ్మల్ని ప్రతిరోజు తిట్టుతూ, దుమ్మెత్తిపోస్తున్నది. ఈ విషయాన్ని మీరు ధర్మంగా పంచాయతిచేస్తారనే ఉద్దేశ్యంతో పంచాయతి పెట్టించాము" అని ఒక చిన్న ఉపన్యాసం ఇచ్చి కూర్చున్నాడు జుమ్మన్ శేఖ్.

జుమ్మన్ శేఖ్ పినతల్లి గూడా ఆమె కష్టాలను ఆమె చెప్పుకొని ఆమెకూడా కూర్చుంది.

వాదవివాదాలు విన్నాడు అలగు చౌదరి. చివరికి ఈవిధంగా తీర్పు చెప్ప మొదలిడెను.

"న్యాయప్రకారం ముసలమ్మకు నెలవారి ఖర్చు యివ్వవలసిందే! ఇదే మా తుది నిర్ణయం. జుమ్మన్ శేఖ్ నెలవారి ఖర్చు ఇవ్వని పరిస్థితులలో ఆమె ఆస్తి ఆమెకు తిరిగి ఇవ్వవలసియుంటుంది."

ఈ నిర్ణయం వినేటప్పటికి అలగు చౌదరిమీద జుమ్మన్ శేఖ్‌కు అమితమైన కోపమొచ్చెను. కాని పంచాయతికి శత్రువులు గాని, మిత్రులు గాని ఉండరని గ్రహించలేకపోయాడు జుమ్మన్. పంచాయతి నిర్ణయమే భగవంతుని నిర్ణయం! చివరికి పరిణామం ప్రాణమిత్రులు పెద్ద శత్రువులుగా మారిపోయారు.


4

అలగు చౌదరివద్ద మంచి ఎద్దుల జత ఒకటి గలదు. దైవయోగము వలన దానిలో ఒకటి చనిపోయెను. రెండవదానితో సరిపోయే ఎద్దు ఇంకొకటి దొరకలేదు. అందువలన అలగు చౌదరి ఆ ఎద్దును సమజు సాహుకు అప్పుగా అమ్మివేసెను. డబ్బు ఒక నెలలో తీర్చేటట్లుగా ఒప్పందం చేసుకొనిరి. సమజుసాహు వ్యాపారస్థుడు. అతనికి ఒక ఒంటెద్దు బండి గలదు. ఆ బండికొరకే ఈ ఎద్దును కొనెను

సమజుసాహు దానిచేత అధిక పరిశ్రమ చేయించెను. దానికి సరిగ్గా మేత లేదు, నీళ్లు లేవు. అందువలన అది సన్నబడి చిక్కిపోయెను.

ఒకరోజు సాహూజీ ఎప్పటికంటె ఇబ్బడి ఖర్చువేసి, బండిమీద, వ్యాపారం చేయటానికి ప్రక్కపట్టణానికి ప్రయాణమయ్యాడు. అమ్మకం పూర్తి చేసుకొని, ఉప్పు బస్తాలు, కిరసనాయిలు డబ్బాలు క్రొత్తవి కొనుక్కొని తన వూరు బయలుదేరాడు ప్రొద్దు గుంకబోతున్న సమయంలో. ఆ సమ

రు: 5 లకు రేడియో



ఈ రేడియోవిద్యుచ్ఛక్తి,బాటరీ, లేకుండా పనిచేస్తుంది. స్టాకు పరిమితం నేడే వ్రాయండి. రు. 5. పోస్టేజీ అదనం.

AMERICAN TRADING AGENCY
(Radio House) P. B. 75 (A. P. W)
AMRITSAR.

యంలో సాహూజీవద్ద రెండువందల యాభై రూపాయిల రొక్కమున్నది.

అసలే చిక్కిపోయి అలసి సొలసి యుండటంమూలకంగా ఆ రాత్రి సమయంలో నడవలేకపోయింది ఎద్దు. చివరికొకచోట పడిపోయింది. కొరడా తీసుకు కొట్టడం మొదలెట్టాడు సాహూ కారణం తెలుసుకోకుండా. దెబ్బలకు తట్టుకోలేక చచ్చిపోయింది ఆ బక్కచిక్కిన ఎద్దు.

అది నిర్జనప్రదేశం. ఎటుచూచినా గాఢాంధకారం. రెండు మూడు మైళ్లదూరంలో గాని ఏ పల్లెటూరు లేదు. ఆసమయంలో ఏంచేయాలో తోచక బండిమీద కూర్చున్నాడు ఆలోచిస్తూ సాహూ. చేతిలో 250 రూపాయిలు, బండిమీద కిరసనాయిలు డబ్బాలు, ఉప్పు బస్తాలు. దొంగలు వచ్చి దోచుకుపోతేనో? ఈ ప్రశ్నకు ఎంతసేపు ఆలోచించినా సమాధానం దొరకలేదు.

అర్ధరాత్రి సమయంలో ఆగలేక నిద్రాదేవతకు దాసుడయ్యాడు సాహూ. తెల్లవారి చూచుకుంటే తనవద్ద డబ్బు లేదు, బండిమీద కిరసనాయిలు డబ్బాలు, ఉప్పు బస్తాలు కూడా లేవు. ఏకకంఠంతో ఏడవటం మొదలుపెట్టాడు. ఏడిస్తే పోయినవి వస్తాయా!

ఇంటికి చేరాడు ఏదరీ తోచక. చచ్చిన ఎద్దుని, అమ్మిన ఆసామిని తిట్టి, దుమ్మెత్తిపోయటం మొదలెట్టారు సాహూజీ అతని భార్య. ఎద్దు ఖరీదు ఇవ్వమన్నారు. అలగు చౌదరిమూలకంగానే తమ కీకష్టాలు

కుటుంబానికి అనుకూలమైన ప్యాకెట్‌లో నున్న

'అనాసిన్'

కొనండి.



ప్రతి పర్యాయము 32 మాత్రల 'అనాసిన్' ప్యాకెట్ కొనుటవల్ల మీరు 4 అణాలను ఆదా చేసుకొనెదరు. ఈ ప్యాకెట్, ఎల్లప్పుడు చేతిలో సిద్ధంగా 'అనాసిన్'ను ఉంచుకొనగోరు కుటుంబముల కొరకు ప్రత్యేకంగా ఉద్దేశింపబడి నది. ఎందుకంటే ఇది బాధనుండి శీఘ్రవిముక్తికి 4 మందులను కలిగియున్నది.

1. క్వినైన్: అధికశక్తి విచ్చు ఔషధమని మరియు జ్వరనివారణి యని ప్రఖ్యాతి గాంచిన ఔషధసమ్మేళనం. జ్వరాన్ని తగ్గించడంలో సాటిలేనిది.
2. కఫీన్: బలహీనానికి మరియు చిక్కిపోవుటవందుకు తగిన ఔషధమని విరివిగా వాడబడుచున్నది.
3. ఫినాసిన్: తీవ్రమైన బాధా నివారణి మరియు జ్వర నివారణి యని ఖ్యాతి చెందినది.
4. అసిటైల్ సాలిసిలిక్ అసిడ్: ఇది తలనొప్పి, మరియు అలాటి వివిధ బాధలను పోగొట్టుటకు ఉపయోగపడుచున్నది.

'అనాసిన్' లోని యీ నాలుగు మందులు, బాధ, తలనొప్పి, జలుబులు, పన్ను నొప్పి మరియు కండరాల నొప్పులనుండి శీఘ్రంగా సురక్షితమైన మరియు దూరియైన విముక్తిని కలిగించుటకు పరముల ముఖ్య ప్రావముందు తీవ్రమైన మిశ్రమ చర్యను జరుపును.

'అనాసిన్' 2 మాత్రల ప్యాకెట్‌లలో కూడ దొరకును.

ఎల్లప్పుడును **అనాసిన్** బిళ్లలె కావలెననికోరండి

A. 43

★ నిజన్యాయం ★

వచ్చాయని తిట్టారు. పాపం! అలగు చౌదరి దీనికి కారకుడా!

5

పెద్దలు పంచాయతి ఏర్పరిచారు. పంచాయతి అధ్యక్షునిగా ఎవరి నెన్నుకోవాలి అనే ప్రశ్న చర్చలోకొచ్చింది. అలగు చౌదరి శత్రువు జుమ్మన్ శేఖ్ తనపైపే నిర్ణయం చేస్తాడనే ఉద్దేశ్యంతో సాహు జుమ్మన్‌ని పంచాయతి అధ్యక్షునిగా ఎన్నుకున్నాడు.

జుమ్మన్ శేఖ్ అను మాట వినేటప్పటికి వణికిపోయాడు అలగు చౌదరి. తనకు ఓటమి తప్ప దనుకున్నాడు.

పంచాయతి అధ్యక్షుని ఆసనాన్ని ఆక్రమించాడు జుమ్మన్ శేఖ్. ఆ ఆసనంలో కూర్చున్నప్పటినుంచి జుమ్మన్‌కు అలగు, సాహులు సమానమనిపించింది. ఆసమయంలో ఒకరు మిత్రులు, ఒకరు శత్రువులు కాదనుకున్నాడు. ఆ ఆసనంయొక్క మహాత్యం అదే!

వాదవివాదాలఅనంతరం జుమ్మన్ ఈవిధంగా తీర్పు ఇచ్చాడు. "సమజు సాహు అలగు చౌదరికి ఎద్దు వెల పూర్తిగా యివ్వాలి. ఇది మా తుది నిర్ణయం. మరియు ఇది మేము దీర్ఘంగా ఆలోచించి నిర్ణయించిన తీర్పు. కారణం అడుగవచ్చు మీరు. సాహు ఎద్దును కొనేటప్పటికి ఎద్దుకు ఏవిధమైన జబ్బు లేదు. ఉన్నప్పటికి అప్పుడే గనుక డబ్బు యిచ్చినట్లైతే ఈరోజు తిరిగి యిమ్మని అడిగే వాడేనా? అందువలన సాహుజీ ఎద్దు వెల ఇవ్వటం సమంజసం."

ఈ తీర్పు వినేటప్పటికి అలగు చౌదరి ఆనందం అంచులు దాటింది. పంచాయతి అనంతరం జుమ్మన్ శేఖ్ అలగుచౌదరివద్దకు వెళ్ళి, తనతప్పు తెలుసుకొని, ఇన్నాళ్లు శత్రుత్వం వహించినందుకు క్షమాపణ వేడుకున్నాడు. మళ్ళా పాత మిత్రులు శత్రుత్వాన్ని వదలి నూతన మిత్రత్వాన్ని స్వీకరించారు. ★

★ సమస్యల తోరణం ★

గతవారం సమస్యకు జవాబు

10 కవర్లలోనూ 1000 రూపాయి నోట్లూ సర్దాలి.

1 నుంచి 1000 వరకూ ఎన్ని అడిగినా కవర్లు మాత్రమే యివ్వగలగాలి. ఇటువంటి సమస్యను సాధించడానికి ఏది మార్గం?

ఒక మార్గంలేదు కాబట్టి, ఇది స్కూల్లో చెప్పే లెక్కలాంటిది కాదు కాబట్టి, సకారణంగా ఆలోచించడం నేర్చుకుంటే ఇందులోని సూక్ష్మతా, సులువూ తెలుస్తాయి. 1 రూపాయి అడిగితే యివ్వాలిగదా! అందుకని ఒక కవర్లో ఒకరూపాయి ఉంచి తీరాలి. అలాగే రెండో కవర్లో రెండు రూపాయిలు ఉంచాలి. ఒక కవర్లో ఒక రూపాయీ, మరో కవర్లో రెండు రూపాయిలూ ఉంచితే మూడో కవర్లో మూడురూపాయిలు ఉంచాలా? అక్కర్లేదు. మూడురూపాయిలు అడుగుతే మొదటి రెండు కవర్లూ యిచ్చెయ్యొచ్చు. అందుచేత మూడో కవర్లో 4 రూపాయిలు ఉంచితే 7 రూపాయిలవరకూ కలిపి యివ్వవచ్చు. నాలుగో కవర్లో 8 రూపాయిలు ఉంచాలి. అలా అనవసరమైనవి మినహాయించుకుంటూ పోతే ఆన్సరు సులువుగా వచ్చేస్తుంది. ఆ ఆన్సరు యిది.

1, 2, 4, 8, 16, 32, 64, 128 256, 489.

మీకెన్ని రూపాయిలు కావాలి? కవర్లు సిద్ధంగా ఉన్నాయి. కావలసిన మొత్తం తీసుకోండి ★

శ్రీ కాఫ్
దగ్గు, ఉబ్బసములకు
దివ్యౌషధము
శ్రీవత్స కెమికల్స్ & డ్రగ్స్
లిమిటెడ్, మద్రాసు-30



అన్ని రకాల బలహీనతలకు, ఆకలి లేమికి, నరాల బలహీనత, ఆయాసములకు పనికివచ్చే "జర్మన్ టానిక్"

తీర్పు

మందరపు పద్మ, లలిత


పురందరపురంలో ధనదత్తు డనే వైశ్యు డున్నాడు. మేరు పర్వతాలను వెక్కిరించే ధాన్యరాసులతో, కామధేనువులను మించే వేల సంఖ్యల గోవులతో, పుట్లకు పుట్లు పండే భూములతో, గుట్టలు గుట్టలుగా పడివుండే ధనరాసులతో అతడు సాక్షాత్తు లక్ష్మీపుత్రు డనిపించుకున్నాడు. బంగారానికి వాసన అబ్బినట్లే సంపదకు తోడు, అతనికి సంతాన సంపదకూ ఏ లోటూ లేదు. అతనికి రత్నాల్లాంటి చక్కని నలుగురు కొడుకులున్నారు.

కొన్ని యేళ్ళ కతడు బాగా ముసలివాడైపోయాడు. అతని కొడుకులు యౌవనంలో అడుగుపెట్టారు. ముసలితనానికి తోడు, అతని కేదో దీర్ఘవ్యాధి పట్టుకున్నది. వైద్యులంతా చూచి పెదవి విరిచారు. ఒకనా డతనికి జబ్బు మరీ యెక్కువయింది. తనకు మరణసమయ మాసన్నమయిందని తెలుసుకుని ధనదత్తుడు, నలుగురు కొడుకులను దగ్గరగా పిలిచి "నాయనలారా! నా కాలం అయిపోయింది. నేను వెళ్ళిపోతున్నాను. మీలో మీరు తగువులాడుకోకుండా, కలిసి మెలిసి జీవించండి. వరుసగా నా మంచంకోళ్ళ క్రింద పాతిపెట్టిన పాళ్లుగా మీరు నాఆస్తినిపంచుకొనండి"—అని చెప్పి హాయిగా కన్నుమూశాడు.

తండ్రి పోయిన తర్వాత కొడుకులు అతనికి తమ కులధర్మాను సారంగా కర్మకాండలు జరిపేరు. ఆ విచారంలోనుండి కోలుకున్న కొన్ని రోజులకు, ఒక శుభ ముహూర్తాన, మంచంకోళ్ల కింద త్రవ్వి చూశారు. చూడగా, వాటి క్రింద వరుసగా చిట్టు, మన్ను, బొగ్గులు, ఎముకలు కనపడ్డాయి. ఆత్రంగా ఆస్తిని పంచుకొందామనుకొన్నవారి కీ తుచ్ఛ వస్తువులు కంటపడడంతోటే మనస్సులలో కెలికినట్లయింది. వీటిని పంచుకోమనడంలో ఆయన ఆంతర్య మేమిటి? చనిపోయేముందు ఆయనకు గాని మతి చలించలేదుగదా! ఇలా పరిపరివిధాల ఆలోచించుకుని, చివరకు తండ్రిభావం తమకు సరిగా బోధపడలేదనే నిశ్చయానికి వచ్చారు. ఆ రహస్యాన్ని విప్పి చెప్పమని దేశదేశాల రాజుల దగ్గరకు వెళ్ళి ప్రాధేయపడ్డారు.

ఏ రాజుకు చిక్కు విడదీసే సామర్థ్యం లేకపోగా, పైపెచ్చు "మీ తండ్రి ఆజ్ఞానుసారం ఒకరు చిట్టు, ఒకరు బొగ్గులు, ఒకరు మట్టి, ఒకరు ఎముకలు తీసుకోండి—" అంటూ అవహేళన చేయడం మొదలుపెట్టేరు. చివరికి వారు ప్రాణం విసిగి ప్రతిష్ఠాన నగరం చేరుకున్నారు. ఆ పూరి రాజైన శాలివాహనునితో తమ తగవును పరిష్కరించమని మనవిచేసుకున్నారు. రాజు పకపక నవ్వి "ఎవ్వరూ యీ మాత్రపు చిక్కును విప్పి చెప్పలేకపోయారటయ్యా! మీతండ్రి మీకు భాగాలను సరిగానే పంచిపెట్టేడు. మట్టి అంటే—తాను సంపాదించిన భూములు. ఊక అంటే ధాన్యం. బొగ్గు—అంటే బంగారం. ఎముకలంటే పశువులు. వీటిని వరుసగా మీలో పెద్దవాడు భూములను, రెండోవాడు ధాన్యాన్ని, మూడోవాడు బంగారాన్ని, నాల్గోవాడు పశువులను తీసుకోవాలని అతడి భావన" అని విప్పి చెప్పేడు. సోదరులంతా రాజుగారి తెలివి కాశ్చర్యపడి, తమ తండ్రి ఆదేశానుసారం ఆస్తి పంచుకొని, హాయిగా కాలం వెళ్ళబుచ్చసాగారు. ★







3. చిత్తం! అలాగే!

హాబ్సన్ ఉత్తరం చేరడానికి వెనకటి నిమిషందాకా నేనా తిమింగిలాన్ని పట్టుకోడానికి వెడతానని కలలో గూడా అనుకోలేదు! కాని హాబ్సన్ ఉత్తరం చదువుతూనే నేనా విషయంలో ఒక నిశ్చయానికి వచ్చేశాను. నా జీవితంలో ఇక తిమింగిల సంహారం ఒకటే పరమాదర్శమనీ ప్రపంచానికిక తిమింగిల పీడ తొలగించివెయ్యాలనీ నిశ్చయించాను.

అనువాదం:

"వినాయక"

జరిగిన కథ:—

అది 1866 వ సంవత్సరం ప్రారంభం. సాగర గర్భంలో బ్రహ్మాండమైన జలజంతువేదో కనిపించిందనే వార్త ప్రపంచప్రజలను భ్రాంతులను చేసింది. సముద్రంలో ప్రయాణంచేసే నౌకలకది ఇట్టే కనిపించి ఇట్టే మాయమయ్యేది. ఒక రోజు ఒకచోట కనిపించి, మరొక రోజు కొన్ని వేల మైళ్ళ దూరంలో ప్రత్యక్షమయ్యేది. కొన్ని నౌకలకు దానివలన చిన్న చిన్న ప్రమాదాలు సంభవించాయి. కొందరది ఏదో గొప్ప జలచరమై ఉండాలనీ, కొందరు అది మునిగిపోయిన కొండ పుట్ట కావచ్చుననీ, కొందరది పెద్ద జలాంతర్గామి అయిఉంటుందనీ రకరకాలుగా వాదించసాగారు. ఏమైనా దానివలన నాగరిక ప్రపంచానికి, ముఖ్యంగా నౌకాప్రయాణాలకి ప్రమాదం సంభవించవచ్చునని అందరూ అభిప్రాయపడ్డారు. దాని అంతు కనుక్కొని కూలనార్చాలని ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. అమెరికా ప్రభుత్వం అబ్రహాం లింకన్ అనే యుద్ధనౌకను తయారుచేసి ఆ జలజంతువును వేటాడడానికి నియమించారు.

కాని నా ప్రయాణపుబడలిక ఇంకా తీరలేదు! నేను చెమటోడ్చి సంపాదించిన అద్భుత వస్తువుల మధ్యన కొంతకాలం పాటు హాయిగా విశ్రమించాలని అనుకున్నాను. కాని అమెరికా ప్రభుత్వందగ్గిరనించి ఉత్తరం వచ్చేసరికి నా బడలిక, సేకరించిన అత్యద్భుత వస్తువులు మొదలైనవన్నీ ఒక్కుమ్మారుగా మరిచిపోయి వెంటనే ప్రయాణానికి మూట కట్టెయ్యాలని నిశ్చయించాను.

నేనింకొక విషయం కూడా ఆలోచించాను. ఓడలో ఎటు ప్రయాణం చేసినా ఐరోపా తగలక తప్పదు. ఆ తిమింగిలం నన్ను మళ్లీ మెల్లిమెల్లిగా ఫ్రాన్సు తీరానికి లాక్కుపోయినా, అంతగా ఆశ్చర్యపడనక్కర లేదు. ఆజంతువు ఐరోపా తీరంలో దొరికినా దొరకవచ్చును. అదృష్టంకొద్దీ అదే జరిగితే అథవా పటం దాని తాలూకు అర గజం



ఉగాది ముస్తాబు
ఫొటో: శ్రీపాద వెంకన్న—కడప.

దొడుకు కోర అయినా ఫ్రాన్సు మ్యూజియం అధికారులకు బహూకరించే అదృష్టం పట్టవచ్చును.

కాని ఆ తిమింగిలం ఇటీవల ఉత్తర పసిఫిక్ మహాసముద్రంలో తిరుగుతూన్నట్టు తాజా వార్తలు చేరాయి. మా యుద్ధ నౌక ఆవైపే ప్రయాణం చేయబోతూంది.

తరవాత నేను “కాన్సల్! కాన్సల్!” అని గట్టిగా పిలిచాను.

ఇతడు నా పరిచారకుడు. చాలా నమ్మకమైనవాడు. నే నెక్కడికి వెళ్ళినా తోడునీడలా ఉంటాడు. హాలండు దేశస్థుడు. కాన్సల్ నా పక్కనుంటే నాకు ప్రపంచంఅంతా జయించివార వెయ్యగలనన్నే భరవసా కలుగుతుంది. ఇతగాడు దేనికీ చలించడు. ఏది తలపెట్టినా ఎంతో ఉత్సాహంగా పనిచేస్తాడు. ఎలాంటి పని చెప్పినా అది నాకు తెలియదనడు. నిజాని కతనికి తెలియని పని అంటూ ఏదీ లేనే లేదు. పేరునుబట్టి అడగనిదే సలహాలిచ్చే బాపతేమో అనిపించవచ్చును గాని, సలహా కావాలని అడిగినా ఒకపట్టాన సలహా ఇవ్వనే ఇవ్వడు.

ఇతనికి ప్రకృతిశాస్త్రపరిశోధకులతో బాగా జోస్తీ. అందుచేత ఆ శాస్త్రపరిశోధనకు సంబంధించిన విషయాలెన్నో ఇతనికి తెలుసును. ఆయా వస్తువులు వేర్వేరు వర్గాలుగా విభజించగలడు. అంతే గాని అంతకన్నా లోతుగా వెళ్ళలేడు. కొన్ని కొన్ని జలజంతువుల ప్రత్యేకలక్షణాలు ఇతని కంత బాగా తెలియవు. కాని స్థైర్యసాహసాలలో మాత్రం అతని కతడే సాటి!

గత పది సంవత్సరాలనించి నే నే విజ్ఞానయాత్రకు బయలుదేరినా ఇతడు నాతో కూడా వచ్చేవాడు. ఎంత దూర ప్రయాణమైనా సరే! ఇతని కెక్కడా విసుగు, అలసట అనేవి లేవు. పిడిరాయిలాంటి మనిషి. ఉక్కు కండలు. అయితే స్థైర్యం తక్కువ. ఎప్పుడూ తలనెప్పి వచ్చినట్టైనా కనబడదు. వయస్సు 30 సంవత్సరాలు. నాకు అతనికీ

బాలగేయం:

మర్యాద రామన్న తీర్పు

ఉత్పల సత్యనారాయణాచార్య

తొల్లి ఒక్క గ్రామమందు
దూదేకుల సాహేబులు
నలుగురుండి వర్తకమును
కలిసి చేయుచుండగా—

ఇఱకాటపుటింటిలోన
ఎలుకల చెలగాటమాయె
దూదిమూటలన్ని కొట్టి
దుమ్ముదారు చేయుచుండె.

ఎలుక బాధ పడజాలక
నలుగురును వంతు కలిసి
పిల్లి నొకటి పెంచుచుండి
రల్లారు ముద్దుగాను.

దాని కాళ్ళ నొక్కొక్కరు
తమ వంతుకు తగినట్లుగ
బంగారపు గొలుసులతో
సింగారం బొనరించిరి.

పిల్లి నెంతో ప్రేమతోడ
పెంచుచుండ నొక్కనాడు
కఱ్ఱ దెబ్బ తగిలి దాని
కాలొక్కటి విరిగిపోయె.

ఆ కాలి వంతు వాడు
ఆముదపుగుడ్డ చుట్టి
వేగముగ బాగుపడగ
వేయుచుండె మందు మాకు.

ఒక రేయి కుంటిపిల్లి
చకచక పరుగెత్తుచుండ
దాపునున్న ప్రమిదలోని
దీపశిఖకు అంటుకొనెను.

ఆ వేడికి తాళలేక
అటు నిటును పరుగులెత్తి
దూదిమూట లున్న వైపు
దూకినదా కుంటి పిల్లి.

దూదంతయు నొక్కుమ్మడి
తోడ్తోడన దగ్ధమయ్యె,
నలుగురు భాగస్థులకును
నాల్గు వేలు నష్టమయ్యె.

మొదటివానివల్ల ఇంత
ముప్పు వచ్చెనంచు కసలి
న్యాయసభకు ముప్పు రపుడు
పోయి చెప్పుకొనిరి తగవు.

ప్రాడ్వివాక చూడామణి
ప్రాజ్ఞలోక శిరోమణి
చోళరాజ ధర్మాసన
శోభితాంధ్ర మంత్రిమణి

మర్యాదా రామన్నను
మహనీయుం డా. తగవరి
దైవఘటన కా ముప్పురు
తగవులాడుచుండి రనుచు

ధర్మసూక్ష్మ మెఱిగి తాను
తగినట్లుగ బుద్ధి చెప్ప
మర్యాదా రామన్న
ఫిర్యాదుల కిట్టులనెను.

"తప్పంతయు మీ ముగ్గురి
దై యున్నది సాహెబులు!
విరగియున్న కాలితోడ
పరుగులెత్త లేదు పిల్లి.

కుంటిపిల్లి పరుగులెత్త
ఇంటదూది తగులబడగ
మీ ముగ్గురివంతు కాళ్లె
ఈ ముప్పును తెచ్చిపెట్టె

కావున ఈ ముద్దాయికి
రావలసిన పరిహారము
ఫిర్యాదులె వేగ ఇచ్చి
మర్యాదగ పంపవలయు"

మర్యాదా రామన్న
మన తెలుగు మంత్రిమణి
ఈ తీరుగ తీర్పు చెప్పి
ఖ్యాతి బడసె దశదిశల.

★ సాగరగర్భంలో సాహసయాత్ర ★

పది సంవత్సరాలు తేడా. అంటే నాకు నలభై సంవత్సరాలన్న మాట.

ఇతనిదగ్గర ఉన్నది ఒక్కటే ఒక్క లోటు. ఎప్పుడూ నాతో ఎవరో పెద్ద అధికారితో మాట్లాడినట్లే మాట్లాడతాడు. ఆ ధోరణి చూస్తేమాత్రం నాకు చిరాకు తల కెత్తుతుంది.

నేను గబగబా సామాను సర్దుతూ గట్టిగా కౌన్సిల్‌ని పిలిచాను. నేనెక్కడికి వెళ్లినా కౌన్సిల్ నాతో వస్తాడని నాకు తెలియక పోతేను. కూడా రావడానికి వీలు

పడుతుందా అని సామాన్యంగా నేనెప్పుడు అతనిని అడగను. కాని ఈ యాత్ర ధోరణే వేరు. మేమేదో ఒక పెద్ద తిమింగిలాన్ని పట్టుకోవాలని వెడుతున్నాము. మా యుద్ధ నౌక కూడా దాని తాకిడికి తట్టుకోలేనంత పెద్ద జంతువది. ఎంత ధైర్యసాహసాలున్న మనిషైనా ఈ ప్రయాణం విషయంలో కొంచెం తటపటాయించక తప్పదు. ఇంతకీ కౌన్సెల్ ఏమంటాడో'నని మళ్ళీ అతణ్ణి పిలిచాను. వెంటనే అతడు నా ఎదట నిలబడ్డాడు.

వస్తూనే "పిలిచారా బాబూ!" అని అడిగాడు.

"అవును! రెండు గంటల్లో మన ప్రయాణానికన్నీ సిద్ధం చెయ్యాలి." తెలిసిందా?

"చిత్తం! అలాగే!" అన్నాడు కౌన్సెల్ ఏమీ తొణకకుండా.

"ఒక్క నిమిషం కూడా ఆలస్యం చెయ్యడానికి వీలు లేదు! నా ప్రయాణపు సరంజామా అంతా వెంటనే సిద్ధం చేసిపెట్టాలి. వీలైనన్ని కోటులు, షర్టులు, స్టాకింగులు సర్దాలి. ఇంకా అలాగ నిలబడతావేం! త్వరగా సిద్ధం చెయ్యాలి! వెళ్లు!"

"మరి మీరు సేకరించిన వస్తువుల మాట?!"

"వాటి సంగతి తరవాత ఆలోచిద్దాంలే!"

"మరి మీరు జాగ్రత్తచేసిన ఆ జలజంతువులచర్మాల మాటేమిటి?"

"అవి ఇక్కడ హోటల్లోనే అట్టే పెట్టేదాం."

"అయితే ఆ బతికి ఉన్న జంతువుల మాటేమిటి?"

"వాటి సంరక్షణకు తగిన ఏర్పాట్లు చేయించాను. అయితే వాటిల్లో చాలావాటిని ఫ్రాన్సు పంపించే ఏర్పాటు చేదాం."

"మరి మనం తిరిగి పారిస్ వెళ్ళడం లేదన్న మాట!" అన్నాడు కౌన్సెల్.

"అబ్బే! వెళ్ళకపోవడమేమిటి? పారిసే వెడుతున్నామనుకో! అయితే చాలా చుట్టుదారి." అన్నాను అతని ప్రశ్నకు సూటిగా సమాధానం చెప్పకుండా.

"మీ ఇష్టం! ఏ చుట్టుదారిలో వెళ్ళినా సరే!"

"అదేమీ సరాసరి దారికానే కాదులే! మనం 'అబ్రహాంలింకన్'లో లో వెళుతున్నాం."

"ఓహో! అలాగా!"

"ఆ తిమింగిలం గొడవ విన్నావు కదా! ఇప్పుడు దాని అంతేమిటో కనుక్కుని హతమార్చి వెయ్యడానికే బయలు దేరుతున్నాం.! ఇది ఒక బ్రహ్మాండమయిన సాహసయాత్ర. అయితే దీనిలో అడుగడుగునా ఆపదలే. ఇంతకీ మనం ఎటు వెడుతున్నామో కూడా తెలియదు! ఆ తిమింగిలం ఏ సమయంలో ఎక్కడ ప్రత్యక్షం అవుతుందో ఎవ్వరికీ తెలియదు! కాని ఏమైనా సరే! మన ప్రయాణం మాత్రం తప్పదు. మన కెప్టెన్ చాలా గట్టివాడు. వెయ్యి కళ్ళతో మన యాత్ర వ్యవహారాలన్నీ జాగ్రత్తగా కనిపెట్టిచూస్తూంటాడు."

"మీ కెలాగంటే అలాగే! మీతో నేనూ వస్తాను."

"అయితే కొంచెం జాగ్రత్తగా ఆలోచించుకో. నీదగ్గిర నేనేమీ దాచడం లేదు. తెలిసిందా! ఇది చాలా గొప్ప సాహస యాత్ర. ఇలాంటి యాత్రలకు బయలుదేరితే ఒక్కొక్కప్పుడు మళ్ళీ తిరిగి రావడం కూడా జరగదు!"

"ఓహో! అలాగా!"

అటుపిమ్మట ఒక అరగంటలో మా సామానులన్నీ సర్ది వెయ్యడం జరిగిపోయింది. కౌన్సెల్ పక్షుల్నీ జంతువుల్నీ వేర్వేరుగా విభజించి పెట్టి నా షర్టులు, కోటులు క్షణంలో వేరువేరుగా ట్రంకుపెట్టెలలో సర్దాడు.

లిఫ్టులో ఎక్కి మా సామానులతో సహా మేమిద్దరము హోటలు గుమ్మందగ్గిరికి వచ్చాము. హోటలుకు చెల్లించవలిసిన బిల్లులన్నీ చెల్లించాము. జంతువుల విషయంలో చెయ్యవలిసిన ఏర్పాటు

అందానికి అవసరం

EYETEX (Kajjal)

ఐటెక్సు (కజ్జాల్)

కాంతిగల కళ్లకు నల్ల కాటుక
మీ కళ్లకు చలువనిచ్చి,
ముఖానికి అందాన్నిస్తుంది.

ARAVIND BINDI

"అరవింద్ బిందీ" కుంకుమ (తిలక్)
చాందు వాడండి. ఆరు ఆకర్షణీయ
మైన రంగులలో ఉన్నవి.



Manufactured & Distributed By
ARAVIND LABORATORIES
ARCOT ROAD MADRAS 26

★ సాగరగర్భంలో సాహస యాత్ర ★

లన్నీ చేసేశాము. ఇద్దరంకలిసి ఒక బగ్గీ ఎక్కాము.

మా సామానంతా ఓడలోకి వెళ్లిపోయింది. మేము కూడా ఓడ ఎక్కాము. వెంటనే నేను కెప్టెన్ ఫరాగూ ఎక్కడ ఉన్నాడని అడిగాను. ఒక నావికుడు నన్నతనిదగ్గరికి తీసుకువెళ్లాడు. అతడు నన్ను చూస్తూనే కరచాలనం చేసి ఎంతో ఆప్యాయంగా గౌరవించాడు. కెప్టెన్ చాలా కులాసా మనిషి.

“ప్రొఫెసర్ అరోనా అంటే మీరేనా?” అన్నాడు కెప్టెన్.

“అవును! కెప్టెన్ ఫరాగూ అంటే తమరేకదూ?”

“అవును! నేనే! మీ కోసం ప్రత్యేకించిన గది సిద్ధంగా ఉంది.”

నేనతనికి నమస్కరించి వెంటనే నాకోసం ప్రత్యేకించిన గదిలోకి వెళ్లిపోయాను.

‘అబ్రహామ్ లింకన్’ అన్నివిధాలా మా విజ్ఞానయాత్రకు తగిన ఓడ. చాలా వేగంతో పోగల యుద్ధనౌక. బాగా జోరుగా పోవడానికి కావలసిన అన్ని సౌకర్యాలు ఏర్పాటుచేశారు. ఆ సౌకర్యాల మూలంగా అది గంటకు సుమారుగా 18 మైళ్లవరకూ పోగలదు. అయితే ఒక పెద్ద తిమింగిలాన్ని వెంటాడించడానికిమాత్రం ఆ వేగం చాలదు.

నా గదిలో చేసిన ఏర్పాటులన్నీ చాలా బాగున్నాయి.

“ఇక్కడ మనకు చాలా సౌకర్యంగా ఉంది” అన్నాను కౌన్సెల్‌తో.

“అవునవును. చాలాసౌకర్యంగా ఉంది.”

కౌన్సెల్ మా సామానులన్నీ జాగ్రత్తగా సర్దుతున్నాడు. నేను మెల్లిగా టాపుమీదికెక్కి ఓడ కదలడానికి చేసే ప్రయత్నాలన్నీ గమనిస్తున్నాను. కెప్టెన్ ఫరాగూ ఓడ కదలడానికప్పుడే ఉత్తరువు జారీ చేశాడు. నేను కనక ఒక అరగంట సేపు ఆలస్యంచేసిఉంటే ఓడ నేను లేకుండానే బయలుదేరిపోయేదే! దానితో నేనీ అత్యద్భుతయాత్రలో పాల్గొనే అవకాశం కాస్తా చెయ్యి జారిపోయేదే! ఇక ఈపైన జరిగినవన్నీ ఉన్నవి ఉన్నట్లుగా రాసినా నమ్మడం కష్టమే! అవి అంతటి అత్యద్భుత విషయాలు.

—ఎలాగైనా ఆ తిమింగిలాన్ని పట్టి తీరాలనీ ఇక ఒక్క నిమిషమైనా ఆలస్యం చెయ్యకూడదనీ కెప్టెన్ నిశ్చయించాడు. అటుపిమ్మట అతడు ఓడఇంజనీరును పిలిపించి—

“ఆవిరి బాగా జోరుగా ఎక్కిందా?” అని అడిగాడు.

ఔనన్నాడు ఇంజనీరు.

“అయితే ఓడ జోరుగా పోనీ!” అన్నాడు కెప్టెన్.

అటుపిమ్మట అబ్రహామ్ లింకన్ మాంచి హుందాగా ప్రయాణం సాగించింది. న్యూయార్క్ నగర పౌరులు ఆ యుద్ధనౌక అలాగ కదిలి పోతూంటే రెప్పవాల్చకుండా దానికేసి చూశారు. వేలకొలది జనం జేబురుమాళ్లెగరవేస్తూ జయజయ ధ్వానాలు చేశారు.

—ఇంకావుంది.

అధైర్య పడవద్దు

శాస్త్రీయమైన, నిజమైన SEX—ADVICE పొందవచ్చును. మీరు ఉంచుకొన్న లక్షణములు వ్రాయుమూ, యింకా వివరాలకు కవరు పంపేది.

డాక్టరు రత్నంసన్స్,(Estd 1904) మలకపేట బిల్డింగ్సు-హైద్రాబాద్-2. (దక్కన్)

సమస్యాపూరణం

(12-వ పేజీ తరువాయి)

గృహంలో ప్రవేశిస్తున్న భర్త ముఖ భంగిమ గమనించేసరికి లీలాదేవి కెంతో భయం వేసింది. మెల్లమెల్లిగా పరిచారికచేతనున్న తాంబూల కరండకం చేత ధరించి ఒయ్యారపు నడకలతో మెల్లిది మెల్లిదిగా శయ్యా గృహ ద్వారం చేరుకొన్నది.

మహారాజు శయ్యాగృహంలో ఒక సింహాసనం మీద కూర్చుని తీవ్రంగా ఏదో ఆలోచిస్తున్నాడు. అతని ముఖంలో కత్తివాటు వేసినా నెత్తురుచుక్క లేదు! ఆమె కేమీ పాలుపోలేదు! కరండకంలోనించి ఒక కర్పూరతాంబూలపు చిలక అందీయబోయింది. అతడది స్వీకరించలేదు. పైగా దురుసుగా ఆమె చెయ్యి తోసివేశాడు. ఆ తాకిడికి తాంబూల కరండకం నేలమీద పడిపోయింది. ఆమె జీవితంలో అంతటి అవమానం పొందడానికదే ప్రారంభం! అయినా ఆమె పైపైకేమీ నొచ్చుకోనట్టే నటించి ఒక్క చిరునవ్వునవ్వి “ఇదేమిటీవేళ ఇలాగున్నారు?” అని ఎంతో ఆప్యాయంగా ప్రశ్నించింది. ఆ పైన ఇంకా అతనికి దగ్గరగా వెళ్లింది. భోజుని కామె అనునయం అంతా ఒక కపటనాటకంగా స్ఫురించింది. ఆమె స్పర్శ అగ్నికీలగా సోకింది! ఆమెను చేతికొద్దీ దూరంగా తోసివేశాడు. అతడంత మోటుగా తోసి ఉండకపోవచ్చును. కాని అతి సుకుమారమైన ఆమె శరీరం ఆ అవమానానికీ, ఆ అఘాతానికీ నిలబడలేక శయ్యాగృహ ద్వారం ఇవతల పడిపోయింది. వెంటనే ఆమె స్పృహ తప్పిపోయింది.

[సశేషం]

స్థాపితము: 1920 సం॥రం.

సమస్త చర్మవ్యాధులకు, తెలుపు మచ్చలు వగైరాలకు చికిత్సా నిపుణులు.

కేటలాగు, సలహా ఉచితము.

రెడ్డి & కో, (రిజిష్టర్డు)

గోపాలపురం, తూర్పుగోదావరి జిల్లా (వయా) తణుకు.

★ టైగర్ ★

(24-వ పేజీ తరువాయి)

విసిరి దూరంగా తరిమివేయవలసివస్తోంది. అది ఎక్కడ ఎదురుపడుతుందో అనే భయంతో ఊళ్లోకి వెళ్ళడంకూడా తగ్గించుకోవలసివచ్చింది.

తరువాత కొన్నాళ్ళకి నేను రాజమండ్రీ వెళ్ళవలసివచ్చింది. అక్కడ మా స్నేహితుడొకడిదగ్గర కొన్ని సీమకుక్కపిల్లలుంటే ఒకటి నాకూడా తెచ్చాను. ఎర్రమూతితో, జాలికళ్ళతో, వాలవేసిన చెవులతో మల్లెపూవులా తెల్లగాఉండే కుక్కపిల్ల అది. దానికి 'రాణి' అని పేరుపెట్టాం. అది. వచ్చిందే తడవుగా ఇంట్లో అందరిదగ్గరికీ వరుసగా పరిచయంచేసేసుకుంది. టైగరు ఎన్నడూ ఇంట్లో అడుగుపెట్టి ఎరగదు. మనిషిమీదికి కాళ్లుఎత్తేదికాదు. కాని రాణీ ఇల్లంతా స్వేచ్ఛగా తిరుగుతుంది. కుర్చీలమీదకాని కిందపడుకోదు. పరుపులమీదికి కూడావచ్చి పక్కనే పడుకుంటుంది. మనుషులమీది కెగురుతుంది. వెనక కాళ్ళమీద నిలబడి ముందుకాళ్లు ఊపుతూ ఎత్తుకోమని సైగచేస్తుంది. ఎత్తుకోగానే మూతిలోమూతి పెట్టి ముద్దుపెట్టించుకుంటుంది. ప్రతివారూ దానిని ఒకసారైనా ముద్దుపెట్టుకుంటేకాని ఊరుకోదు. దానికి అనేక కళాకళలు. ఒకసారి పాలుపోస్తే అన్నం ముట్టదు. మరొకసారి పాలుపోస్తేకాని ముట్టదు. నిజంగా రాణీకి తెలుసు రాజ్యమేలడం. అది తెలివైనదికూడా. వీధిలోకివచ్చిన పెద్దమనుషులమీద భౌంయ్‌మనదు. దగ్గరికివెళ్ళి వాసన చూస్తుంది. దానికి వచ్చినవాళ్లైతే ఎత్తుకోమంటుంది. నచ్చకపోతే వెనక్కి తిరిగివస్తుంది. బిచ్చగాళ్ళనిమాత్రం దగ్గరికి రానీయదు. ఎవరేనా కర్రఊపి బెదరించడానికి ప్రయత్నించాడో అది మరింత గొంతుకతో అరుస్తుంది. 'దానిచేష్టలుచూసి అన్నయ్యకూడా దానిని ఒళ్లోకూర్చోబెట్టుకుని కబుర్లుచెపుతున్నాడు. ఊళ్లోవాళ్లుకూడా దానినిచూసి ముచ్చటపడిపోతారు. ఆఖరికి శంకరంగారు కూడా దూరంనుంచే దానిని మెచ్చుకుంటున్నారు.

రాణీ వచ్చిన నాలుగురోజులకు అది అరుస్తూఉండడంచూసి వీధిలోకి వెళ్ళాను. వీధో పెద్దకుక్క రాణీని కరవబోతోంది. కాని రాణీ ధైర్యంగా నిలబడి ఎదిరిస్తోంది. నేను దగ్గరికి పరుగెత్తివెళ్ళి రాణీని చేతుల్లోకి ఎత్తుకున్నాను. పెద్దకుక్కకేసి చూశాను. అది టైగరు. చేతుల్లో రాణీ అరుస్తూనేఉంది. టైగరు నన్నుచూసి తోక ఆడించసాగింది. అది రాణీని కరవబోయిందనే కోపంతో నేను కర్రతీసుకొని దానిని దూరంగా తరిమికొట్టాను. అది మళ్ళీ మా యింటిదగ్గరికి రాలేదు గోపీ వాళ్లూ తిరిగి వచ్చినరోజునతప్ప.

గోపీవాళ్లూ బండిలో వస్తూఉండడం చూసిందికాబోలు బండివెనకాలే మాయింటికివచ్చింది టైగరు. గోపీవాళ్లూ బండి దిగగానే రాణీ వీధిలోకి పరుగెత్తుకువచ్చింది. "గోపీ నీకోసం ఈ కుక్కపిల్లను తీసుకువచ్చానురా, రాణీ అని పిలు, వస్తుంది." అన్నాను వాడితో. 'రాణీ' అని పిలిచాడు. అది తోకఆడిస్తూ వాడిదగ్గరికి వెళ్ళింది. గోపీ సంతోషంతో ఎత్తుకున్నాడు. రాణీ వాడిని ముద్దుపెట్టుకుంది. వాడు కిలకిలమన్నాడు. ఇంతలో వెనకాల ఏడుపుశబ్దం విని వెనక్కి తిరిగాడు. "ఛీ ఛీ యిదేం కుక్క! పుచ్చు కుక్క. దానిని తరిమి వెయ్యి నాన్నా" అన్నాడు గోపీ. "అది టైగరురా" అని చెప్పాను. "ఛా చాలా అసయ్యంగాఉంది. కొట్టేయి నాన్నా" అని గోపీ రాణీని ఎత్తుకొని లోపలికి పరుగెత్తాడు. అన్నయ్య పిల్లలు వచ్చి టైగరును నిర్దాక్షిణ్యంగా తోలివేశారు. అది మళ్ళీ మా యింటి దాపులికి రాలేదు.

ఒకరోజున ఎవరో పరుగెత్తుకువచ్చి చెప్పారు. "ఏమండోయ్ మీ టైగరు బండిక్రింద పడిపోయిందండోయ్" అని. నేను వెళ్ళాను. రెండెడ్లబండి చక్రం దానిమీదుగా పోయిందట. ఇంకా చచ్చిపోలేదు. ప్రాణంకోసం ఆఖరి పెనుగులాటలో ఉంది. నేను వెళ్ళిన కొంచెంసేపటికి కన్ను తెరచింది. అటూఇటూ చూసింది. నాకేసికూడా చూసింది. దాని చూపులో ఏవో మార్పు వచ్చింది.

నన్ను గుర్తుపట్టినట్లుంగి. ముందుకాళ్ళమీద లేవబోయింది. తోక ఆడిస్తున్నాననే అనుకొని ఉంటుంది బహుశా. తోక దాని వశంలో లేదని దానికి తెలిసిఉండదు. వెనకభాగం నేలమీదే ఉండిపోయింది. మెడకలాంటి ముందు కాళ్లమీద కొంతవరకూ లేచింది. ముందుకు రాబోయి పడిపోయి ప్రాణాలు విడిచివేసింది. నేను అక్కడకు వెళ్లకపోయినా బాగుండేది. నేను వెళ్లకముందే అది చచ్చిపోయినా బాగుండేది. నన్నుచూసి అది ఆఖరిసారి చేసిన చేష్ట నా మనస్సులో నాటుకుపోయింది.

ఇంట్లోవాళ్లకీవార్త చెప్పాను. అన్నయ్య విననట్టుగా ఊరుకున్నాడు. మా వదినగారూ, మా ఆవిడమాత్రం "పాపం" అని ఊరుకున్నారు. గోపీ వాళ్ళతో చెప్పాను. వాళ్లు వినిపించుకోనేలేదు. రాణీతోఆడుతూ కేరింతాలు కొడుతున్నారు.

ఇతరుల నాకర్షించే అందచందాలేమీ లేవు టైగరుకు. ఇతరులకు సాయపడే శక్తి సామర్థ్యాలూ లేవు. ఇతరులను వశపరచుకొనే నేర్పు లేదు. దానివల్ల ఎవరికీ ఏవిధమైన ఉపయోగమూ లేదు. అది ఇతరులనుంచి ఆశించినదికూడా ఏమీలేదు. పూటకి గుప్పెడు మజ్జిగలో తడిపిన మెతుకులే దానికి కావలసింది. ఆ కొద్ది మెతుకులకి బదులుగా తన దగ్గరఉన్న ఒక్క వస్తువూ అర్థంలేని వెర్రిప్రేమ ఈయగలదు. కాని ప్రతివిషయం ఉపయోగమా కాదా అనే దృష్టితో చూసే ఈ లోకంలో దాని వెర్రిప్రేమ ఎవరికి కావాలి! ★

పథేర్ పాంచాలి

(18 వ పేజీ తరువాయి)

అడవిచెట్ల వాసనలు, చింకిచదరలు, పాతపుస్తకాలు, క్రింద అలికిన నేల, కోసివారేసిన పొగాకుకాడల మొదళ్ల వాసనలు— అన్నీ కలిసి ఓ విచిత్రమైన వాసన క్రమ్ముకునేది.

ఆనాటి ఊహాచిత్రం—

ఆ గ్రామంలో చల్లని చెట్ల నీడలదారిలో ఓ అమాయికపు పల్లెటూరి బాలుడు పుస్తకాలదస్తరం చంకనపెట్టుకుని అక్క వెనకాలే, తెల్లగా ఉతికి, మాసికలేసి కుట్టిన దుస్తులు వేసుకుని బళ్లోంచి తిరిగివస్తూ ఉంటాడు. ఒత్తుగా పట్టులా, మెత్తగా ఉండే వాడి జుట్టుని అమ్మ నున్నగా దువ్వి పంపుతుంది. చక్రాల్లాంటి వాడి కళ్ళలో విలక్షణమైన చూపు వ్యక్తమవుతూంటుంది. చుట్టూ చెట్లూ—పుట్టలూ—ఈమధ్యనున్న ఈకాస్తే వాడికి పరిచితమైన దేశం. ఇక్కడే తల్లి రోజూ అన్నం నోట్లోపెట్టి, తలదువ్వుతూంటుంది. అక్క గుడ్డలు తొడుగుతుంది. ఈ హద్దులు దాటిపోతే ఇంకేమవ్వాఉందా! అంతా అపార సముద్రమే! ఆ పసి హృదయానికి పట్టు దొరకదు......

ఒకనాడు బళ్లో వాడికి అపూర్వమైన ఒక అనుభవం కలిగింది. అది వాడి జీవితంలో ఒక నూతన అభిజ్ఞత.

ఆరోజు సాయంత్రం పైవాళ్లు ఎవరూ రాలేదు; బళ్లో తాతఖానీ లేదు. పాఠాలు జరుగుతున్నాయి. అపూ వాచకం చదువుతున్నాడు. ఇంతలో పంతులుగారు "పలక తీసుకో, నేను చెపుతా, రాద్దువుగాని" అన్నాడు.

ఊరికే నోటితో చెపుతున్నా పంతులుగారు చెపుతున్నది తన పుస్తకంలోనిది కాదని, దాశరాయ్ పాంచాలీ గీతావళిలోని పదాల్లాంటివి తనకు కంఠతః వచ్చినమాదిరే చెపుతున్నాడని అపూ గ్రహించాడు.

★ పథేర్ పాంచాలీ ★

వింటున్న కొద్దీ ఇన్ని చక్కని మాట లెప్పుడూ ఒక్కసారిగా వినలేదనిపించింది. వాడికి అందులో అన్ని మాటలకీ అర్థం తెలియదు కాని ఆపదాల సొంపు, ఆ మాటల్లోని స్వరమాధుర్యం వాడి పసి చెవులకు అపూర్వంగా ఉన్నాయి. ఆ మాటల అర్థం తెలియక పోవటంవల్లనే మంచు తెర కప్పినట్టున్న ఆ శబ్దసముదాయం మాటునుంచి ఏదో ఓ అపూర్వ దేశపు చిత్తరువు లీలగా కన్పించింది.

పెద్దవాడైన తరవాత ఆ కథ ఎక్కడిదో కనుక్కున్నాడు.

'ఆ జనస్థానమునకు మధ్యనున్న ప్రస్రవణ గిరి ఇదే. దీని శిఖరప్రదేశమున ఆకాశపథములో, సతత సమీరసంచలిత జలధరాచ్ఛాదితమై, సాంద్రనీలిమాలంకృతమైన పర్వతోపరిభాగమూ, ఘనసన్నివిష్టనిబిడపాదప సమాచ్ఛన్న స్నిగ్ధశీతల రమణీయ...పాదపస్థలిని ప్రసన్నసలిలయైన గోదావరీనది తరంగ విస్తృతయగుచు...' వాడు సరిగా మాటల్లో వ్యక్తం చెయ్యలేడు; కాని వాడికి తెలుసు — చాలాసార్లు గోచరించింది కూడా.. రెండేళ్ల క్రితం సరస్వతీ పూజనాడు నీలిమైదానంలో ఉత్సవం చూడటానికి వెళ్లినప్పుడు — ఆ మైదానంలోంచి ఎక్కడికో వెళ్లే దారి చూశాడు. దారికి రెండువైపులా ఉన్న తనకి తెలియని చెట్లకేసి, వాటిమీది పక్షుల కేసి చాలా సేపు చూశాడు. ఆ దారి ఎక్కడికి పోతుందో ఎంత ఆలోచించినా అంతు చిక్కలేదు వాడికి.

“ఇది ‘సోనాడాంగా’ మైదానానికి వెళ్లే దారి.’ ‘మాధవపూర్’, ‘దశ్ఘరా’ మీదగా ధలచిత్ రేవుకు వెడుతుంది” అని చెప్పాడు వాళ్ల నాన్న. అది ధలచిత్ రేవుకు వెళ్లేదారి కాదు. ఇంకా ఎంతో దూరం వెళ్లే దారి అని వాడి నమ్మకం. అది రామాయణ మహాభారతాల దేశాలకి వెళ్లే దారి. ఆ అశ్వత్థవృక్షం చిటారుకొమ్మ కేసి చూస్తుంటే స్ఫురణకు వచ్చే దేశానికి వెళ్లే దారి.

పంతులుగారు చెప్తున్న కథ రాస్తున్నప్పుడు ఆ రెండేళ్ల క్రితం చూసిన దారే వాడి కళ్లముందు మెదిలింది.

ఆ దారినే వెడితే ఎంతదూరానో ఆ ప్రస్రవణగిరి! అటు యిటూ చెట్ల గుబుర్ల వాసనలు, మిలమిలలాడుతూ సాంధ్య కాంతులు తెలియకుండానే వచ్చి అలముకోవటం-ఆ స్వప్నలోకపు చిత్తరువు, వాడికి దిగ్భ్రమ కలిగించేది. ఆ ప్రస్రవణగిరి ఉన్నతశిఖరం ఎంతదూరానో? ఆకాశ-పథంలో సర్వదా సంచరించే మేఘమాల ప్రశాంతనీల సౌందర్యం ఎప్పుడూ అలా ఆవరించుకునే ఉంటుందా ?

పెద్దవాడయాక వెళ్లి చూడాలి తాను.

కాని ఆ వేతసీకంటకావృతతీరము, విచిత్రపులినయైన గోదావరి, ఆ శ్యామల జనస్థానము, నీలమేఘ పరివృతమైన ఆ అపూర్వ శైలప్రస్థము -- రామాయణంలో వర్ణితమైన ఏ దేశంలోనూ లేవు. వాటి సృష్టికర్తలు వాల్మీకి కాని, భవభూతిగాని కానేకారు. గడచిన యుగాల్లో-పక్షుల కిలకిలారావాల సంజవేళల ఏ గ్రామ్యబాలకుని అపరిణత శిశుకల్పనా జగత్తులోనో అవి వాస్తవంగా నిర్దుష్టంగా, సుపరిచితమైనవిగా ఉండేవుంటాయి. పృథ్వి మీద ఎన్నడూ యథార్థంగా ఉండటానికి అవకాశంలేని ఆ కాల్పనిక ప్రస్రవణగిరి, మేఘమేఖలావేల్లితమైన దాని నీలిశిఖరాలు-ఒక అనభిజ్ఞ శిశు హృదయంలోనే చెక్కుచెదరకుండా నిలిచివుంటాయి. (ఇంకా ఉంది)

శాకాహారులకు పుష్టికరమైన భోజనము

(44-వ పేజీ తరువాయి)

ముగా ఉర్లగడ్డ స్థౌల్యానికీ, వాతానికి దారి తీస్తుందని శంకిస్తారు. ఉర్లగడ్డలోని పిండి పదార్థము ధాన్యాలలో ఉన్నదానికంటె తక్కువ రకపుది; సులభముగా జీర్ణము కాగలది. గడ్డలలోని పిండిపదార్థము క్షార సంబంధమైనది. ధాన్యాలలోని పిండి పదార్థము పులుపు క్రింద మారగలది.

కూరగాయలలోని ఉప్పు పులుపు సమానత్వముమీద మన దేహారోగ్యము ఆధారపడి ఉంటుంది. వాటిలో నిఖనిజపదార్థము క్షారోత్పత్తికిమూలమైనది. వంటకాలలో తీపి చేర్చుట అంత శ్రేష్ఠమయినదికాదు. అకేవిధముగా ఉడుకుతూఉన్న కూరలలో ఉప్పువేయుటము కూడా అంతమంచిదికాదు. ఆయా ఋతువులలో కాసిన కాయకూరలను పచనము చేసినతరువాత, ఉప్పుచేర్చి, భుజించటమే అత్యంత శ్రేష్ఠమయినది.

ఆహారములో పాలు విధిగా తీసుకొనవలసినదని శాస్త్రదృష్ట్యా చెప్పినంత సులభముగా అన్ని సంసారాలలో జరుగుబాటు ఉండదు. జరుగుబాటు ఉన్నవాళ్లుకూడా చాలామంది ఇతరఖర్చులక్రింద ధనవ్యయము చేస్తారుగాని ఆహారము విషయములో తగిన శ్రద్ధ కనబరచరు. దేహారోగ్యదృష్ట్యా ప్రతి కుటుంబమూ ప్రాథమికావసరాలలో పాల ఖర్చును సాధ్యమైనంతవరకూ చేర్చుకోవటానికి ప్రయత్నము చేయాలి. ఈ దృష్టితో ఆదాయవ్యయపట్టికలో మార్పులు చేసుకొని, పాలఖర్చును ఇముడ్చుకోవటానికి ప్రయత్నించాలి.

మొలకలేలిన బటానీలను రుబ్బిన 2 ఔన్సుల పచ్చడి, రెండుగోధుమరొట్టెలు, ఆకుకూరలశాకము, ఒకకప్పు మజ్జిగగాని పెరుగుగాని ఒకపూట భోజనముగా తీసుకొన్నట్లయితే అది సమధాతువైన ఆహారమనిపించుకొంటుంది. ఈ నిర్ణయము ననుసరించిన ఆహారముకొరకు అధిక వ్యయము కాగలదను భయము అంతగా ఉండదు.

‘సాధారణముగా మనము తీసుకొనే ఆహారములో పాలు రొట్టె వెన్న కాఫీ క్రీముగల కూరగాయలు ధాన్యాలు పప్పులు ఉండనే ఉంటున్నాయి. ఈ జాబితా క్రొత్తదికాదు’ అని ఇల్లాండ్రనుకోవటములో ఆశ్చర్యములేదు. కాని వాళ్లను కొన్ని సమస్యలు పీడిస్తునే ఉంటాయి’— ఎంతమంచి ఆహారము యిచ్చినా పిల్లలు పెరుగవలసినట్టుగా పెరుగరేమి? నిస్సత్తువగా ఉంటారేమి? కండరాలలో బలము లేదేమి? మానసికముగాగాని శారీరకముగాగానీ వేగముగా అలసట కలుగుతున్నదేమి? అల్పవయసులోనే వృద్ధాప్యము వచ్చినట్టు కనబడుతుందేమి?’ మొదలయినవాటికి సమాధానాలు లభించక గృహిణులు వ్యాకులపడుతూ ఉంటారు. ఈ లక్షణాలలో కొన్ని అనువంశికముగా వచ్చేవి ఉన్నాయి. ఇవి కేవలము ఆహారసంబంధమైన ఆచారాలు వంశపారంపర్యముగా సంక్రమించటముచేత కలిగినవి. ఈ కారణాలచేత గృహిణులు ఆహారపదార్థాలయొక్క విలువలను వాటి ప్రయోజనాలను తెలిసికొనిఉంటే, వాటిని ఉపయోగించటములో తగిన శ్రద్ధవహించ గలుగుతారు. కుటుంబముయొక్క ఆరోగ్యము ఒక్క గృహిణిమీద ఆధారపడి ఉంటుంది. ఒకవిధముగా ఆలోచిస్తే, జాతియొక్క ఆరోగ్యమూ పటుత్వమూ స్త్రీలపైన ఆధారపడిఉన్నట్లేగా ! ★



నారసింహ లేహ్యము

బంగారముతో చేరినది. మేహము నిక్లాక, నిస్సత్తువ వగైరా హరించి బలము రక్తవృద్ధి కల్గించును. 20తు. డబ్బీ రు. 3-4-0 పోస్టేజి అ 15.

పి. వి. పి. అండ్ కో, (ఆయుర్వేద సమాజం)

పెరిదేపి, నెల్లూరు జిల్లా

అకాల నెరత, బట్టను ఆపుటకు
కాష్మీర్-కుసుం
మీ ఇష్టమైన నూనెలో నానవ్వండి
యునైటెడ్ కేసరక్, బందరు వీధి, మదాసు-1. విజయవాడ.
చర్మ ఉపద్రవములకు, అపాయములకు
అత్యున్నతమైన సుగంధ ములాము
సాంటలక్స్
గజ్జి, పుండ్లు, కాయలు మొటిమలు

Printed and Published for Nageswara Rao Estates (Private) Ltd., by S. Radha Krishna at The Andhra Patrika Press, 6 & 7. Thambu Chetty Street, Madras-1. Editor S Sambhu Prasad.



కంచి, కైలాసనాథాలయంలో ద్వారపాలక ప్రతిమ

—ఫోటో: వి. కేశవశర్మ.

LOT FOR LITTLE



చిన్న మొత్తాలకు బోలెడు సరకు

తెలివైన కొనుగోలుదారులు ఎల్లప్పుడూ నాణ్యత, పనితనం, మన్నికల కలయికకై చూస్తారు. ఆ విధంగానే, ఇంటి స్టెయిన్ లెస్ స్టీల్ వస్తువుల అవసరం వచ్చినప్పుడెల్లా "దేవిదయాళ్" సరకునే ఎక్కువగా కోరుతారు. దేవిదయాళ్ ను కొనటమంటే, శ్రేష్ఠమైనవాటిని కొనటమే. కాంతిపోదు. జీవితమంతా ఉంటుంది. మీ ఇంటికి ఘనతను, శోభను చేకూరుస్తుంది. కలిగి ఉండటమే గర్వకారణంగా భావించే బహుకొద్ది వస్తువులలో ఇదొకటి. కొన్ని వాటిసొమ్ముకు, బోలెడు వస్తువులు 'దేవిదయాళ్' కొనటంతో సొంతం చేసుకున్నా.



DEVIDAYAL'S

"దేవిదయాళ్" స్టెయిన్ లెస్ స్టీల్

వెండికంటె మెరుగైనవి, మేలైనవి -అయినా కూడా సరసమైనవి.

మేనేజర్సు: దేవిదయాళ్ సేల్సు లిమిటెడ్.,
35, మెయిన్‌రోడ్డు, రాయపురం, మద్రాసు-13.

NATIONAL-SA
DD-4